మంగళవారం
24-6-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 273
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇరాన్-ఇజ్రాయిల్ యుద్ధంలో తలదూర్చం: పుతిన్

మాస్కో: ఇరాన్‌పై అమెరికా మెరుపుదాడులు చేసిన క్రమంలో ఇరాన్‌కు సుదీర్ఘకాలంగా మిత్రదేశమైన రష్యా సాయం చేసేందుకు ముందుకురాకపోవడం చర్చనీయాంశమైంది. దీనిపై రష్యా అధ్యక్షుడు పుతిన్ స్పందించారు. ఈ యుద్ధంలో తాము తటస్థంగా ఎందుకు ఉంటున్నామో వివరించారు. ఒకప్పటి సోవియట్ యూనియన్, ఇప్పటి రష్యన్ ఫెడరేషన్‌కు చెందిన దాదాపు 20లక్షల మంది ఇజ్రాయిల్‌లో నివసిస్తున్నారన్నారు. తమ దృష్టిలో ఇప్పుడది దాదాపు రష్యన్ మాట్లాడే దేశమేనని... దానిని పరిగణనలోకి తీసుకునే ఈ ఉద్రిక్తతల్లో మేం తటస్థంగా వ్యవహరించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరమ్‌లో పుతిన్ ఈ సంగతి వెల్లడించారు.

అమెరికా దాడిని ఖండించే ధైర్యం లేదా?

న్యూఢిల్లీ: ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండించడానికి మోదీ సర్కారుకు ధైర్యం లేకపోయిందని కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. కనీసం నైతిక ధైర్యాన్నయినా ప్రదర్శించాలని ప్రదర్శించాలని ఎద్దేవా చేసింది. ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండిస్తూ... 'ఇరాన్-ఇజ్రాయిల్‌లు ఘర్షణలకు బదులుగా దౌత్య చర్చలు జరపాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హితబోధ చేశారు. కానీ తన మాటనే అపహాస్యం చేస్తూ ఇరాన్‌పై నేరుగా వైమానిక దాడి చేశారు' అని విమర్శించింది. 'ఇరాన్‌తో భారత్ తక్షణమే దౌత్య చర్చలు

- మిగతా 2 లో

ఎయిరిండియా విమానం వెనక్కి!

న్యూఢిల్లీ: ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు ప్రయాణికులతో బయలుదేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఊహించని విధంగా వెనుదిరిగింది. మార్గమధ్యంలో జమ్ములో ఆగాల్సి ఉండగా, అక్కడ ల్యాండ్ కాకుండానే తిరిగి ఢిల్లీకి చేరుకుంది. ఈ సంఘటన సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఐఎక్స్-2564 విమానం ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు బయలుదేరింది. షెడ్యూల్ ప్రకారం, ఈ విమానం మొదట జమ్ములో ఆగాల్సి ఉంది. అయితే, జమ్ము

- మిగతా 2 లో

ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

కీవ్: రష్యా మరోమారు ఉక్రెయిన్‌పై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కీవ్‌పై 350కి పైగా డ్రోన్లు, 11 క్షిపణులతో విరుచుకుపడినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. ఈ దాడిలో 10మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా... అనేక నివాస భవనాలు, ఆస్పత్రులు, వాహనాలు ధ్వంసం అయినట్లు పేర్కొన్నారు. భవనాల శిథిలాల కింద అనేక మంది ప్రజలు చిక్కుకున్నారని..వారిని బయటకు తీసుకువచ్చేందుకు భద్రతా బలగాలు సహాయక చర్యలు

- మిగతా 2 లో

రైతుభరోసా... ఓ చరిత్ర

- 9 రోజుల్లోనే రైతు ఖాతాల్లో రూ.9 వేల కోట్లు
- ఇది ప్రజాప్రభుత్వం ఘనత
- నేడు మండల కేంద్రాల్లో సంబరాలు: భట్టి

విశాలాంధ్ర- హైదరాబాద్: తెలంగాణలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనట్లుగా కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.తొమ్మిది వేల కోట్లతో రైతు భరోసా అందజేసినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గాంధీ భవన్‌లో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ, ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలండర్, పేదలకు సన్నబియ్యం వంటి ఎన్నో పథకాలను ప్రజల దరికి చేరుస్తున్నట్టు పేర్కొన్నారు. సీజన్ మొదలు కాగానే ఎకరాకు గతంలో రూ. 10 వేలుంటే.. రెండువేలు జోడించి రూ. 12 వేలు ఇచ్చినట్టు చెప్పారు. 1,49,39,111 ఎకరాలకు రైతు భరోసా ఇస్తున్నట్టు తెలిపారు. కేవలం తొమ్మిది రోజుల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ చేసినట్టు తెలిపారు. రైతు వేదికల వద్ద రైతులను సమావేశ పరుస్తామన్నారు. సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి, మంత్రులు సందేశాన్ని ఇస్తారన్నారు. తొమ్మిది రోజుల్లో కోటిన్నర ఎకరాలకు రైతు భరోసా నిధులు అందించిన విషయాన్ని వివరించాలన్నారు. ఇది ప్రజాప్రభుత్వం ఘనత అన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో మంగళవారం సాయంత్రం పెద్ద ఎత్తున సంబరాలు చేట్టాలని సూచించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల రాష్ట్ర ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు ప్రభుత్వం అండ

మంత్రి తుమ్మల

విశాలాంధ్ర - హైదరాబాద్: రైతు భరోసా విజయోత్సవ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం ప్రాంగణాన్ని మంగళవారం సాయంత్రం చేపట్టబోయే రైతు భరోసా విజయోత్సవ సభ ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి మంత్రి సోమవారం పరిశీలించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగానికి

- మిగతా 2 లో

అమెరికాను వదిలి పెట్టం

ఇరాన్ సుప్రీం లీడర్ ఖామేనీ హెచ్చరిక

- ఇజ్రాయిల్‌పై క్షిపణుల వర్షం
- ఎయిర్‌పోర్టులు లక్ష్యంగా ఇజ్రాయిల్ వైమానిక దాడులు
- తీవ్ర నష్టం కలిగించామన్న ఐడీఎఫ్
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్ర రూపం

టెల్‌అవీవ్/టెహ్రాన్: ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా దాడి చేయడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. అమెరికా, ఇజ్రాయిల్ దాడులపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. అమెరికాకు కోలుకోలేని గాయం ఏర్పరుస్తామని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖామేనీ హెచ్చరించారు. అమెరికాకు గట్టి సమాధానం ఇస్తామని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కూడా హెచ్చరించారు. ప్రపంచదేశాలకు ముడి చమురు, సహజ వాయువు సరఫరాకు కీలకమైన హార్ముజ్ జలసంధిని మూసివేసే ప్రతిపాదనకు ఇరాన్ పార్లమెంటు ఆమోదం తెలిపింది. దీనిపై ఖమేనీ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో విస్తృత ప్రాంతీయ సంఘర్షణలు రేకెత్తే ప్రమాదం పొంచి ఉందని...ఇరుదేశాలు సంయమం పాటించాలని పిలుపునిచ్చాయి. మరోవైపు ఇజ్రాయిల్-ఇరాన్ పరస్పర దాడులు కొనసాగిస్తున్నాయి. సోమవారం ఉదయం ఇజ్రాయిల్ వాయుసేన టెహ్రాన్‌లోని కెర్మాన్‌షా ప్రాంతంలోని ఇరానియన్ బాలిస్టిక్ క్షిపణి ప్రయోగ స్థావరాల ను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటించింది. ఆరు విమానాశ్రయాలపై దాడులు చేసి, 15 సైనిక విమానాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది. ఈ దాడుల్లో రన్‌వేలు, భూగర్భ బంకర్లు, ఒక రీఫ్యూయెలింగ్ విమానం, ఇరాన్ ప్రభుత్వానికి చెందిన ఎఫ్-14, ఎఫ్-5, మరియు ఏహెచ్-1 విమానాలు

- మిగతా 2 లో

ప్రజలతో విశాలాంధ్ర మమేకం

- చారిత్రక అపురూప పత్రిక... తెలుగు రాష్ట్రాల్లో చెరగని ముద్ర
- పేదల కోసమే కమ్యూనిస్టుల ఉద్యమం
- సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్
- ఘనంగా విశాలాంధ్ర 73వ వార్షికోత్సవ సభ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రజలతో నిరంతరం మమేకమైన విశాలాంధ్ర దినపత్రిక ఎప్పటికీ ఒక చారిత్రక అపురూపమైన పత్రికగా విలసిల్లుతోందని, ఎన్ని కష్టాలు ఎదురైనా తనదైన శైలిలో ముందుకు సాగుతోందని సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అన్నారు. విశాలాంధ్ర చరిత్ర ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో మిళితమై ఉందని కొనియాడారు. విజయవాడ చంద్రం బిల్డింగ్స్‌లో విశాలాంధ్ర జాతీయ దినపత్రిక 73 వార్షికోత్సవ సభను విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆలపాటి సురేశ్ కుమార్ ప్రసంగిస్తూ విశాలాంధ్ర వార్షికోత్సవానికి రావడం తన అదృష్టమని అన్నారు. ఈ సందర్భంగా దినపత్రిక జర్నలిస్టులకు, సిబ్బందికి, యాజమాన్యానికి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తనకు తెలిసిన, చూసిన జర్నలిస్టు రాఘవాచారి అని... ఆయన హయాంలో తన జర్నలిజం ప్రస్థానాన్ని ఆలపాటి గుర్తుచేసుకున్నారు. విశాలాంధ్రకు తెలుగు రాష్ట్రాల్లో ఆదరణ అద్భుతమని, భాషా ప్రయుక్త రాష్ట్రాల్లోనూ తనదైన చెరగని ముద్ర వేసుకుందని నొక్కి చెప్పారు. ప్రస్తుత తరుణంలో రాష్ట్రంలో విశాలాంధ్ర మరింతగా ప్రజలతో మమేకం అయ్యేలా విస్తరించాలని, ఇందుకోసం అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రీయ వర్తమాన అంశాలపై ప్రధాన దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ప్రజా సమస్యలు, ప్రజా ప్రయోజనాల్లో మిళితం కావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. మారుతున్న సాంకేతిక రంగం, సోషల్ మీడియా విస్తృతితో విశాలాంధ్రను మల్టీమీడియా రంగం వైపునకు మళ్లించాలని, కాలానుకనుగుణంగా మరింత గొప్ప స్థాయికి తీసుకువెళ్లాలని కోరారు. తనకు కమ్యూనిస్టులు అంటే ఎంతో గౌరవమని, వారి ఉద్యమాలు, నిరంతరం పేదల కోసం పని చేయడం గొప్ప

- మిగతా 2 లో

అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఆప్ సత్తా

- రెండు స్థానాల్లో విజయం
- విశావదర్‌లో మరోసారి బీజేపీకి షాక్
- బెంగాల్‌లో టీఎంసీ, కేరళలో కాంగ్రెస్ గెలుపు

న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా జూన్ 19న నాలుగు రాష్ట్రాల్లోని ఐదు అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగ్గా.. సోమవారం ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఈ ఉప ఎన్నికల్లో గుజరాత్‌లో ఆప్ ఒక స్థానాన్ని కైవసం చేసుకొని సత్తా చాటింది. విశావదర్ సీటు నుంచి బీజేపీ అభ్యర్థి కిరీట్ పటేల్‌పై ఆప్ నేత గోపాల్ ఇటాలియా 17వేల పైచిలుకు ఓట్లతేడాతో గెలుపొందారు. గుజరాత్‌లో బీజేపీకి పూర్తి ఆధిపత్యం ఉన్నప్పటికీ.. 2007 నుంచి విశావదర్ స్థానాన్ని గెలుచుకోలేకపోతోంది. అయితే, గత ఎన్నికల్లో ఈ సీటులో ఆప్ కైవసం చేసుకున్నప్పటికీ... ఎమ్మెల్యే భూపేంద్ర భయానీ ఆప్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీంతో ఆ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో మళ్లీ ఆప్ విజయం సాధించడం ద్వారా బీజేపీకి షాక్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

'ఉపాధి' పనిదినాలు రెట్టింపు కోసం కేంద్రాన్ని కోరతాం: మంత్రి సీతక్క

విశాలాంధ్ర-హైదరాబాద్: గతంలో మాదిరిగా 12 కోట్ల పని దినాలు తెలంగాణకు కేటాయించాలని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పని దినాలు రెట్టింపు చేయాలని కోరినట్టు పేర్కొన్నారు. కేంద్రం నుంచి అనుమతులు వస్తాయన్న నమ్మకంతో ఉపాధి పనులను వేగవంతం చేసినట్టు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 18.9 లక్షల కుటుంబాల్లోని 28.48 లక్షల మంది కూలీలకు పని కల్పించినట్టు వివరించారు. ఒక్కో కుటుంబం సగటున 24 రోజుల పని దినాలను, 1,127 కుటుంబాలు వంద రోజుల పనిదినాలను పూర్తి చేసుకున్నట్టు చెప్పారు. సగటున ఒక్కో కూలీకి రూ. 250.75 రోజువారి వేతనం లభిస్తుందన్నారు. రూ.307 దక్కెలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తూ కూలి గిట్టుబాటు అయ్యేలా చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. వ్యవసాయ

- మిగతా 2 లో

చేతివృత్తులను ప్రోత్సహించండి

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ బోనాల ఉత్సవాలు సంధర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 29 వరకు అంటే ఐదు రోజులు చేతివృత్తుల కళాకారులు తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన... విక్రయం టాంక్ బండ్ సమీపంలో నిర్వహిస్తున్నట్టు మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మట్టిపాత్రలు, 'నిరా' స్టాల్, వెదురు వస్తువులు, హ్యాండ్ లూమ్స్ (పోచంపల్లి ఇక్కత్, గద్వాల్, నారాయణపేట్) పూసలవారి సామగ్రి, తెలంగాణ వంటకాలు, చేప వంటకాలు, భోజన స్టాల్స్ ప్రదర్శించబడతాయని వివరించారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 09.30 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రజలు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వస్తువులు కొనుగోలు చేసి చేతివృత్తులవారిని ప్రొత్సహించాలని కోరారు.

అమెరికాలో పెల్లుబికిన నిరసనలు

వాషింగ్టన్: ఇరాన్ అణుక్షేత్రాలపై బాంబుల వర్షం కురిపించిన నేపథ్యంలో అమెరికాలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైఖరిని తప్పుబడుతూ ఆ దేశ ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రధాన నగరాల్లో ఇరాన్‌కు మద్దతుగా పెద్ద ఎత్తున ప్రజలు ఆందోళనకు దిగారు. ఇరాన్‌కు అనుకూలంగా ప్రదర్శన చేపట్టారు. 'ఇరాన్‌పై దాడులు ఆపండి', 'ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం వద్దు' అనే నినాదాలతో పెద్ద ఎత్తున ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ మేరకు యుద్ధ వ్యతిరేక నినాదాలు చేశారు. న్యూయార్క్, బోస్టన్, చికాగో, వాషింగ్టన్ డీసీ వంటి నగరాల్లో వందలాది మంది నిరసన కారులు యుద్ధానికి వ్యతిరేకంగా ఆందోళనల్లో పాల్గొన్నారు. వాషింగ్టన్ డీసీలోని వైట్‌హౌస్ వెలుపల, న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్‌లో ప్రదర్శనకారులు గుమిగూడారు. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు మద్దతివ్వడం మానుకోవాలని, ఇరాన్‌తో సంఘర్షణలో జోక్యం చేసుకోవద్దని డిమాండ్ చేశారు. అందరూ ఊహించినట్టుగానే ఇజ్రాయిల్‌కు మద్దతుగా అమెరికా యుద్ధరంగంలోకి దిగింది. ఇరాన్ విషయంలో రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటామని చెప్పి రెండు రోజుల్లో దాడులకు తెగబడింది. ఆదివారం తెల్లవారుజామున ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలు లక్ష్యంగా బంకర్ బస్టర్ బాంబులతో అమెరికా విరుచుకుపడిన విషయం విదితమే. ఈ దాడులను 25 నిమిషాల్లో ముగించింది. సుమారు 125 యుద్ధ విమానాలు, ఏడు బీ-2 స్టెల్త్ బాంబర్లతో దాడి చేసింది. జలాంతర్గామి నుంచి ప్రయోగించిన స్టెల్త్ బాంబర్లు రెండు అణు కేంద్రాలపై బంకర్ బస్టర్ బాంబులను జారవిడువగా, మరో అణు కేంద్రంపై క్షిపణులతో దాడికి పాల్పడింది. బంకర్ బస్టర్ బాంబులు భూగర్భంలోని బంకర్లలోకి చొచ్చుకుపోయి అణు కేంద్రాలను ధ్వంసం చేశాయి.

ఫర్డో అణు కేంద్రానికి తీవ్ర నష్టం

అణుశక్తి సంస్థ వెల్లడి

వియన్నా: ఇరాన్‌లోని ఫర్డో భూగర్భ అణు కేంద్రంపై అమెరికా జరిపిన దాడిలో తీవ్రమైన నష్టం వాటిల్లి ఉంటుందని ఐక్యరాజ్యసమితి అణు పర్యవేక్షక సంస్థ (ఐఏఈఏ) అధిపతి రఫెల్ మరియానో గ్రోస్సీ వెల్లడించారు. అత్యాధునిక బంకర్-బస్టర్ బాంబులను ఈ దాడిలో ఉపయోగించినట్లు ఆయన తెలిపారు.వియన్నాలో గ్రోస్సీ మాట్లాడుతూ, "దాడిలో ఉపయోగించిన పేలుడు పదార్థాల మోతాదు, అలాగే సెంట్రీఫ్యూజ్‌లు అత్యంత సున్నితంగా కంపనాలకు ప్రతిస్పందించే స్వభావం కలిగి ఉండటం వల్ల చాలా గణనీయమైన నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నాం" అని వివరించారు. ఫర్డో అణు కేంద్రం ఇరాన్ కీలకమైన యురేనియం శుద్ధి కేంద్రాలలో ఒకటిగా పేరు పొందింది. అయితే, ఫర్డోలోని భూగర్భంలో జరిగిన నష్టాన్ని పూర్తిగా అంచనా వేయగల స్థితిలో ప్రస్తుతం ఐఏఈఏతో సహా మరెవరూ గ్రోస్సీ స్పష్టం చేశారు. "ఈ సమయంలో, ఫర్డోలోని భూగర్భ నష్టాన్ని పూర్తిగా అంచనా వేయడానికి ఐఏఈఏతో సహా ఎవరి వద్దా కచ్చితమైన సమాచారం లేదు" అని ఆయన అన్నారు. దాడి జరిగిన ప్రదేశానికి తక్షణమే ప్రవేశం లభించే అవకాశాలు తక్కువగా ఉండటంతో, నష్టంపై పూర్తి స్పష్టత రావడానికి కొంత సమయం పట్టవచ్చని తెలుస్తోంది.

అమెరికా ఫలితం అనుభవించక తప్పదు

ఇరాన్ మిలిటరీ హెచ్చరిక

టెహ్రాన్: ఇజ్రాయిల్‌కు మద్దతుగా తమ అణుస్థావరాలపై అమెరికా బాంబర్లతో దాడులకు తెగబడటాన్ని ఇరాన్ మిలిటరీ సెంట్రల్ కమాండ్ ఖండించింది. అమెరికాపై మరింత శక్తివంతమైన చర్యలకు పాల్పడతామని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్‌ను హెచ్చరించింది. యుద్ధం ప్రారంభించింది అమెరికా అయినప్పటికీ... ముగింపు పలికేది మాత్రం తామేనని పేర్కొంది. ఇజ్రాయిల్-ఇరాన్‌ల మధ్య జరుగుతున్న యుద్ధంలోకి అమెరికా ప్రవేశించి... తమ దళాలకు చట్టబద్ధమైన లక్ష్యాల పరిధిని అధికారికంగా విస్తరించిందని ఇరాన్ మిలిటరీ కమాండ్ పేర్కొంది. తమ దళాలు ఇజ్రాయిల్ సహా అమెరికా స్థావరాలపై మరిన్ని విస్తృత దాడులకు సిద్ధమవుతున్నాయని తెలిపింది. ఇరాన్ గగనతల నిబంధనలను ఉల్లంఘించి... అమెరికా అతిపెద్ద నేరం చేసిందని.. దాని ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించింది. తమపై దాడులు కొనసాగుతున్నప్పటికీ యురేనియం అభివృద్ధిని కొనసాగిస్తామని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి మాజిద్ తఖ్త్-రావంచి ప్రకటించారు. ఇజ్రాయిల్, అమెరికా తమపై చేస్తున్న దాడులతో నిరుత్సాహపడకుండా యురేనియం సుసంపన్న కార్యక్రమాన్ని మరింత ముందుకుతీసుకువెళ్తామని పేర్కొన్నారు. తాము ఏం చేయాలి...ఏం చేయకూడదనే విషయాలను ఎవరూ చెప్పక్కరలేదని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీం నేత ఖమేనీ సైతం అమెరికా దాడులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ దాడులకు తగిన ఫలితాన్ని అగ్రరాజ్యం అనుభవిస్తుందని హెచ్చరించారు. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలు, పౌరులే లక్ష్యంగా టెహ్రాన్ దాడులకు సిద్ధమవుతోందని ఇరాన్ మీడియా వెల్లడించింది. కాగా ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ.. ఇరాన్‌లోని అణు స్థావరాలపై చేపట్టిన దాడులు తమ లక్ష్యానికి చేరువవడంతో టెహ్రాన్‌పై సుదీర్ఘకాల యుద్ధం కొనసాగించమని పేర్కొన్నారు.

అమెరికాను వదిలిపెట్టం

(మొదటిపేజీ తరువాయి)

ధ్వంసమైనట్లు పేర్కొంది. ఈ ఆపరేషన్‌లో రిమోట్‌గా నడిచే మానవరహిత విమానాలను (డ్రోన్లు) ఉపయోగించినట్లు పేర్కొంది. ఈ దాడి తర్వాత ఇరాన్ సైతం ఇజ్రాయిల్‌పై బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. రాజధాని జెరూసలేం, టెల్‌అవీవ్ సహా ప్రధాన నగరాలపై దాదాపు 15 క్షిపణులను ప్రయోగించింది. జెరూసలేంలో పెద్ద ఎత్తున పేలుళ్ల వినిపించినట్లు ప్రముఖ వార్తా సంస్థ ఏఎఫ్‌పీ నివేదించింది. ఉత్తర ఇజ్రాయిల్ అంతటా సైరన్లు మోగినట్లు పేర్కొంది. ఈ దాడులను ఇజ్రాయిల్ సైన్యం కూడా ధృవీకరించింది.

ఇజ్రాయిల్ దాడుల్లో 500కు చేరిన మృతులు: ఇరాన్ మీడియా

ఇరాన్‌పై ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దాడుల కారణంగా మృతిచెందినవారి సంఖ్య 500కు చేరిందని ఇరాన్ మీడియా వెల్లడించింది. ఈ దాడుల్లో సుమారు మూడు వేల మంది గాయపడినట్లు ఆ దేశ ఆరోగ్య శాఖ అధికారికంగా ప్రకటించింది. జూన్ 13వ తేదీ నుంచి ఇజ్రాయిల్, ఇరాన్‌పై దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. అంతర్జాతీయ మీడియా సంస్థలపై ఇరాన్ ప్రభుత్వం ఆంక్షలు విధించడంతో, ఆ దేశంలోకి ప్రవేశించడం అనేక వార్తా సంస్థలకు సాధ్యపడటం లేదు. దీంతో ఇజ్రాయిల్ దాడుల వల్ల జరిగిన వాస్తవ నష్టంపై స్పష్టమైన అంచనాకు రావడం కష్టతరంగా మారింది. అయితే, ఇరాన్‌లో పనిచేస్తున్న మానవ హక్కుల సంస్థలు మాత్రం మృతుల సంఖ్య అధికారిక లెక్కల కంటే రెట్టింపుగా ఉండవచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఫర్డో భూగర్భ అణుకేంద్రంపై మరోసారి దాడి జరిగినట్లు ఆ దేశ అధికారిక మీడియా పేర్కొంది. అయితే ఈ దాడి వల్ల ఏ మేరకు నష్టం జరిగిందో వెల్లడించలేదు. అమెరికా- ఇరాన్‌లోని మూడు అణుకేంద్రాలపై దాడి చేసిన ఒక్కరోజు తరువాత మళ్లీ అదే తరహా దాడి జరగడం గమనార్హం. అయితే ఈ దాడి ఎవరు చేశారనేది మీడియా వెల్లడించలేదు. ఇజ్రాయిల్ తో ఘర్షణ కొనసాగుతున్న వేళ, ఆ దేశమే దాడి చేసిందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

నిలిచిన విమాన రాకపోకలు

ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ గగనతలంలోకి వాణిజ్య విమానాలు ప్రవేశించడం లేదు. తాజా సమాచారం ప్రకారం, ఇరాన్‌తో పాటు ఇరాక్, సిరియా, జోర్డాన్, లెబనాన్ గగనతలాలను కూడా వాణిజ్య విమానయాన సంస్థలు పూర్తిగా దూరం పెట్టినట్లు తెలుస్తోంది. దీని ప్రభావంతో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం సుమారు 120 విమానాలు ఆలస్యంగా నడిచాయి. జోర్డాన్‌లోని క్వీన్ అలియా అంతర్జాతీయ విమానాశ్రయంలో దాదాపు 40 శాతం విమాన సర్వీసులు రద్దు అయ్యాయి. యునైటెడ్ ఎయిర్‌లైన్స్ సంస్థ దుబాయ్‌కి వెళ్లే తమ విమానాలను జూలై 3వ తేదీ వరకు రద్దు చేయగా, బ్రిటీష్ ఎయిర్‌వేస్ కూడా దుబాయ్, దోహాలకు తమ విమాన సర్వీసులను నిలిపివేసినట్లు ప్రకటించింది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

తగిన సమయంలో దీటుగా స్పందిస్తాం:ఇరాన్

అమెరికా, ఇజ్రాయెల్ ఇటీవల చేపట్టిన వైమానిక దాడులపై ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ తీవ్రంగా స్పందించారు. అమెరికాపై తగిన సమయంలో స్పందిస్తామని పేర్కొన్నారు. ఆదివారం న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'తమకు పూర్తి రక్షణ హక్కు ఉంది. అమెరికా, ఇజ్రాయిల్ చేసిన దాడులపై ఇరాన్ తగిన విధంగా స్పందిస్తుంది. ఆ స్పందన ఎప్పుడు, ఎలా, ఏ స్థాయిలో ఉంటుందో ఇరాన్ సైనిక బలగాలే నిర్ణయించేది. మరోవైపు దౌత్యాన్ని ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. ఇజ్రాయెల్ ఉద్దేశపూర్వకంగా దౌత్య మార్గాన్ని నాశనం చేసింది. తాము సమాధానానికి సిద్ధంగా ఉన్నట్టు ఇజ్రాయెల్ నటించినా, అది అంతర్జాతీయ సమాజాన్ని మభ్యపెట్టే ప్రయత్నమే అవుతుంది' అని ఆయన అన్నారు.

ఇరాన్ క్షిపణుల పరిధిలో అమెరికన్ దళాలు

ప్రస్తుతం పశ్చిమాసియాలో దాదాపు 10వేల మంది అమెరికన్ సైనికులు ఉన్నారు. వీరు ఉంటున్న స్థావరాలు చాలా వరకు స్వల్ప-శ్రేణి ఇరాన్ క్షిపణుల పరిధిలోనే ఉన్నాయి. మరి వీటిపై ఇరాన్ దాడి చేస్తుందో, లేదో చూడాలి. మరోవైపు, ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో తమ లక్ష్యాలను సాధించడానికి ఇజ్రాయెల్ చాలా దగ్గరగా ఉందని, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి, అణు కేంద్రాలకు ఇప్పటికే గణనీయమైన నష్టం కలిగించామని ఆయన పేర్కొన్నారు. టెహ్రాన్‌తో సుదీర్ఘకాలం పోరాటం చేయడానికి తాను ఇష్టపడనని స్పష్టం చేశారు.

సమన్వయంతో సుపరిపాలన

- అధికారులు-ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలి
- వినూత్న ఆలోచనలతోనే ఆశయ సిద్ధి
- 'సుపరిపాలనలో తొలిఅడుగు'లో ఏపీ సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సమన్వయం, పొలిటికల్ గవర్నెన్స్‌తోనే రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఇందుకోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. యోగా డే స్ఫూర్తితో హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని, మనందరి ఉమ్మడి లక్ష్యం 2047 (స్వర్ణాంధ్ర) కావాలని పిలుపునిచ్చారు. ఐఏఎస్ అధికారులు 'బంగారు కుటుంబాలు'ను దత్తత తీసుకుని.. వాళ్ల ఉన్నతికి కృషి చేయాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లో 15 శాతం వృద్ధి రేటు సాధించాలని, నిర్దిష్ట లక్ష్యాలతో ముందుకెళ్లి... వినూత్నంగా ఆలోచిస్తేనే ఆశయాలు నెరవేరతాయని ముఖ్యమంత్రి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం అమరావతి సచివాలయం సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే ఏంటో చూపిస్తున్నాం...

డబుల్ ఇంజిన్ సర్కారుతో ఎంత అభివృద్ధి జరుగుతుందో చేసి చూపిస్తున్నాం. కేంద్రం సహకారం లేకుంటే ఊపిరి కూడా పీల్చుకోలేని పరిస్థితి నెలకొంది. విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని కాపాడుతామని, పునర్నిర్మిస్తామని ఎన్నికల ముందు ప్రజలకు మాటిచ్చాం. ఏడాదిలోనే అన్నీ చేశామని మేం చెప్పడం లేదు. కానీ ఊహించిన దానికంటే ఎక్కువే చేశామని సీఎం వివరించారు. సమన్వయంతో మూడు పార్టీలు కల్సి పనిచేస్తున్నాయని,అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేస్తే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తైతే చాలావరకు సమస్యలు పరిష్కారమవుతాయి. దక్షిణ భారతదేశంలో నీటి సౌలభ్యం అధికంగా ఉన్న రాష్ట్రం ఏపీ. నదుల అనుసంధానిస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది. కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించి డయాఫ్రం వాల్ కొట్టుకుపోయేలా చేసిందని విమర్శించారు. అన్ని వ్యవస్థలను కుదేలు చేసి వెళ్లిపోయారు. ఒక్క మైనింగ్ శాఖలోనే రూ.10 వేల కోట్ల ఆదాయం పోయింది. ఒప్పందం చేసుకున్న సోలార్ విద్యుత్‌ను వాడకపోవడంతో రూ.9 వేల కోట్లను అప్పనంగా చెల్లించాల్సి వచ్చిందని వివరించారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం...

ఎన్నికల ముందు చెప్పిన విధంగానే ఎంతమంది పిల్లలున్నా తల్లికివందనం ఇస్తామని చెప్పాం..అందరికీ డబ్బులు ఇచ్చాం. మహిళలకు ఉచిత బస్సును కూడా ఆగస్టు 15 నుంచి అమలు చేస్తాం. గౌడలకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చాం. మత్స్యకార సేవలో భాగంగా ఒక్కో కుటుంబానికి రూ.20 వేలు వేట నిషేధ భృతిని అందించాం. భోగాపురం విమానాశ్రయాన్ని శరవేగంగా పూర్తి చేస్తున్నాం అన్నారు.

ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించిన ఎస్పీ

లక్నో: ఉత్తర ప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) కీలక నిర్ణయం తీసుకుంది. అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని ఈ పార్టీ ముగ్గురు ఎమ్మెల్యేలను బహిష్కరించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటంతో పాటు బీజేపీతో వారికి సంబంధాలున్నట్లు ఆరోపించింది. గోసాయిగంజ్ ఎమ్మెల్యే అభయ్ సింగ్, గౌరీగంజ్ ఎమ్మెల్యే రాకేష్ ప్రతాప్ సింగ్, ఉంచహార్ ఎమ్మెల్యే మనోజ్ కుమార్ పాండేను పార్టీ నుంచి బహిష్కరించినట్లు 'ఎక్స్' లో పేర్కొంది. ఈ ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు, మత పరంగా విభజన సృష్టించే ప్రతికూల భావజాల పార్టీతో సంబంధం కలిగి ఉన్నారని ఎస్పీ ఆరోపించింది.

ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

(మొదటిపేజీ తరువాయి)

చేపడుతున్నాయని తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికత్స అందిస్తున్నామని.. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కీవ్‌పై చేసిన దాడిలో రష్యన్ దళాలు ఉత్తర కొరియాకు చెందిన ఆయుధాలను ప్రయోగించాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఇదే విధంగా కిమ్ మాస్కోకు ఆయుధాలను, సైన్యాన్ని పంపిస్తే యుద్ధ పరిస్థితులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ దేశాలు రష్యాపై ఒత్తిడి తేవాలనే తమ డిమాండ్‌ను సోమవారం యూకే పర్యటనకు వెళ్లిన తమ దేశ రక్షణ మంత్రి మరోసారి ప్రపంచ దేశాలకు వినిపించనున్నారని పేర్కొన్నారు. అదే విధంగా ఈ వారం హేగ్‌లో జరిగే నాటో శిఖరాగ్ర సమావేశానికి ముందు తాను లండన్‌లో ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్‌తో సమావేశం అవ్వనున్నట్లు తెలిపారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించాలని జెలెన్‌స్కీ పశ్చిమ దేశాలను కోరారు.

'ఉపాధి' పనిదినాలు రెట్టింపు కోసం కేంద్రాన్ని కోరతాం: మంత్రి సీతక్క

(మొదటిపేజీ తరువాయి)

అనుబంధ పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఉపాధి పనుల్లో 60 శాతం వ్యవసాయ అనుబంధ పనులు చేయించాలని లక్ష్యం పెట్టుకోగా... 50 శాతంగా నమోదయ్యాయన్నారు. మే మాసం ముగిసే నాటికి రూ. 1,416 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. కూలీల ఖాతాల్లో 733.52 కోట్లు జమ చేసినట్టు చెప్పారు. గత ఏడాదితో పోలిస్తే ఉపాధి పనిదినాలను సగానికి కేంద్ర ప్రభుత్వం కుదించింది. దీనిపై తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ...కేంద్ర ప్రభుత్వానికి మంత్రి సీతక్క లేఖ రాశారు. కాగా,రాష్ట్రంలో కేంద్రం కేటాయించిన ఆరున్నర కోట్ల పనిదినాల్లో ఇప్పటికే 4.53 కోట్ల పనిదినాలను పూర్తి చేసింది. అంటే పనిదినాల్లో 70 శాతం టార్గెట్‌ను చేరుకున్నట్లయింది.

రైతన్నకు ప్రభుత్వం అండ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం అండగా నిలుస్తుందని, తెలంగాణ రైతులను రాజులుగా చూడాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. రైతుల వ్యవసాయ పనులకు తొలకరికి ముందుగానే రైతు భరోసాను తొమ్మిది రోజులలో రూ. 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ కింద రూ. 21 వేల కోట్లు చెల్లించటం జరిగిందని అన్నారు. సభ నిర్వహణ నేపథ్యంలో నిరంతర విద్యుత్, తాగునీరు అలాగే షామియానాలు, సీటింగ్ కెపాసిటీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో కలసి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, ప్రిన్సిపల్ సెక్రటరీ అహమ్మద్ నదీమ్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ పోలీస్ సీవీ ఆనంద్, అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్స్ ఎంఎం భగవత్, ట్రాన్స్‌పోర్టు శాఖ కమిషనర్ సురేందర్ మోహన్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్,, ఐ అండ్ పి ఆర్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష, విద్యుత్ శాఖ ఎండి ముష్రాఫ్ అలీ ఫారుక్, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి,వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అమెరికా దాడిని ఖండించే ధైర్యం లేదా?

(మొదటిపేజీ తరువాయి)

జరపాల్సిన ఆవశ్యకత ఉంది. భారత ప్రభుత్వం ఇప్పటి వరకు ఉన్నదాని కంటే ఎక్కువ నైతిక ధైర్యాన్ని ప్రదర్శించాలి' అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'ఇరాన్‌పై అమెరికా చేసిన బాంబుదాడిని, ఇజ్రాయిల్ దురాక్రమణను, అది చేసే బాంబు దాడులను, హత్యలను మోదీ ప్రభుత్వం నిస్సందేహంగా విమర్శించలేదు. ఖండించలేదు' అని జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించారు. గాజాలోని పలస్తీనియన్లపై జరుగుతున్న మారణ హోమంపై కూడా మోదీ సర్కార్ మౌనం వహిస్తోందని జైరాం రమేశ్ అన్నారు. ఇరాన్‌లోని మూడు ప్రధాన అణు స్థావరాలైన ఫర్డో, నతాంజ్, ఇస్ఫహాన్‌లపై అమెరికా బాంబు దాడులు చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో మాట్లాడారు. ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'దౌత్యం, చర్చలు' ద్వారా వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించారు.

ఎయిరిండియా విమానం వెనక్కి!

(మొదటిపేజీ తరువాయి)

విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత విమానం ల్యాండ్ కాలేదని అధికారులు తెలిపారు. పైలట్ విమానాన్ని కొంతసేపు జమ్ము విమానాశ్రయ పరిసరాల్లోనే గాల్లో చక్కర్లు కొట్టించారని, ఆపై ల్యాండింగ్ ప్రయత్నాన్ని విరమించుకుని ఢిల్లీకి తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నారని వారు తెలిపారు. జమ్ములో ఆ సమయంలో వాతావరణం పూర్తిగా అనుకూలంగా ఉందని, రన్‌వే కూడా ల్యాండింగ్‌కు సిద్ధంగా ఉందని అధికారులు స్పష్టం చేశారు. అయినప్పటికీ, పైలట్‌కు ల్యాండింగ్ ప్రాంతం సరిగ్గా కనిపించలేదని ప్రాథమికంగా తెలిసిందని వారు పేర్కొన్నారు. విమానం ఎందుకు ల్యాండ్ కాలేకపోయిందనే నిర్దిష్టమైన, తక్షణ కారణాలు మాత్రం ఇంకా పూర్తిగా తెలియరాలేదని చెబుతున్నారు.

అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఆప్ సత్తా

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చింది. అలాగే గుజరాత్‌లో కాడి అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రాజేంద్ర చావ్డా సమీప కాంగ్రెస్ అభ్యర్థి రమేశ్ చావ్డాపై గెలుపొందారు. ఇక పంజాబ్‌లోని లుథియానా వెస్ట్ సీటుకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార ఆప్ విజయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ అభ్యర్థి భరత్ భూషణ్ ఆషుపై ఆప్ అభ్యర్థి, రాజ్యసభ ఎంపీ సంజీవ్ అరోడా 10,637 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఇక్కడ ఆప్ అభ్యర్థి అరోడాకు 35,179 రాగా.. కాంగ్రెస్ అభ్యర్థి ఆషుకు 24,542 ఓట్లు, బీజేపీ అభ్యర్థి జివాన్ గుప్తాకు 20,323 ఓట్లు, అకాలీదళ్ అభ్యర్థికి కేవలం 8,203 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఇక్కడ ఆప్ ఎమ్మెల్యే గురుప్రీత్ బస్సీ గోగి మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. కేరళలో నీలంబర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార ఎల్డీఎఫ్‌కు ఎదురు దెబ్బ తగిలింది. ఈ సీటులో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ అభ్యర్థి ఆర్యదాన్ షౌకత్ సీపీఎం అభ్యర్థిపై 11,077 ఓట్ల తేడాతో విజయం సాధించారు. షౌకత్ ప్రముఖ కాంగ్రెస్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ కుమారుడు. గత ఎన్నికల్లో ఎల్డీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన పీవీ అన్వర్ రాజీనామాతో ఈ సీటుకు ఉప ఎన్నిక అనివార్య మైంది. మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లోని కాళీగంజ్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ విజయం సాధించింది. టీఎంసీ అభ్యర్థి అలీఫా అహ్మద్‌కు 32,308 ఓట్లు రాగా.. కాంగ్రెస్ అభ్యర్థికి కేవలం 13,144 ఓట్లు మాత్రమే వచ్చాయి. బీజేపీ అభ్యర్థి 11,987 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమ య్యారు. టీఎంసీ సిట్టింగ్ ఎమ్మెల్యే నసీరుద్దీన్ అహ్మద్ మృతితో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యం కాగా.. ఆయన కుమార్తె అలిఫా అహ్మద్‌ను దీదీ బరిలో నిలిపారు.

గుజరాత్ ప్రజల చూపు మావైపే: కేజ్రీవాల్

గుజరాత్‌లోని విశావదర్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ విజయం సాధించడంపై ఆ పార్టీ జాతీయ కార్యదర్శి అరవింద్ కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. గుజరాత్ ప్రజలు బీజేపీతో విసిగివేసారిపోయారని, ఇప్పుడు వారంతా ఆప్‌వైపే చూస్తున్నారన్నారు. ఆప్‌ని ఓడించేందుకు బీజేపీ, కాంగ్రెస్ లు పంజాబ్, గుజరాత్ ఎన్నికల్లో పోటీ చేస్తే... ప్రజలు ఆ పార్టీలను తిరస్కరించారన్నారు. పంజాబ్‌లోని లుథియానా పశ్చిమ స్థానంలోనూ ఆప్‌ను గెలిపించడం ద్వారా పంజాబ్ ప్రజలు తమ ప్రభుత్వ పనితీరుకు ఆమోదం తెలిపారన్నారు. గుజరాత్‌లో బీజేపీ, ఆప్ మధ్యే ప్రత్యక్ష పోటీ ఉందని... బీజేపీకి కాంగ్రెస్ కీలుబొమ్మగా మారిపోయిందని ఆరోపించారు.

రాజ్యసభకు వెళ్లను...

రాజ్యసభకు ఎంట్రీ ఇవ్వబోతున్నా రంటూ జరుగుతోన్న ప్రచారాన్ని అరవింద్ కేజ్రీవాల్ తోసిపుచ్చారు. తాను రాజ్యసభకు వెళ్లడంలేదని స్పష్టం చేశారు. పంజాబ్‌లోని లుథియానా పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ఆప్ అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజీవ్ అరోడా విజయం సాధించడంతో ఆయన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తే...ఈ స్థానం నుంచి కేజ్రీవాల్ పెద్దల సభలో అడుగుపెట్టబోతున్నారన్న ప్రచారంలో నిజం లేదన్నారు. ఖాళీ అయ్యే రాజ్యసభ సీటు నుంచి ఎవరు పోటీ చేయాలనేది ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు.

ప్రజలతో విశాలాంధ్ర మమేకం

(మొదటిపేజీ తరువాయి)

విషయమని అన్నారు. నాటి కమ్యూనిస్టుల చారిత్రక అవసరం మళ్లీ పునరావృతం కావాలని ఆకాంక్షించారు. దేశంలో పేదరికం 2022-23 వివరాల ఆధారంగా 5.03 శాతానికి తగ్గుముఖం పట్టిందంటూ ప్రపంచ బ్యాంకు ఇచ్చిన నివేదికలోని గణాంకాలు... మనం నమ్మేలా చూపినప్పటికీ... దేశంలో కటిక పేదరికం అంతమాత్రాన తగినట్లు కనిపించడం లేదన్నారు. దేశంలోని 1 శాతం మంది ధనికుల చేతిలోనే 40 శాతం సంపద ఉందని, 50 శాతం పేదల చేతిల్లో కేవలం 3 శాతమే సంపద వస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టుల పాత్ర దేశానికి అత్యవసరమని సూచించారు.

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ వాస్తవాలకు ప్రతిరూపంగా విశాలాంధ్ర నిలుస్తోందని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా విశాలాంధ్ర తనదైన శైలిలో, వామపక్ష భావజాలంతో ఒక విలక్షణమైన జర్నలిజంతో పని చేస్తోందని చెప్పారు. తమిళనాడులో భాషా మెరుగుదల కోసం ప్రభుత్వం ప్రతి ఏటా ఒక అధ్యయనం నిర్వహిస్తుందని, అదే తరహాగా తెలుగు రాష్ట్రాల్లోనూ తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. ప్రస్తుత తరుణంలో రాజకీయంతో పాటు సాహిత్యం, కళలు, జర్నలిజం వ్యాపార మయంగా మారిన హీన సంస్కృతి దాపురించిందన్నారు. దీనిని మనం తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచి ఉద్యమాలతో మమేకమై ప్రజాప్రతినిధులుగా ఎదిగిన వారిలో నైతిక విలువలు ఉండేవని, నేడు ఎమ్మెల్యే టికెట్లను డబ్బులతో కొనుగోలు చేయడం వల్ల రాజకీయం పూర్తిగా అవినీతిమయమైందని విమర్శించారు. టీవీలలో చర్చా వేదికలూ రెండుగా విడిపోయాయని, ఏది వాస్తవం, ఏది అవాస్తవం అనేదీ కనిపించకుండా పోయాయని తెలిపారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ 73 ఏళ్లుగా తెలుగు భాషాభివృద్ధికి విశాలాంధ్ర అలుపెరగని కృషి చేస్తోందన్నారు. ఆనాటికి... నేటికీ తన లక్ష్యం పట్ల వెనక్కి తగ్గకుండా నిరంతరం ప్రజాపక్షం కోసం తపిస్తోందని చెప్పారు. విశాలాంధ్రలో సుదీర్ఘకాలం పాటు ఎడిటర్‌గా పని చేసిన సి.రాఘవాచారి పేరుతో ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్‌ను ఏర్పాటు చేయడం గర్వకారణమని అన్నారు. అలాంటి చైర్మన్ హోదాలో తొలిసారిగా వార్షికోత్సవ సభకు ఆలపాటి సురేశ్ రావడం అభినందనీయమని చెప్పారు.

విశాలాంధ్ర ఎడిటర్ ఆర్వీ రామారావు మాట్లాడుతూ విశాలాంధ్ర నిరంతరం గొప్ప పత్రికగా ఎదుగుతోందన్నారు. పత్రిక ప్రారంభం నుంచి నేటి వరకు తెలుగు రాష్ట్రాల్లో పాఠకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు.

విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ విశాలాంధ్రకు మొదటి నుంచి ఎన్ని కష్ట, నష్టాలు ఎదురైనా తన ఆశయ సాధన కోసం శ్రమిస్తోందన్నారు. ఎంతోమందిని మంచి జర్నలిస్టులుగా తీర్చిదిద్దిందన్నారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథ రెడ్డి మాట్లాడుతూ స్వతంత్ర భావజాలం, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా విశాలాంధ్ర పని చేస్తోందన్నారు. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు సభకు స్వాగతం పలుకుతూ ఆలపాటి సురేశ్ కుమార్ జర్నలిజం ప్రస్థాన వివరాలు వెల్లడించారు. ఈ సభకు విశాలాంధ్ర డిప్యూటీ జనరల్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు వందన సమర్పణ చేశారు. తొలుత ప్రజానాట్య మండలి రాష్ట్ర కోశాధికారి పిచ్చయ్య గేయాలను ఆలపించారు. వేదికపై విశాలాంధ్ర విజ్ఞాన సమితి సభ్యులు పి.దుర్గాభవాని ఆశీనులయ్యారు. అనంతరం విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్వర్యంలో సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్‌కుమార్‌ను సన్మానించారు.

పరకాల జ్ఞాపకార్థం రూ.5 వేల విరాళం

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, విశాలాంధ్ర పూర్వ సంపాదకవర్గ సభ్యులు అమరజీవి పరకాల పట్టాభిరామారావు జ్ఞాపకార్థం వారి కుమార్తె ఉషాదేవి, అల్లుడు సీబీఎస్ పట్టాభిరామారావు విశాలాంధ్ర 73వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రూ.5 వేలు విరాళంగా అందజేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న ఉషాదేవి ఫోన్ ద్వారా విశాలాంధ్ర వార్షికోత్సవం సందర్భంగా సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. 73 ఏళ్లుగా అవిశ్రాంతంగా పత్రికను తీసుకురావడం చెప్పుకోదగ్గ విషయమని అన్నారు. విశాలాంధ్ర ద్వారా తాము ఎంతో స్ఫూర్తి పొందామన్నారు. పట్టాభి, ఆయన సతీమణి అహల్యాదేవి వర్ధంతి సందర్భంగా పరకాల కుటుంబ సభ్యులు ఏటా విశాలాంధ్రకు విరాళం అందజేస్తుంటారు.

ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు ప్రజావాణి ఆశ్రయిస్తున్నారని, వారి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని, ప్రజావాణి పోర్టల్‌లోని పెండింగ్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, తహసీల్దార్లు, ఎంపి డిఓలు, ఎంపిఓలు పాల్గొన్నారు.

జిఎంపిఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-మహబూబాబాద్ : గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా పయ్యావుల మల్లయ్య, బొల్లం అశోక్‌లను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. రెండవ రోజు సోమవారం సంఘం మహాసభలలో ఉడుత రవీందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, సంఘం ఆధ్వర్యంలో నిత్యం గొర్రెల పెంపకం దారుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉధృతం చేయాలని అన్నారు. జిల్లాలో 559, 1016 జీవోలను పటిష్టంగా అమలు జరిపేలా చూడాలని అన్నారు. 50 సంవత్సరాల నుండి నా గొర్రెల కాపరులకు వృత్తిదారుల పెన్షన్ 3 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మండలానికి పశువుల ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించాలని, గ్రామాల్లో ఉన్న గొర్రెలు మేకలకు ప్రభుత్వం ఉచితంగా ఇన్సూరెన్స్ చేయించాలని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిం దన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా చలగొల్ల మల్లయ్య, జిల్లా అధ్యక్షులుగా పయ్యావుల మల్లయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొల్లం అశోక్, జిల్లా ఉపాధ్యక్షులుగా కొమ్మనబోయిన యాకయ్య, ఇమ్మడి గోవిందు, దూదిమెట్ల మోహన్‌రావు, సహాయ కార్యదర్శులుగా గంద్రకోటి కుమార్, కేశబోయిన మల్లయ్య, చిన్నాల కట్టమల్లు కోశాధికారిగా కుండే అశోక్, సోషల్ మీడియా కన్వీనర్‌గా నేతుల రాకేష్, జిల్లా కమిటీ సభ్యులుగా మంచాల హరీష్ ఎద్దు ఐలయ్య పరికిబోయిన మహేష్, కొండ రాము, మానక సురేందర్, పూజారి వెంకటేష్, నూకల లక్ష్మినరసయ్య, సత్తిదోని, గుదే రమేష్, గుండెబోయిన సత్యనారాయణ, సురబోయిన బిక్షపతి, కొమ్ము రమేష్, భారీ రమేష్, మంచాల శ్రీశైలం, గజ్జి మహేష్, తండ మహేష్, గజ్జి మల్లేష్, రెండు కో ఆప్షన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేడు పెండింగ్ బిల్లులు రూ.700 కోట్ల నిధులు విడుదల

విశాలాంధ్ర - చర్ల : పీఆర్టీయు సంఘ పక్షాన పలుమార్లు ఇచ్చిన ప్రాతి నిధ్యం మేరకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు మంగళవారం రూ.700 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుందని పిఆర్టియు చర్ల మండల శాఖ హర్షం వ్యక్తం చేసింది. పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపులు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి, పీఆర్టీయు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్ రెడ్డిల కృషి మేరకు ప్రభుత్వం విడుదల చేసిందని సోమవారం ఒక ప్రకటన లో సంఘం నాయకులు తెలిపారు. రూ.270 కోట్లు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెండింగ్ మెడికల్ బిల్లుల చెల్లింపునకు గాను కేటాయించగా ఇప్పటికే జిల్లాల వారీగా మెడికల్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. మిగిలిన నిధులతో పెండింగ్ జీపీఎఫ్ పార్ట్ ఫైనల్స్, తుది చెల్లింపులు, వేతన బకాయిల చెల్లింపు కూడ జరగనుందని తెలిపారు. నిధుల కోసం కృషిన శ్రీపాల్ రెడ్డి, పీఆర్టీయు రాష్ట్ర నాయకులకు చర్ల మండల అధ్యక్షులు ఎస్ఎస్ఎస్. రవి కుమార్, ప్రధాన కార్యదర్శి వీరభద్రం, రాష్ట్ర జిల్లా కార్యదర్శులు వేణు, శ్రీనివాస్ గురుమూర్తి, కేహెచ్ కేవీఎస్ ఎన్. రాజు, వైవి. రాజు, పున్నం సారయ్య, రామకృష్ణ, రామయ్య కృతజ్ఞతలు తెలిపారు.

నేరేడుచర్ల కేంద్రంగా నూతన నియోజకవర్గం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : త్వరలో జాతీయ స్థాయిలో చేపట్టనున్న జనగణన పూర్తయిన వెంటనే అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గం పునర్విభజన చేయనునట్టు వస్తున్న వార్త కథనాలు వస్తున్నాయని అందువల్ల నేరేడుచర్ల కేంద్రంగా నూతన నియోజకవర్గం ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన నేరేడుచర్లలోని ప్రజా సంఘాల ముఖ్యుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్రం నూతనంగా ఏర్పడడం అలాగే సూర్యాపేట జిల్లాగా ఏర్పడడం హర్షణీయ పరిణామమని, అలాగే నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా నేరేడుచర్ల కూడా అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పడితే ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఇక్కడ ఎమ్మెల్యే లేకపోవడం వల్ల ప్రజలకు కొంత అన్యాయం జరుగుతుందని ఇక్కడి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎవరు గెలిచినా స్థానికంగా ఉండి ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తారని ఇప్పటిదాకా మిర్యాలగూడ హుజూర్నగర్ ప్రాంతాలకు చెందిన వారే ఎమ్మెల్యేలుగా ఉండటంవల్ల నేరేడుచర్ల కొంత అన్యాయానికి గురైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి అధ్యక్షత వహించగా బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమ్రరాజు వెంకట్, ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికే భరత్, మహిళా సమాఖ్య నాయకురాలు దివ్య పాల్గొన్నారు

విద్యుత్ షాక్ గోవు మృతి

విశాలాంధ్ర- కేసముద్రం : విద్యుత్ షాక్‌తో గోవు మృతి చెందిన సంఘటన పెనుగొండ గ్రామములో చోటు చేసుకుంది. కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి చెందిన వ్యవసాయ రైతు ముదిగిరి బీరయ్య మాట్లాడు తూ సోమవారం నీళ్లు తాగేందుకు వెళ్లిన గోవుకి సమీపంలోని విద్యుత్ వైర్ తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడిందని అన్నారు. సాగుకు ఉన్నటువంటి గోవు మృతి చెందడం తనని తీవ్ర వేదనని కలిగించిందన్నారు. వ్యవసాయానికి ఆధారంగా ఉన్న ఆవు మృతి చెందడంతో సాగు చేయడం కష్టతరంగా మారిందని అన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు స్పందించి తనని ఆదుకోవాలని, రాష్ట్రం ప్రభుత్వానికి వేడుకున్నారు.

పల్లెపల్లెకూ ఆర్టీసీ ప్రయాణ సేవలను విస్తరిస్తాం

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : ప్రతి పల్లెకు ప్రజారవాణా ఆర్టీసీ ప్రయాణ సేవలను అందుబాటులోకి తీసుకువస్తాం అని కొత్తగూడెం శాసనసభసభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద ఉల్వనూరు ప్రాంతానికి నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్ సర్వీసులును లాంఛనంగా ప్రారంభించనున్నారు. తొలుత జండా ఊపి బస్ సర్వీసును ప్రారంభించాక మొదటి టికెట్ కొని బస్‌లో అధికారులు, మహిళలతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రధాన రోడ్ల సమస్యను పరిష్కరించామన్నారు. అతి త్వరలో అంతర్గత రోడ్లు పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజా రవాణా ఆర్టీసీని ప్రజలు ఆదరించాలని, ఆర్టీసీ బస్సులు సురక్షితం గా ప్రయాణించాలని ప్రజలకు కూనంనేని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి, కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ దేవందర్ గౌడ్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వ నాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, డీ సుధాకర్, నాయకులు మన్నెం వెంకన్న, నిమ్మల రాం బాబు, శనగారపు శ్రీనివాస రావు, వేములపల్లి శ్రీనివాస్, చెరుకూరి శేఖర్ బాబు, వై ఎస్. గిరి, కొంగర అప్పారావు, ఎండి. గౌస్ ఎస్ ఎ. రెహమాన్, కరీం, లాసింగ్, రామాచారి, ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు బద్ది కిషోర్, పైడిపల్లి దుర్గా మహేష్, కొమిగ్రాజు విజయ్, రాము, శాంతి వర్ధన్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరుల త్యాగాల స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం...

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : అమరుల త్యాగాలు వృధా కానివ్వమని వారి స్ఫూర్తితో ముందుకెళ్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా అన్నారు. సోమవారం పాల్వంచ మండల పరిధిలోని నారాయణరావుపేట గ్రామంలో ఏర్పాటు చేసిన మాజీ మండల కార్యదర్శి దేవరకొండ నాగాచారి, కనకం దుర్గమ్మ, మేక ధర్మయ్య, గుర్రం సత్యంల స్మారక స్థూపం ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అరుణ పతాకాన్ని ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ వందేళ్ళగా జనం గుండెల్లో సిపిఐ పార్టీకి మహొన్నత స్థానం ఉందన్నారు. ప్రజా ఉద్యమాలే సీపీఐకి ఆయుధమని ఆయన స్పష్టం చేసారు. మనిషిని మనిషి దోపిడి చేయని సమసమాజ నిర్మాణంకోసం ఆవిర్భవించిన సిపిఐ పార్టీ నాటి నుంచి నేటివరకు ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దుదూ ప్రశ్నించే తత్వాన్ని నేర్పిందన్నారు. 100 ఏండ్ల సుధీర్ఘ ప్రస్తానంలో సిపిఐ నిర్వహించిన పోరాటాలు, ఉద్యమాలతో ప్రజలకు, కార్మికవర్గానికి అనేక హక్కులు, సౌకర్యాలు దక్కాయన్నారు. ప్రజల పక్షం పోరాటాల్లో ఎందరో అమరవీరులు నేలకొరిగార న్నారు. మరెందరో ప్రజలకోసం తమ జీవితాలను త్యాగం చేశారని ఘట్టాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, డీ సుధాకర్, నాయకులు మన్నెం వెంకన్న, నిమ్మల రాంబాబు, శనగారపు శ్రీనివాసరావు, వేములపల్లి శ్రీనివాస్, చెరుకూరి శేఖర్ బాబు, వై ఎస్ గిరి, కొంగర అప్పారావు, ఎండీ గౌస్ ఎస్ ఎ. రెహమాన్, కరీం, లాసింగ్, రామాచారి, ఆదినారాయణ, ఇరుకులపట్టి సుధాకర్ లావుడియా చందూలాల్, ధర్మసోత్ రామదాస్, మాలోత్ సక్రు, మంగీలాల్, సుంకర రంగారావు, సఫావట్ వెంకటరమణ, జర్పుల మోహన్, బాదావత్ శ్రీను, భుఖ్య విజయ్, బానోత్ రంజిత్, బాణాత్ రవి, చంచలపురి శ్రీనివాస్, సాయిలి శ్రీనివాస్, సాయిలి వెంకన్న, మేక రాంబాబు, పోలుబోయిన వెంకటేశ్వర్లు, గంగుల సత్యనారాయణ రెడ్డి, బత్తుల గోపాలకృష్ణ, పాలుబోయిన సత్యం తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో రాణించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణాలు జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒలంపిక్ డే రన్ ర్యాలీని జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతూ పాటు క్రీడలలో కూడా రాణించాలని క్రీడల ద్వారా క్రమశిక్షణతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని, చదువులో ఏకాగ్రత పెంపొందుతుందని తెలిపారు. ఒలంపిక్ డే రన్ ర్యాలీ జిల్లా కేంద్రంలోని చిల్డ్రన్ పార్క్, కొమురం భీం చౌక్, అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్ మీదుగా సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా సర్వీసులు శాఖ అధికారి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మణెమ్మ, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

నూతన పెన్షన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర - తొర్రూరు: భారత పార్లమెంట్లో ఇటీవల దేశంలోని పెన్షనర్లకు తీవ్ర నష్టం కలిగించే విధంగా రూపొందించిన నూతన పెన్షన్ చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని పెన్షనర్ల సంఘం మహబూబాబాద్ జిల్లా శాఖ అధ్యక్షుడు మైస నాగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి వలబోజు సోమయ్యలు అన్నారు. సోమవారం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తొర్రూర్ మండల శాఖ అధ్యక్షుడు ఇట్టే సోమారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నూరు కోటయ్య, ప్రధాన కార్యదర్శి ఎం డి యాకూబ్, కోశాధికారి చెన్నోజు విజయ్ కుమార్ తదితరుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్లో నూతనంగా ఆమోదించిన ఈ చట్టం వల్ల దేశవ్యాప్తంగా పెన్షనర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా రూపొందించిన ఈ చట్టాన్ని ఉపసంహరించుకునేంతవరకు ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పెన్షన్ల సంఘాలన్నీ సంఘటితంగా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రధానమంత్రి కార్యాలయానికి తమ డిమాండ్లను చేరవేసినందుకుగాను ఉద్యమ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం తొర్రూర్ మండల శాఖ నాయకులు ఇట్టే సోమారెడ్డి మన్నూరు కోటయ్య , ఎండి యాకూబ్, చెన్నోజు విజయ్ కుమార్, కాల్వాని శ్రీనివాస్ రెడ్డి హనుమన్ల కృష్ణారెడ్డి, కాల్వాని మాసిరెడ్డి, దీకొండ వీరభద్రం, మంద సోమిరెడ్డి, కోమల్ల కిషన్ రావు, బోడ బాలాజీ, సత్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌ను తరిమికొడదాం.. : ఏఎస్పీ

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : డ్రగ్స్ తరిమి కొడుదాం, యువత ను కాపుడుకుందాం అని ఏటూరునాగారం ఏ ఎస్పీ శివం ఉపాధ్యాయ అన్నారు. సోమవారంవెంకటాపురం మండల పోలీస్ స్టేషన్ పరిధిలో చిరుత పల్లి బాలిక ఆశ్రమ పాఠశాలలో డ్రగ్స్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ ఎస్పీ శివం ఉపాధ్యాయ మాట్లాడుతూ ప్రజల భద్రత భరోసా కొరకు ములుగు జిల్లా ఎస్పీ ప్రారంభించిన అభయ మిత్ర కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు, విద్యార్థులకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఏ ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా ఏ ఎస్ పి విద్యార్థిని విద్యార్థుల యొక్క భవిష్యత్తు గురించి మార్గాన్ని నిర్దేశిస్తూ, పిల్లల వయస్సు నుండి యుక్త వయస్సు వచ్చేవరకు చదువుపై దృష్టి సారించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. ఆ పరిణామ క్రమంలో ఎలాంటి చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా, ముఖ్యంగా ప్రస్తుతం మహమ్మారిల ప్రవహిస్తున్న డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను అలవాటు చేసుకోరాదని, వాటికి అలవాటు పడినట్లయితే అవి జీవితాన్ని చిన్నాభిన్నం చేస్తాయని, ఆర్థికంగా మానసికంగా ఆరోగ్యపరంగా నష్టపోతారని తెలియజేయ జేశారు. పిల్లలతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డ్రగ్స్ ని అరికట్టే దిశగా బాధ్యతాయుతంగా ఉండాలని నిర్దేశించారు. నేటి బాలలే రేపటి పౌరులు అని తెలియజేస్తూ పిల్లలకు తమ తల్లిదండ్రుల పట్ల గౌరవంగా నడుచుకోవాలని అదేవిధంగా సమాజంలో చెడు వ్యసనాలకు బానిసనే యువతను మార్చే దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్: ప్రజలు గ్రీవిన్స్‌లో పలు సమస్యలపై చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మ చారీతో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ఒక కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామాలు, తండాల నుంచి వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన (106) దరఖాస్తులను సబంధిత శాఖల అధికారులకు పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ప్రజావాణిలో జెడ్.పి సీ ఈఓ పురుషోత్తం, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, హౌసింగ్ డి.ఈ రాజయ్య, ఏ.డి.సర్వే ల్యా%శ%డ్ నరసింహ మూర్తి, డి.ఎం.ఇండస్ట్రీ శ్రీమన్నారాయణ, బి.సి, ఎస్.సి, ఎస్.టి, మైనారిటీ డెవలప్మెంట్ అధికారులు నరసింహస్వామి, శ్రీనివాసరావు, శ్రీనివాస్, డి.పి.ఓ హరిప్రసాద్,డి.హెచ్.ఓ మరియన్న, డి.సి.ఓ వెంకటేశ్వర్లు, ఎల్.డి.ఎం.సత్యన్నారాయణ మూర్తి, పెన్షన్ అధికారి శంకర్, కలెక్టరేట్ ఏ.ఓ పవన్ కుమార్, సి.సెక్షన్ సూపరింటెండెంట్ వినోద్, భూభారతి కోఆర్డినేటర్ సురేష్, మండలాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణ లక్ష్యాలను పకడ్బందీగా పూర్తి చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి: ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ లక్ష్యాలను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం, ఎరువుల లభ్యత పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం జిల్లాలో పెంచేందుకు వ్యవసాయ విస్తరణ అధికారి పరిధిలో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ సాగు పట్ల ఆసక్తితో ముందుకు వచ్చిన రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండవద్దని, సబ్సిడీ, డ్రిప్ ఏర్పాటు, మొక్కలు నాటడం త్వరితగతిన జరిగిపోవాలని, రైతులకు నాణ్యమైన ఆయిల్ పామ్ మొక్కలు, రైతులకు సబ్సిడీ త్వరితగతిన అందించాలని అన్నారు. ప్రస్తుత సంవత్సరం 2500 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ లక్ష్యం చేరుకునేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 880 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు రైతులు ముందుకు వచ్చారని, వీరికి అవసరమైన మంజూరు ప్రక్రియ త్వరగా అందించాలని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో ఆయిల్ పామ్ పంట దిగుబడి చాలా అద్భుతంగా వస్తుందని, రైతుల వద్ద నుంచి కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేస్తున్నారని, ప్రస్తుత సీజన్ లో 100 ఎకరాల వరకు ఆయిల్ పామ్ పంట దిగుబడి వస్తుందని అంచనా వేసామని తెలిపారు. 100 ఎకరాల వరకు ఒకే స్ట్రెచ్ లో రైతులు ఆయిల్ పామ్ పంట సాగు చేస్తే కంపెనీ ప్రతినిధులు ఆయిల్ మిల్ ఏర్పాటు చేస్తారని అన్నారు. 10 ఎకరాల కంటే ఎక్కువ భూములు ఉన్న రైతులను ముందు టార్గెట్ చేస్తూ వ్యవసాయ విస్తరణ అధికారులు ఆయిల్ పామ్ సాగు విస్తరణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారికి లక్ష్యాలను కేటాయించాలని కలెక్టర్ వ్యవసాయ శాఖకు సూచించారు. వర్షా కాలంలో రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో పెట్టుకోవాలని, ప్రతి మండల కేంద్రం పరిధిలో ఎప్పటికప్పుడు ఎరువుల స్టాక్ వివరాలను పర్యవేక్షిస్తూ ఉండాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి రైతు వేదిక వద్ద రేపు సాయంత్రం 5 గంటలకు ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి జగన్ మోహన్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారులు వారి పరిధిలోని విద్యా సంస్థలు, హాస్టళ్లను నిరంతరం సందర్శించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : మండల ప్రత్యేక అధికారులు వారి పరిధిలోని విద్యా సంస్థలు, హాస్టళ్లను నిరంతరం సందర్శించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పాఠశాలల్లో ఎక్కడ వాన నీరు, మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎక్కడైనా నీరు నిల్వ ఉంటే జెసిబిని ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో మాట్లాడుతూ పరిశుభ్రత లోపం కారణంగా విద్యార్థులు అనారోగ్యానికి గురి కాకుండా చూడాలని, అందువల్ల మండలాల ప్రత్యేక అధికారులు ఎప్పటికప్పుడు వారి మండలంలోని అన్ని పాఠశాలలను తనిఖీ చేయాలని, ముఖ్యంగా పాఠశాల ఆవరణలో ముళ్ళ పొదలు, చెత్తాచెదారం లేకుండా చూడాలని, విద్యార్థులు విష పురుగులు,క్రిమి కీటకాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత ఉందని, మూసీ పరీవాహక ప్రాంతంలో విషపురుగుల బెడద ఎక్కువగా ఉంటుందని, అందువల్ల అక్కడ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భవనాలు వృధాగా కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లయితే గుర్తించి వాటివల్ల ఎలాంటి ప్రమాదం జరగకుండా కూలగొట్టాలని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ "స్వచ్ఛ సర్వేక్షణ గ్రామీణ- 2025" గోడపత్రికను ఆవిష్కరించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులన్నింటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, జాప్యం లేకుండా ఫిర్యాదులు పరిష్కరిస్తే లబ్ధిదారులకు మేలు జరుగుతుందని అన్నారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, జెడ్ పీ ఇన్చార్జి సీఈఓ శ్రీనివాస రావు, ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి, జిల్లా అధికారులు , ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

సింగరేణి సిర్పూర్ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ కోర్సుల్లో 300 సీట్లు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : సింగరేణి కాలరీస్ సిర్పూర్ పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 అకాడమిక్ మొదటి సంవత్సరంలో 300 సీట్లు వివిధ కోర్సుల్లో భర్తీ చేయనున్నట్లు సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జి. శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన లో వివరాలు వెల్లడించారు. సివిల్ లొ 60 సీట్లు, కంప్యూటర్- 60, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్-60, మెకానికల్-60, మైనింగ్-60 ఉన్నట్లు చెప్పారు. పాలీసెట్ 2025 అర్హత పొందిన విద్యార్థులతో ఈ సిట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. వీటిలో 150 సీట్లు సింగరేణి ఉద్యోగుల, మాజీ ఉద్యోగుల పిల్లలకు కేటాయించిగా తమ దరఖాస్తులు 03.07.2025 లోపు https://scp.scpolytechnic.com/online_admission వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతరులు మిగిలిన 150 సీట్లు కన్వీనర్ కోటా ప్రవేశము కోసం తెలంగాణ ప్రభుత్వం ఆన్లైన్ https://tgpolycet.nic.in జూన్ 28 వరకు దరఖాస్తు చేసుకోవలన్నారు. ఇంకా ఏమైనా సమాచారం కొసం మొబైల్ నం. 9010222161, 8790112515, 9491144168 లకు ఫోన్‌లొ సంప్రదించలన్నారు.

గిరిజన యువత అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేస్తున్నాం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఏజెన్సీ ప్రాంతాలు గిరిజన యువత అన్ని రంగాల్లో ముందుండేలా పోలీస్ శాఖ కృషి చేస్తున్న అడిషనల్ ఎస్పీ నరేందర్ అన్నారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలోని గిరిజన ప్రాంతాలు, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజల తోపాటు మైదాన ప్రాంతాల్లోని వలస గిరిజన యువతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల అభివృద్ధి, సంక్షేమ, కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో రవాణా శాఖ అధికారుల సహకారంతో గుండాల పోలీసుల ఆధ్వర్యంలో గుండాల మండలంలోని 100 మంది యువకులకు డ్రైవింగ్ లైసెన్సులను నరేందర్ చేతుల మీదుగా లైసెన్స్ కాపీలను అందించారు. గిరిజన ప్రాంతాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువతకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా అండగా ఉంటుందని తెలిపారు. వారికీ క్రీడా పోటీలు నిర్వహించడం, మెడికల్ క్యాంపు లు, ఉద్యోగాలు సాధించేలా కోచింగ్ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మండలంలోని యువత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైవింగ్ లైసెన్సు ఇప్పించిడంలో కృషిచేసిన గుండాల సీఐ రవీందర్,కానిస్టేబుల్ శంకర్ ను ప్రత్యేకంగా అభినందించినారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డి.యస్.పి. యన్.చంద్రభాను, గుండాల సీఐ లోడిగ రవీందర్, గుండాల యస్.ఐ రవూఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి : పెద్దపల్లి మండలం పెద్దకల్వల, పెద్ద బొంకూరు, దస్తగిరిపల్లి గ్రామాల్లో సోమవారం రోజున రూ.69 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పట్టాలను అందజేసి ఇండ్లకు ముగ్గు పోసి ఇంటి నిర్మాణాల పనులను ప్రారంభించిన పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా పెద్దపల్లి మాట్లాడుతూ పెద్దపల్లి నియోజక వర్గంలో అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే విజయరమణరావు అన్నారు. పార్టీలు రాజకీయాలకతీతంగా పేదల సంక్షేమం కోసం కృషి చేస్తానని బీఆర్ఎస్ హయాంలో ప్రజలను నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా 22 వేల 500 కోట్లతో మొదటి విడతలో 4 లక్షల 50 వేల ఇండ్లు మంజూరు చేసిందని, రాబోయే 3 సంవత్సరాలలో మొత్తం 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నిరుపేదలకు పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని, రాబోయే 3 సంవత్సరాలలో మరో మూడు విడతలుగా ఇండ్లు ఇస్తామని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ పరిధి రూ.10 లక్షలకు పెంపు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 లకు గ్యాస్ సిలిండర్, సన్న రకం బియ్యం సరఫరా వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతామని హామీ ఇచ్చారు.

సంపాదకీయం

విధ్వంస విచికిత్స

ఇరాన్‌లో అణ్వస్త్రాలు తయారు చేసే కేంద్రాలు అని చెప్తున్న ఫర్డో, నతాంజ్, ఇస్ఫహన్ మీద బాంబులు కురిపించి ఇక ఇరాన్ అణ్వస్త్రాలు తయారుచేసే అవకాశం లేకుండా చేశామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ టముకు వేసుకుంటున్నారు. అసలు ఈ దాడి వల్ల తమ అణు స్థావరాలకు జరిగిన నష్టం చాలా స్వల్పం అని ఇరాన్ చెప్తోంది. ఇందులో నిజానిజాలను కనుగొనడం సులభం కాదు. ఎందుకంటే యుద్ధ సమయంలో చెలరేగే అసత్యాలతో పోలిస్తే వాస్తవాలు నామమాత్రమే. కానీ ఇరాన్ అణుస్థావరాల మీద బాంబులు కురిపించడానికి అమెరికా మూడో కంటికి తెలియకుండా ఉండడంతో సహా చాలా కష్టపడింది. అమెరికా నుంచి బి-2 యుద్ధ విమానాలు దాడి చేయాలనుకున్న చోటికి ప్రయాణించడానికి 18 గంటలు పట్టింది. వెనుదిరగడానికి కూడా అంతే సమయం పట్టి ఉంటుంది. బాంబులు వేసే బి-2 యుద్ధ విమానాలకు తోడుగా ఈ దాడికి అమెరికా మొత్తం 125 విమానాలు వాడింది. కొన్నింటిని అనుమానం రాకుండా మాయ చేయడానికి వినియోగించింది. ఈ విమానాలకు మధ్య మధ్యలో ఇంధనం నింపాల్సి వచ్చింది. ఎవరి కంటా పడకుండా ఇరాన్ అణు స్థావరాలను ధ్వంసం చేసే పని పూర్తి చేశామని అమెరికా రక్షణ మంత్రి పెటె హెగ్సెత్ చెప్పారు. భూగర్భంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలిగే బాంబులు ఇజ్రాయిల్ దగ్గర లేవు. అందుకని తన ఆప్త మిత్రుడైన ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహూ తరఫున ట్రంప్ కాగల కార్యం తీర్చారు. భూగర్భం లోపల ఉన్న లక్ష్యాలను ఛేదించే బాంబులను బృహత్ స్థాయిలో పేలుడు పదార్థాలను పంపించగలిగే ఆయుధాలు (ఎంఓపీ) అంటారు. పేలడానికి ముందు ఈ బాంబు 60 అడుగుల వెడల్పు ఉన్న కాంక్రీటును ఛేదింగలదంటున్నారు. దీనివల్ల ట్రంప్ లక్ష్యం నెరవేరిందో లేదో కానీ ఉన్న భీకర బాంబులు ఇవే. ఫోర్డోలో ఉన్న అణుస్థావరం భూమి లోపల 295 అడుగుల లోపల ఉంది. బంకర్ బస్టర్లను యుద్ధంలో ఉపయోగించడం ఇదే మొదటి సారి. అణ్వస్త్రాలు చేయడానికి ఇరాన్‌కు సామర్థ్యాన్ని తుడిచి పెట్టగలిగామని ట్రంప్ చెప్పుకుంటున్నా ఇవి అసలు లక్ష్యాలను ఛేదించాయో లేదో ఇప్పటికైతే నికరంగా తెలియదు. అణు స్థావరాలపై అమెరికా బాంబులు వేయడానికి ముందు, వేసిన తరవాత ఉన్న ఉపగ్రహ ఛాయా చిత్రాలనుబట్టి చూస్తే ఆ ప్రాంతంలో పెద్ద గుంతలు మాత్రమే ఏర్పడినట్టు కనిపిస్తోంది. గత 13వ తేదీన ఇజ్రాయిల్ తమ మీద యుద్ధం ప్రకటించినప్పటి నుంచే తమ అణు స్థావరాలకు ముప్పు ఉంటుందని ఇరాన్ పసి కట్టింది. అందుకే అక్కడ ఉన్న సామాగ్రిని ఇతర రహస్య స్థావరాలకు తరలిచారంటున్నారు. అదే నిజమైతే అమెరికా కష్టపడి చేసిన బాంబు దాడుల వల్ల నిజంగానే ఇరాన్‌కు పెద్ద నష్టం జరిగి ఉండక పోవచ్చు. అణు వ్యవహారాలకు సంబంధించిన ఐక్య రాజ్యసమితిలోని అణు ఇంధన విభాగం అధిపతి రాఫెల్ గ్రోసీ కూడా ఇరాన్‌కు జరిగిన నష్టం గురించి వివరాలేమీ చెప్పలేదు. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ కూడా ఇప్పుడప్పుడే కచ్చితమైన సమాచారం ఇవ్వడం కుదరదని కూడా ఆయన అన్నారు.

ఇస్ఫహాన్ మీద అరేబియా సముద్రంలో ఉన్న అమెరికా జలాంతర్గామి మీంచి క్షిపణులతో దాడి చేశారు. దీని ప్రభావం కూడా ఫర్డో మీద బి-2 బాంబర్లు చేసిన దాడికి సమానంగానే ఉందంటున్నారు. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ప్రతినిధులు ఇరాన్ మీద ఇజ్రాయిల్ యుద్ధం ప్రకటించడానికి ముందే ఇరాన్‌లోనే ఉన్నారు. వారు కూడా అమెరికా దాడివల్ల ఇరాన్‌కు ఎంత నష్టం కలిగిందో అంచనావేసే పనిలో మునిగి ఉన్నారు. ఫర్డో అణు స్థావరం దగ్గర మరో భవనం కూడా ఉంది. అది భూగర్భంలో లేదు. బహుశ: భూగర్భంలో ఉన్న యురేనియం శుద్ధి చేసే ప్రదేశానికి గాలి, వెలుతురు రావడం కోసం ఈ భవనాన్ని నిర్మించి ఉండవచ్చు. ఆ భవనానికి ఏ నష్టమూ కలగలేదు. అమెరికా దాడి చేసిన మూడు అణు స్థావరాల నుంచి కూడా ఎలాంటి అణు ధార్మిక శక్తి వెలువడలేదు. అక్కడ ఉన్న సామాగ్రిని ఇరాన్ ముందే తరలించడం కూడా దీనికి కారణం కావొచ్చు. నతాంజ్‌లో ఉన్న భూగర్భ అణు స్థావరం దగ్గర భూభాగంలో 18 అడుగుల వ్యాసంతో ఒక గుంట ఏర్పడింది. అక్కడ ఉన్న మట్టి దిబ్బల్లో కన్నాలు ఏర్పడ్డాయి. ఉపగ్రహం ద్వారా సమకూరిన ఛాయా చిత్రాలను చూస్తే బాంబు దాడివల్ల 40 మీటర్ల లోతున ఉన్న అణు స్థావరానికి ఎలాంటి నష్టం కలిగి ఉండదు అంటున్నారు. ఈ భూగర్భ స్థావరం పైన ఎనిమిది మీటర్ల మందాన సిమెంట్, ఉక్కుతో నిర్మాణం ఉంది. అణ్వస్త్రాలు తయారు చేయడానికి ఉపకరించే యురేనియం నిక్షేపాలను కూడా ఇజ్రాయిల్, అమెరికా ఇంతవరకు కనిపెట్టలేక పోయాయి. వారం కిందటి నుంచే ఈ నిక్షేపాలను కనిపెట్టే ప్రయత్నం కొనసాగుతోంది. అణు స్థావరాలలో ఉన్న సామాగ్రినంతటినీ వారం ముందే తరలించేశామని ఇరాన్ అధికారులే అంగీకరిస్తున్నారు. ఇజ్రాయిల్ దాడి మొదలైన తరవాత ఈ నిక్షేపాలను కనిపెట్టడం నెతన్యాహూ ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. నిజానికి నతాంజ్ లోని వ్యవస్థ విద్యుత్ స్విచ్చులు, ట్రాన్స్‌ఫార్మర్ల కోసం వినియోగించే వారంటున్నారు. ఇస్ఫహాన్ లోని అణు స్థావరానికి మాత్రం నష్టం ఎక్కువగానే జరిగిందనుకుంటున్నారు. ఇరాన్ దగ్గర 900 కిలో గ్రాముల శుద్ధి చేసిన యురేనియం ఉందని, అందులో 410 కిలోగ్రాములు 60 శాతం దాకా శుద్ధి చేసిందంటున్నారు. ఇజ్రాయిల్ ఎడా పెడా బాంబుల వర్షం కురిపిస్తున్నందువల్ల ఇరాన్ అణు సామాగ్రినంతటినీ ఎక్కడికి తరలించిందో కూడా అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ ప్రతినిధులకు కష్టం అవుతోంది. వారు స్వేచ్ఛగా పని చేసే అవకాశాలు లేకుండా పోయాయి. 10 అణ్వస్త్రాలు తయారు చేయడానికి పనికొచ్చేంత శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఇరాన్ దగ్గర ఉన్నాయని అంచనా. ఆ నిల్వల అంతర్జాతీయ అణు ఇంధన పరిశీలకులకు ఇస్ఫహాన్ లో కనిపించాయంటున్నారు. ఇజ్రాయిల్, అమెరికా దాడి చేయడానికి అనువుకాని చోట శుద్ధి చేసిన యురేనియం దాచి ఉండవచ్చుననుకుంటున్నారు. ఇరాన్ అణు స్థావరాల మీద దాడివల్ల అణు రంగంలో ఇరాన్ ప్రస్థానాన్ని పసిగట్టడం అసాధ్యం అయిపోయింది. అమెరికా దాడివల్ల ఇరాన్‌కు ఎంత నష్టం జరిగిందో చర్చించేకన్నా అమెరికా ఘాతుకం గురించే చర్చ జరగాలి.

వేరు పురుగు

చింతపట్ల సుదర్శన్

అరుగు మీద ఈ చివర నుంచి ఆ చివరకు పరుగెత్తి పెద్దగా నోరు తెరిచి ఏదో అరిచి వెనక్కు వచ్చి మళ్లీ ఆ చివర దాకా పరుగెత్తి నోరు తెరిచి ఏదో అరిచి వెనక్కు వచ్చి, ఇలా ఎన్నిసార్లో రిపీటు అవుతుండటంతో అనుమానం వచ్చింది డాంకీకి, డాగీ ప్రవర్తన మీద. కురవాల్సిన వానలు కురవకుండా ఇంకా ఎండలు మండిపోతుండటంతో 'ఏసీ' లు కంటిన్యూ చేస్తున్నారు మనుషులు. ఆ సౌకర్యం లేనివారు ఎండల చురుక్కు గంగవెర్రులెత్తి పోతున్నారు. కొంపదీసి ఈ డాగీకి వెర్రి తగిలిందేమో, ఆ వెర్రి కుదర్చడానికిప్పుడు రోకలి ఎక్కడ తేను అనుకున్న డాగీ ఎహె! ఆపు ఏమిటా పగ్గాల్లేని పరుగు. ఆ చివర దాకా వెళ్లి ఏమిటో అరుస్తున్నావు తిరిగి వస్తున్నావు ఏమిటది 'భవ్వు భవ్వు' మాత్రం కాదే అంది డాంకీ.

అవును నువ్వన్నది నిజమే. నేనరచేది భవ్వు మనికాదు 'కం', 'రన్', 'జంప్', 'క్యాచ్' అన్న మాటలు. పార్కులో ఓ పెద్ద మనిషి, జాతి కుక్కకు బంతి విసిరేస్తూ అన్న మాటలవి. కొత్తగా ఉన్నవి కదాని ప్రాక్టీసు చేస్తున్నా అంది డాగీ. నీకసలు సిగ్గు

రంగస్థలం

ఉందా? అంది డాంకీ టక్కున. అదేం మాట అంత మాటనేశావు అంది డాగీ నివ్వెరపోతూ. అనక మెచ్చుకోవాలా? నువ్వన్న మాటలు ఇంగ్లీషు మాటలు. పేపర్లో ఓ పెద్దాయన ఏమన్నాడు. ఇంగ్లీషు మాట్లాడ్డం అవమానం అని, సిగ్గు సిగ్గు అనీ కదా. ఇంగ్లీషు వాడు తట్టాబుట్టా సర్దుకుపోయినా వాడి భాషను మాటాడ్డం మానలేదని ఆయన ఘోష. అందువల్ల నువ్వు పార్కుకు వెళ్లి ఆ భాష నేర్చుకుని రిపీటు చెయ్యక్కర్లేదు అంది డాంకీ.

మరి తమరన్న ఇంగ్లీషు మాటో, నాకు తెలీకుండానే నేను ఇంగ్లీషు లేకుండా ఏ భాషలోనూ స్వచ్ఛంగా మాటాడ్డం అంత ఈజీ కాదనిపిస్తుంది అంది డాగీ. యూ ఆర్ రైట్ డాగీ! అంటూ అరుగు ఎక్కాడు అబ్బాయి. రా రా 'బ్రో' రా. నువ్వు కూడా సిగ్గుపడాల్సిన భాషలో మాటాడ్డం ఏం బాగులేదు అంది డాంకీ. భాషకూ, సిగ్గుకూ సంబంధం ఏమిటి? నేను చెప్పదల్చుకున్నది నీకు అర్థం అవడమే కద భాష అంటే. అయినా ఈ ప్రపంచంలో అనేక భాషలు మాట్లాడే వాళ్లున్నారు. అందరినీ కలపడానికి ఉపయోగపడుతున్న 'గ్లోబల్' భాష ఇంగ్లీషు. ఇంగ్లీషు వాడి మీద కోపం భాష మీద చూపడం అవసరమా? అన్నాడు అబ్బాయి. ఇంగ్లీషు మీద కోపమో, అక్కసో మరేమిటో కాని ఏమి మాట్లాడితే సిగ్గుపడాల్సిన పనిలేదని పెద్దాయన ఉద్దేశం అంది డాగీ. ఇంకోటీ మరోటీ కాదు హిందీయే. తల ఎత్తుకుని, గర్వంగా మాట్లాడవలసిన భాష హిందీయేనని ఆయన మాటలకు టీకా తాత్పర్యం అంది డాంకీ. త్రి భాషా సూత్రాన్ని ఏక భాషా సూత్రంగా మార్చాలని దీని భావమేమో. బలవంతంగా ఒక భాషను రుద్దితే, దేశ దేశాల్లో మన వాళ్లు ఉద్యోగాలెలా చేయగలరు. ఇంగ్లీషు కారణంగానే కదా చైనా వాళ్ల కంటే ముందున్నారు. అవ్వ పెట్టదు. అడుక్కు తిననివ్వదు అంటే ఇదేనేమో అన్నాడు అబ్బాయి.

సర్కారీ బళ్లల్లో కూడా ఇంగ్లీషు ప్రవేశపెడుతుంటే, సామాన్యులు, పేదలు తమ పిల్లలకు ముందు ముందు ఈ పోటీ ప్రపంచంలో తమ కాళ్ల మీద తాము నిలబడటానికి ఇంగ్లీషు చదువులు చెప్పిస్తుంటే కొత్తగా ఈ 'భాషా ద్వేష కసి' దేనికో అంది డాంకీ.

'విభజించి పాలించు' అన్న ఇంగ్లీషువాడి బుర్ర మాత్ర వాడొచ్చునేం వీళ్లు. మతం పేరు, కులం, వర్గం పేర జనాల్ని వేరు చేయడం చాలదని భాష పేరున కూడా వేరు కుంపటి పెడదామనేమో అన్నాడబ్బాయి. పేరుకు మాత్రమే భిన్నత్వంలో ఏకత్వం కాని, భిన్నత్వంలో విభిన్నత్వం అనాలేమో. ఇక ముందు ముందు ఎన్ని రకాల 'వేరు వేరు' లో. పొడుగువారు, పొట్టివారు, లావు వారు, సన్నం వారు, బట్టతలవారు, జుత్తున్న వారు, గడ్డాల వారు, మీసాల వారు ఇలా విడదీస్తూ పోతే చివరకు మిగిలేదేమిటో అంది డాంకీ పళ్లికిలిస్తూ.

ఎవరేమన్నా సరే 'కం', 'రన్, 'జంప్' 'క్యాచ్' అనే మాటలు మాత్రం మానేది లేదు నాకు నచ్చిన భాష నేను నేర్చుకుంటానన్నది డాగీ.

వేరు పురుగు చేరి వృక్షంబు చెరచు అన్నారు మరి నేనింక వస్తా అంటూ అరుగు దిగాడు అబ్బాయి.

నిరాశపరచిన భూసంస్కరణలు

డా. సోమసుందర్ మర్ల

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలైనప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ధనికులైన వ్యవసాయదారులు అత్యధిక భూములు కలిగి ఉన్నారు. చిన్న రైతులు అతితక్కువ విస్తీర్ణం గల భూములనే కలిగిఉన్నారు. భూ స్వాములు ఒక హోదా కలిగిఉన్నారు. నేటికీ వివిధ పంటలను పండించి దేశంలో ఆకలిని తీర్చటమే గాక, భూమిని కలిగి ఉండటంతో రైతు కుటుంబాలకు ప్రత్యేక సామాజిక హోదా కల్పిస్తుంది. ఈనాటికి 64 శాతం దేశ జనాభా గ్రామాల్లో వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నా, దేశస్థుల సంపద (జిడిపి) లో వ్యవసాయ వాటా కేవలం 16 శాతం మాత్రమే. అంటే ఇంత తక్కువ ఆదాయంతో మనుగడ సాగించే గ్రామీణ పేదలకు భూమిపై హక్కు కల్పించి, ఉత్పత్తిలో భాగస్వాములుగా చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది. ఈ ఏడాది దేశంలో 35.4 కోట్ల టన్నుల ఆహారధాన్యాలు, 30 కోట్ల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నా ప్రజల ఆకలి, పోషక ఆహార లోపాలు తగ్గలేదు. దాదాపు 80 కోట్ల మంది ప్రభుత్వం అందించే రేషను బియ్యంపై ఆధారపడి బతుకులు ఈడ్చుకొస్తున్నారు. పేదరిక నిర్మూలనకు భూమిలేని పేదలకు భూ పంపిణీ చెయ్యటం అత్యావశ్యకం.

దేశంలో మొత్తం రైతాంగంలో 86.2 శాతంగా నున్న చిన్న రైతుల వద్ద 45.2 శాతం మాత్రమే ఉన్నది. వీరి వద్ద భూమి ఒకటి నుంచి 2.5 ఎకరాల లోపు మాత్రమే. కేవలం 4.9 శాతంగా నున్న భూస్వామ్య, ధనిక రైతుల వద్ద 32 శాతం సాగుభూమి పేరుకుపోయింది. స్వల్పంగా ప్రతి ధనిక రైతు వద్ద ఒక బక్కరైతు కన్నా 45 రెట్లు అధికంగా భూమి కలదు. (నేషనల్ శాంపిల్, 2018)

ఆంధ్రప్రదేశ్‌లో13.73 శాతంగా నున్న ధనిక, మధ్య తరగతి రైతుల వద్ద మొత్తం సాగుభూమిలో 41.7 శాతం కేంద్రీకరింపబడింది. (అధిక భాగం సాగునీటి వసతి కల భూమి) కేవలం 2.5 ఎకరాలలోపు భూమి కలిగి ఉన్న చిన్న రైతుల వద్ద 65.39 శాతం భూమి కలదు. (ఇది ప్రధానంగా వర్షాధారమైనది.) భూమిలేని పేదలు గ్రామాల్లో 56.4 శాతం ఉన్నారు. దళిత రైతుల వద్ద కేవలం 11 శాతం భూమి కలదు. 60 శాతం వెనుకబడిన కులాల వారి వద్ద 31 శాతం భూమి కలదు. కేవలం 12.6 శాతం మహిళలు భూమిని కలిగి ఉన్నారు. పంజాబ్‌లో 10 శాతం ధనిక రైతుల వద్ద 80 శాతం సాగుభూమి కలదు. ఈ రాష్ట్రంలో దళితులు 32 శాతం కాగా, వీరి వద్ద భూమి నామమాత్రం. గతంలో ప్రభుత్వం పంచిన ఎసైన్డు భూములు సైతం అధిక భాగం ధనిక రైతుల ఆధీనంలో ఉన్నాయి. రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో 10 శాతం ధనిక రైతుల వద్ద 55 శాతం సాగుభూమి కలదు.

కౌలు రైతులు :

జమీందారీ, రైత్వారీ వ్యవస్థల రద్దు అనంతరం ధనికులు, గ్రామీణ రైతులు సైతం ఈనాడు గ్రామాలు వదిలి భూమిని కౌలుకిచ్చి పట్టణాలకు వలస పోతున్నారు. వ్యవసాయంలో సంపాదించిన మిగులు సంపదను రైస్ మిల్లులు, సినిమాల నిర్మాణం తదితరాలపై పెట్టుబడులుగా పెట్టినా, ప్రస్తుతం తీరు ప్రధానంగా పట్టణాల్లో వాణిజ్యం, షేర్ మార్కెట్లు, రియల్ ఎస్టేట్లు, వడ్డీ వ్యాపారాల్లోనే వెచ్చిస్తున్నారు. అధిక భాగం కౌలు రైతులు, ఇటీవల సాగు గిట్టుబాటు కాక, కుటుంబ ఖర్చులతో కుదేలయిన చిన్న రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీకి సాగు చేస్తున్నారు. పెరిగిన సాగు ఖర్చులు, ప్రతీ సంవత్సరం తీసికట్టుగా పడిపోతున్న మార్కెటు ధరల కారణంగా వీరు విపరీతంగా నష్టపోయి రుణగ్రస్తులవుతున్నారు. గత రెండు దశాబ్దాల్లోనే (2002 నుంచి 2022 మధ్య) దాదాపు నాలుగు లక్షల మంది రైతులు (రోజుకు సరాసరి 32 మంది) దేశవ్యాప్తంగా బలవన్మరణాలకు ఒడిగడుతున్నారు.

> స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్టులు సల్పిన వీరోచిత తెలంగాణా, పున్నప్రవాయలర్ తదితర రైతాంగ ఉద్యమాల ద్వారా కొన్ని వేల ఎకరాల భూమి పేదలకు పంచారు. వివిధ రాష్ట్రాలు ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ (10 లక్షల ఎకరాలు), త్రిపుర, కేరళ, కశ్మీరుల్లో ప్రభుత్వాలు కొన్ని లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి ఇచ్చాయి.

స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న రైతాంగం భూస్వామ్య దోపిడీ నుంచి విముక్తి కలగాలని, దున్నేవాడికి, పాలేర్లకు భూమి లభించాలని ఆశపడ్డారు. స్వాతంత్ర్యానంతరం జమీందారీ, రైత్వారీ వ్యవస్థలు రద్దయినా కొంతమేరకు ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్న కొన్ని లక్షల ఎకరాల మిగులు భూమి పేదలకు పంచడ మైంది. స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్టులు సల్పిన వీరోచిత తెలంగాణా, పున్నప్రవాయలర్ తదితర రైతాంగ ఉద్యమాల ద్వారా కొన్ని వేల ఎకరాల భూమి పేదలకు పంచారు. వివిధ రాష్ట్రాలు ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ (10 లక్షల ఎకరాలు), త్రిపుర, కేరళ, కశ్మీరుల్లో ప్రభుత్వాలు కొన్ని లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచి ఇచ్చాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రాల్లో కొంతమేరకు మిగులు భూమి కమ్యూనిస్టుల పోరాట ఫలితంగా ఆయా ప్రభుత్వాలు పంచవలసి వచ్చింది. 70 వ దశకానికి పోరాటాల ఫలితంగా భూసమస్య ప్రధాన ఎజెండాగా ముందుకొచ్చింది. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు భూస్వాముల యాజమాన్యంలోని భూములపై సీలింగ్ నిబంధనలను విధించి, భూసంస్కరణ చట్టాలు తెచ్చాయి. వివిధ రాష్ట్రాల్లో 68 లక్షల 72 వేల ఎకరాల మిగులు భూమిని స్వాధీనం చేసుకొన్నది. కాగా బినామీ ప్రక్రియ ద్వారా, కోర్టు కేసులు ద్వారా తమ కుటుంబాల వద్దే అధిక శాతం భూమిని భూస్వామ్య, ధనిక రైతులు కాపాడుకోగలిగేరు. భూసంస్కరణల ఫలితంగా లభించిన మిగులు భూమిలో నామమాత్రంగా దళిత, వెనుకబడిన కులాల పేదలకు ప్రభుత్వం పంచినా, పంచిన భూమి మొత్తం సాగు విస్తీర్ణం (39 కోట్ల పది లక్షల ఎకరాల్లో) కేవలం 1.25 శాతం మాత్రమే భూమిలేని పేదలకు పంచడమైంది.

పంచగలిగిన మిగులు భూమి:

ఇంకా దేశంలో 9 హెక్టార్లు (20 ఎకరాలకు పైబడి) భూమి కలిగిన 93 వేల ధనిక కుటుంబాల వద్ద 4 కోట్ల 40 లక్షల ఎకరాల భూమి కేంద్రీకృతమయి ఉంది. కనీసం 10 నుంచి 12 ఎకరాల సీలింగును విధించి భూసంస్కరణలను ఖచ్చితంగా అమలు చేస్తే దేశ వ్యాప్తంగా కోట్ల మంది కౌలురైతులు, భూమిలేని పేదలకు భూమి లభించగలదు. ఆంధ్రప్రదేశ్‌లో 24 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీకి లభిస్తుంది.

ప్రధాన శాస్త్రవేత్త ఐసిఆర్, న్యూఢిల్లీ

విప్లవ గర్జనకు 73 ఏళ్లు

కంచల జయరాజ్

విశాలాంధ్ర. పేరే ఓ ప్రేరణ. భావజాలానికి మార్గదర్శి. భావ వ్యక్తీకరణకు వేదిక. నిజాయితీకి ప్రతీక. ఇవాళ్టి ఆధునిక మాధ్యమాల తరం అది ఓ పత్రిక అని మాత్రమే చూడొచ్చు. కానీ అది కాలంలోని సామూహిక చైతన్యానికి ప్రతిధ్వనిగా మారిన శక్తి. ఈ పత్రికకు 73 వసంతాలు పూర్తయ్యాయి. స్వాతంత్ర్య పోరాటంలో, కమ్యూనిస్టు ఉద్యమాల్లో, ప్రజా వర్గ పోరాటాల్లో, జర్నలిజం మార్గదర్శనంలో విశాలాంధ్ర పాత్ర అసాధారణమైనది. అటు ఉద్యమాల్లో భాగస్వామిగా, ఇటు ఆ పోరాటాలకు శక్తినిచ్చే మాటల ఆయుధంగా మారిన ఘన గాథ ఇది.

స్వాతంత్ర్య పోరాటానికి కలం తోడైంది

1947లో స్వాతంత్ర్యం వచ్చినా, ప్రజల అసలైన విముక్తి కోసం గళమెత్తే ప్రజా వేదికలు అరుదే. అలాంటి సమయంలో కమ్యూనిస్టు భావజాలంతో, జనం తరపున నిలిచే స్పష్టతతో విశాలాంధ్ర పత్రిక ప్రారంభమవడం ఓ విప్లవ ఘటన. స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని విమర్శిస్తూ, స్థానిక రాజవాదాన్ని తూర్పారపడుతూ, ద్రవిడ రాష్ట్రాల కలల్ని, వర్గ ఉద్యమాలను శక్తిమంతంగా ప్రాతినిధ్యం వహించింది. దాడులు, నిషేధాలూ, అరెస్టులూ, ఎదురైనా అడుగు వెనక్కి వేయలేదీ పత్రిక. సంస్థను అన్యాక్రాంతం చేసేందుకు జరిగిన ప్రయత్నాలను సమర్థవంతంగా తిప్పికొట్టింది.

జాతీయోద్యమ కాలంలో కమ్యూనిస్టులు దృఢంగా ముందుకు సాగిన సమరశీల పోరాటాలకు ఊపిరివ్వడమే కాక, ప్రజలతో అవగాహన పెంచేలా, ఉద్యమ లక్ష్యాల్ని వివరిస్తూ విశాలాంధ్ర ఓ మార్గదర్శిగా నిలిచింది. "తెలంగాణ సాయుధ పోరాటం" అనే పదం అప్పుడు అధికారికంగా ఉండకపోయినా, ఆ ఉద్యమాల గుండెచప్పుడు విస్తరించే పత్రికగా విశాలాంధ్ర పేరుగాంచింది.

కమ్యూనిస్టు ఉద్యమాలకు మానసిక శక్తి

ప్రత్యక్ష పోరాటాలు చేసేవాళ్లకు మానసిక ఆధారం కల్పించిన వేదికగా విశాలాంధ్ర నిలిచింది. కమ్యూనిస్టు పార్టీల భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో, ప్రజల సమస్యలను నిశితంగా విశ్లేషించడంలో ఈ పత్రికకు అపూర్వమైన ఘనత ఉంది. ముఖ్యంగా తెలంగాణ సాయుధ పోరాట సమయంలో ప్రభుత్వం ఈ పత్రికను నిషేధించింది. అయినా పత్రిక గుండె నిబ్బరంతో ముందుకు సాగింది. భద్రాచలం అటవీ ప్రాంతాల్లో పార్టీ క్యాడర్ చేత పత్రిక ముద్రించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ పత్రిక హక్కుల పోరాటాలకు ధైర్యాన్ని కల్పించింది. కార్మిక వర్గం, రైతాంగం, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం తిరుగుబాటు పత్రికగా మారింది. ప్రతి ఉద్యమాన్ని విశాలాంధ్ర తన పేజీల్లో నిబద్ధంగా ప్రతిబింబించింది. ఇది అనేక మంది కమ్యూనిస్టు రచయితల ఉద్యమాలకు ప్రచార వేదికగా నిలిచింది.

జర్నలిజంలో విలక్షణ స్థానం

విశాలాంధ్ర జర్నలిజాన్ని వ్యాపార మాధ్యమంగా కాక, సామాజిక చైతన్య సాధనంగా పని చేసింది. వార్తా విలువతో పాటు ప్రజా అవసరాలకు ఎక్కువగా ప్రాధాన్యం ఇచ్చింది. ఇతర పత్రికలు రాజకీయ నాయకుల ప్రకటనల్ని తొలి పేజీలో వేస్తే, విశాలాంధ్ర మాత్రం కూలీలే, కార్మికులే, రైతులే అగ్రస్థానానికి చెల్లుబాటు అయ్యే పాత్రలు అన్న నిబద్ధతను ఎప్పటికీ వదలలేదు.

పత్రికలో "ప్రజా వేదిక", "వార్తల వెనుక వాస్తవాలు", "కత్తిరింపులు" వంటి శీర్షికలు ఒక చదువరుడిగా మానసిక మేధస్సును మేల్కొల్పేవి. మహిళలకు సంబంధించి ఒక పేజీని మొదటిగా కేటాయించిన పత్రిక విశాలాంధ్రే. సంపాదకులుగా పనిచేసిన మద్దుకూరి చంద్రశేఖరరావు, మోటూరు హనుమంతరావు, ఏటుకూరి బలరామమూర్తి, వేములపల్లి శ్రీకృష్ణ, సి. రాఘవాచారి వంటి జర్నలిస్టులు దృఢమైన సిద్ధాంతంతో ప్రజలకు సేవ చేశారు. ఏ ఎడిటోరియల్ అయినా సామాజిక ప్రయోజనానికే పునాదిగా ఉండేది. ఉంటోంది.

ప్రజాగళం విశాలాంధ్ర సొంతం

ప్రస్తుత కాలంలో మార్కెట్ శక్తుల కనుసన్నల్లో తెలియాడుతున్న మీడియా ప్రపంచంలో విశాలాంధ్ర ఇంకా ప్రజల గళంగా వినిపిస్తూనే ఉంది. 73 ఏళ్లలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా, విలీనాలు, ఆర్థిక సంక్షోభాలు వచ్చినా, దారితప్పలేదు. ఆధునిక యుగంలో ఆన్‌లైన్ మాధ్య మాల్లోనూ విశాలాంధ్ర తన ప్రతిష్టను పెంచుకుంటూనే ఉంది. రాజకీయంగా వామపక్ష భావజాలాన్ని నిలబెట్టే స్వరంగా, దళిత ,బహుజన వర్గాలకు వేదికగా మారింది. విశాలాంధ్ర, ఈ పేరు నాటకీయంగా కాక, నడిచే తీరుతో చరిత్రగా మలిచింది. ఇది కేవలం ఒక పత్రిక కాదు - ఒక ఉద్యమం. అది వార్తల కోణంలో మానవ విలువలు నిలబెట్టిన గొప్ప ఆచారంగా, సామూహిక మనోభావాలకు అక్షర రూపంగా కొనసాగుతోంది. ఇది మాటలతో కాదు, మార్పుతో నిలిచిన పత్రిక. అస్తిత్వ పోరాటాలకు అక్షర బలమిచ్చిన పత్రిక. సత్యానికి నిలువెత్తు శిల్పంగా నిలిచిన పత్రిక.

విశాలాంధ్ర - ప్రజల పక్షాన నిలిచిన పత్రిక, నిష్పాక్షికత కాదు, ప్రజా పక్షపాతమే ధర్మం అన్న నమ్మకానికి ప్రతీక.

లక్ష మంది టెక్కీలపై వేటు

వేలాది మందిని ఇంటికి పంపుతున్న దిగ్గజ సంస్థలు

న్యూఢిల్లీ: టెక్ రంగంలో ఉద్యోగాల కోత కొనసాగుతున్నది. ఇంటెల్, మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలు మొదలుకొని స్టార్టప్‌ల వరకూ భారీగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లోనే 62 వేల మందికిపైగా ఇంటికి పంపాయి. ఇప్పటికే ప్రకటించిన లేఆఫ్‌లను పరిశీలిస్తే ఈ ఏడాది తొలగించబోయే ఉద్యోగుల సంఖ్య లక్ష దాటింది. ప్రధాన టెక్ కంపెనీలన్నీ తమ వ్యాపార సరళి, నిర్వహణలో అనూహ్య మార్పులను చేపడుతుండటంతో, సెమికండక్టర్ తయారీ రంగం నుంచి సోషల్‌మీడియా రంగం వరకు ఉద్యోగాల తొలగింపు మొదలైంది. దీంతో ఉద్యోగాలు కోల్పోయిన వేలాది మంది పోటీ ప్రపంచంలో కొత్త అవకాశాల కోసం వెదుక్కునే పరిస్థితి ఏర్పడింది. హార్డ్‌వేర్ ఉత్పత్తులను తయారుచేసే ఇంటెల్, ఫిన్‌టెక్ కంపెనీ బ్లాక్, బ్లూ ఆరిజన్ వంటి స్పేస్ కంపెనీలు కూడా తమ సిబ్బందిని తగ్గించుకునే ప్రణాళికను ప్రకటించాయి.

చత్తీస్‌గఢ్‌లో రేషన్ కోసం తోపులాట

- 20 మందికి గాయాలు
- 3 నెలలుగా కార్డుదారుల ఇక్కట్లు
- మొరాయిస్తున్న మెషిన్లు
- ప్రభుత్వ విధానంపై ప్రజల మండిపాటు

రాయ్‌పూర్/న్యూఢిల్లీ: రేషన్ పొందేందుకు మూడు నెలలుగా జనం ఇబ్బందిపడుతున్నారు. సాంకేతిక లోపం వల్ల మిషన్లు మొరాయిస్తుండడంతో సహనం కోల్పోయిన లబ్ధిదారులు రేషన్ కోసం గేటు తోసుకుని లోనికి వెళ్లారు. ఈ తోపులాటలో కిందపడి 20 మంది గాయపడ్డారు. చత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కేంద్రం నిర్ణయం మేరకు మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ చేస్తున్నారు. కాగా, రేషన్ పంపిణీ మిషన్‌లో సమస్యలు, సర్వర్ లోపాలు, వేలిముద్రలు, ఓటీపీ సమస్యల వల్ల రోజుకు కేవలం 20 నుంచి 25 మంది మాత్రమే రేషన్ పొందుతున్నారు. దీంతో క్యూలో ఉన్నవారు నిరాశతో తిరిగివెళుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వివిధ చోట్ల తోపులాట, తొక్కిసలాటలు జరిగాయి. ఒక ప్రభుత్వ రేషన్ షాపు వద్ద జనం పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఒక్కసారిగా గేటు తోసుకుని లోనికి వెళ్లారు. దీంతో కిందపడి కొందరు గాయపడ్డారు. ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేయకపోవడంపై మండిపడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. దేశ ప్రజలు ఉచిత రేషన్ కోసం వరుసలో నిలబడి ఉండగా ప్రధాని మోదీ... ధనవంతులైన అతడి స్నేహితులు 'ఖరీదైన పుట్టగొడుగులను తింటున్నారు' అని చత్తీస్‌గఢ్ నుంచి వచ్చినట్లు చెప్పబడుతున్న వీడియోను కాంగ్రెస్ ప్రత్యేకంగా ప్రసారం చేసింది. ఒక గేటెడ్ కాంప్లెక్స్ వెలుపల పెద్ద సంఖ్యలో జనం గుమిగూడినట్లు ఆ వీడియోలో ఉంది. గేటు తెరిచిన వెంటనే జనం కాంప్లెక్స్‌లో ఉన్న భవనం వైపు పరుగెత్తారు. ఒక జర్నలిస్టు మొదట 'ఎక్స్' లో వీడియోను హిందీలో ఈ క్రింది శీర్షికతో పోస్ట్ చేశాడు. 'వీరు మన దేశ ప్రజలు... ఇది చత్తీస్‌గఢ్‌కు చెందిన గరియాబంద్. గేట్ తెరిచిన వెంటనే వారు పారిపోవాల్సి వస్తుంది. మూడు నెలల రేషన్ కలిసి ఇవ్వాలి, ఒక రోజులో కేవలం 20-22 మందికి మాత్రమే రేషన్ అందుతోంది' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ తన సోషల్ మీడియాలో 16 సెకన్ల దృశ్యాన్ని పోస్ట్ చేసింది. 'నేటి భారతదేశం' అని దేశంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీ హిందీలో కూడా రాసింది. 'దేశ ప్రజలు ఉచిత రేషన్ కోసం ఒక గుంపుగా నిలబడి ఉన్నారు. భారతదేశంలో 100 కోట్లకు పైగా ప్రజలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని గణాంకాలు పేర్కొంటున్న విషయాన్ని ఈ గుంపు రుజువు చేస్తోంది' అని తెలిపారు. 'నరేంద్ర మోదీ, అతని ధనవంతులైన స్నేహితులు ఖరీదైన పుట్టగొడుగులను తింటున్నారు. ప్రజలు ఉచిత రేషన్ కోసం వరుసలో నిలబడి ఉన్నారు' అని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి పార్లమెంటులో మాట్లాడుతూ గత యూపీఏ ప్రభుత్వం ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 2013లో ఆహార భద్రతా చట్టాన్ని ప్రవేశపెట్టిందని, ప్రధాని మోదీ 80 కోట్ల మందికి క్రమబద్ధమైన పద్ధతిలో ఉచిత ఆహార ధాన్యాలను అందించడానికి చొరవ తీసుకున్నారని తెలిపారు. దేశంలో ఎక్కడయినా లబ్ధిదారులు ఉచిత రేషన్ పొందేలా 'ఒక దేశం, ఒక రేషన్ కార్డు' పథకం సామాన్య ప్రజల జీవితాన్ని సులభతరం చేసిందని కూడా చెప్పుకొచ్చారు.

ఐపీఎల్ విజయోత్సవాలపై

బీసీసీఐ కఠిన నిబంధనలు

బెంగళూరు: భవిష్యత్తులో విజయోత్సవాల్లో తొక్కిసలాట ఘటనలు జరగకుండా బీసీసీఐ కఠిన నిబంధనలు తీసుకొచ్చింది. ఐపీఎల్ విజేతలు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను రూపొందించిన విషయాన్ని బోర్డు సెక్రటరీ దేవజిత్ సైకియా వెల్లడించారు. తొక్కిసలాట ఘటనను బీసీసీఐ తీవ్రంగా పరిగణిస్తోందని తెలిపారు. విజయోత్సవ వేడుకల కోసం... టైటిల్ గెలిచిన మూడు నుంచి నాలుగు రోజుల తర్వాతే విజయోత్సవాలు చేసుకోవాలి. బోర్డు నుంచి ముందస్తు లిఖిత పూర్వకమైన అనుమతి లేకుండా ఈవెంట్‌లను నిర్వహించకూడదు. నాలుగు అంచెల భద్రత తప్పనిసరి. అన్ని వేదికల వద్ద, రవాణా సమయంలో మల్టీ లేయర్డ్ సెక్యూరిటీ ఉండాలి. జిల్లా పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికారుల నుంచి అనుమతి పొందాలి. ఈవెంట్ షెడ్యూల్ అంతటా ఆటగాళ్లకు, సిబ్బందికి రక్షణ కల్పించాలి. విమానాశ్రయం నుంచి ఈవెంట్ వేదిక వరకు భద్రత ఉండాలి. వేడుకలు చట్టబద్ధంగా,సురక్షితంగా కొనసాగడానికి పౌర, చట్టాన్ని అమలు చేసే సంస్థలు అనుమతి ఇవ్వాలి అని బీసీసీఐ తన మార్గదర్శకాల్లో పొందుపరిచింది. ఆర్సీబీ విజయోత్సవ వేడుకలో తొక్కిసలాట దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 50 మందికిపైగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకుంది.

పాఠశాలకు బాంబు బెదిరింపు... కలకలం రేపిన మెయిల్

అహ్మదాబాద్: ఈ మధ్యకాలంలో బాంబు బెదిరింపులు పెరిగిపోయాయి. విద్యాసంస్థలు, విమానాశ్రయాలు, రైళ్లలో బాంబులు అమర్చామని మెయిల్స్ పంపడం నిత్యకృత్యంగా మారింది. తాజాగా గుజరాత్‌లోని వడోదర పాఠశాలలో బాంబు పెట్టామని, సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు అది పేలుతుందని ఓ ఆగంతకుడు పంపిన మెయిల్ కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన బాంబ్ స్క్వాడ్‌తో ఆ పాఠశాలకు చేరుకుని తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి బాంబు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వడోదరలోని సామా ఏరియాలోగల నవరచన పాఠశాలకు సోమవారం ఉదయం 6.50 గంటలకు బెదిరింపు మెయిల్ వచ్చింది. పాఠశాలలో బాంబు పెట్టామని, ఆ బాంబు మధ్యాహ్నం 2 గంటలకు పేలుతుందని ఆ మెయిల్‌లో ఉంది. దాంతో పాఠశాల యాజమాన్యం పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు తనిఖీ చేసి బాంబు లేదని తేల్చారు. కాగా ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని వడోదర డీసీపీ పన్నా మోమయా తెలిపారు. బెదిరింపు ఈ మెయిల్ ఎక్కడి నుంచి వచ్చింది... ఏ ఐపీ అడ్రస్ నుంచి పంపారు అనే కోణంలో తమ దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

11 ఏళ్లలో 29 వేల మంది బలి

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 11 ఏళ్లలో లోకల్ రైళ్లు 29 వేల మందిని బలితీసుకున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థలో అత్యంత ప్రధానమైన సబర్బన్ రైళ్లు... ఉరుకులుపరుగుల జీవనం గడిపే కోట్లాది మంది రవాణా కష్టాలను తీరుస్తాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రైళ్లు.. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణికులతో కిక్కిరిసిపోతాయి. నిలబడటానికి కూడా జాగా లేక ప్రజలు వేలాడుతూ ప్రయాణాలు చేయడం సర్వసాధారణం. ముంబై ప్రజాజీవనంలో భాగమైన లోకల్ రైళ్లు... వారి ప్రాణాలను కూడా బలితీసుకుంటున్నాయి. ప్రతిరోజూ ఏదో ఒక మూల రైలు ప్రమాదాల్లో ప్రజలు చనిపోతూనే ఉన్నారు. గత పదకొండేండ్ల కాలంలో ఏకంగా 29 వేల మందికిపైగా రైలు ప్రమాదాల్లో మరణించారు. వారిలో 8,416 మంది బాధితులను ఇప్పటికీ గుర్తించలేదు. సమాచార హక్కు చట్టం ద్వారా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2014 నుంచి 2024 వరకు ముంబై సబర్బన్ రైల్వే పరిధిలో మొత్తం 29,048 మంది మరణించాని ప్రభుత్వ రైల్వే పోలీసులు గణాంకాలు వెల్లడించాయి. వీరిలో అత్యధికులు అంటే 15 వేల మందికిపైగా పట్టాలు దాటుతూ ప్రాణాలు కోల్పోయారు. ఇక కిక్కిరిసిన రైళ్లలో వేలాడుతూ ప్రయాణిస్తూ ప్రమాద వశాత్తు కిందపడి 6,500 మంది చనిపోయారు. రైలు పట్టాలు దాటుతూ చనిపోయేవారే అధికంగా ఉంటున్నారని జీఆర్‌పీ అధికారులు వెల్లడించారు.

వారి శరీర భాగాలు చిందరవందర కావడంతో బాధితులను గుర్తించడం కష్టసాధ్యమవుతున్నదని తెలిపారు. లోకల్ రైళ్లు ప్రతిరోజు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు నడుస్తాయి. కొన్ని మార్గాల్లో మూడు గంటల వరకు కూడా సేవలు అందిస్తాయి.

జమ్మూ కోర్టుకు 'ఉగ్ర' నిందితులు

శ్రీనగర్: ఈ ఏడాది ఏప్రిల్‌లో పహల్గాంలో మారణహోమం సృష్టించిన నలుగురు ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చిన ఇద్దరు నిందితులు పర్వీజ్ అహ్మద్ జోతర్, బషీర్ అహ్మద్ జోతర్ లను ఎన్ఐఏ అధికారులు సోమవారం జమ్మూ కోర్టులో హాజరుపర్చారు. నిందితులు ఇద్దరికీ రిమాండ్ విధించాలని ఎన్ఐఏ అధికారులు కోర్టును కోరారు. పహల్గాం ఉగ్రదాడి కేసు విచారణ జరుపుతున్న ఎన్ఐఏ అధికారులు ఇప్పటివరకు మొత్తం రెండు వేల మందికిపైగా సాక్ష్యులను విచారించారు. గడిచిన రెండు వారాల్లో ఏకంగా 32 ప్రాంతాలలో సోదాలు చేసి పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. వారిలో ఇద్దరు పహల్గాంలో దాడికి పాల్పడిన ఉగ్రవాదులకు ఆశ్రయం ఇచ్చారని గుర్తించి ఆదివారం అరెస్ట్ చేసి సోమవారం వాళ్లను కోర్టులో హాజరుపర్చారు.

రైలు ప్రయాణికుడిపై

బీజేపీ ఎమ్మెల్యే అనుచరుల దాడి

న్యూఢిల్లీ: ఢిల్లీ నుంచి భోపాల్ వెళ్తున్న వందేభారత్ రైలులో ఓ ప్రయాణికుడిని ఎమ్మెల్యే అనుచరులు చితకబాదిన ఘటన కెమెరాలకు చిక్కింది. వివరాల్లోకి వెళితే... ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీకి చెందిన బీజేపీ ఎమ్మెల్యే రాజీవ్ సింగ్ ... తన భార్య, కుమారుడితో కలిసి వందేభారత్ రైలు ఎక్కారు. అయితే ఓ బోగీలో ఎమ్మెల్యే సింగ్‌కు సీటు ఓ చోట, తన ఫ్యామిలీ సభ్యులకు మరో చోట సీటు దొరికింది. కుటుంబసభ్యులు కూర్చున్న చోట మరో ప్రయాణికుడు కూర్చుకున్నాడు. అయితే సీటు మారేందుకు అతడు నిరాకరించాడు. దీంతో ఎమ్మెల్యే కుటుంబానికి, ఆ వ్యక్తికి మధ్య గొడవ జరిగింది. అయితే ఝాన్సీ రైల్వే స్టేషన్‌కు రైలు చేరుకున్న తర్వాత ఎమ్మెల్యేకు సంబంధించిన వ్యక్తులు వచ్చి ఆ ప్రయాణికుడిపై దాడికి పాల్పడ్డారు. సుమారు డజన్ మంది ఏకపక్షంగా దాడి చేశారు. చెప్పులతోనూ అతడిపై విరుచుకుపడ్డారు. రక్తం కారేలా కొట్టారు. ఈ ఘటనపై ఝాన్సీ ఎస్పీ విపుల్ కుమార్ శ్రీవాత్సవ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

సీట్లు మార్పు విషయంలో గొడవ జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే సింగ్ ఫిర్యాదు ఆధారంగా ఎన్సీఆర్ కేసు బుక్ చేశారు. భార్య పిల్లలతో ప్రయాణిస్తున్న సమయంలో... తోటి ప్రయాణికుడు తన కుటుంబంతో దురుసుగా ప్రవర్తించినట్లు ఎమ్మెల్యే తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

యోగాడేకు హాజరుకాని

ఉద్యోగుల జీతాలు నిలిపివేత?

డెహ్రాడూన్: 'యోగా డే'కు హాజరుకాని ఉద్యోగులకు నెల జీతాన్ని నిలిపివేయనున్నట్లు వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఐఐ) ప్రకటించింది. ముందస్తు సమాచారం లేకుండా ఈనెల 21 నిర్వహించిన యోగా డేకు గైర్హాజరైన ఉద్యోగులకు ఈ నెల జీతాన్ని నిలిపివేస్తామని సోమవారం డబ్ల్యుఐఐ ఒక ప్రకటన జారీ చేసింది. అయితే కొన్ని గంటల తర్వాత ఈ ఆదేశాలను ఉపసంహరించుకుంటూ మరో ఈ-మెయిల్ పంపినట్లు సమాచారం. డబ్ల్యుఐఐ సిబ్బందికి సాధారణ ఈ మెయిల్ పంపిందని, కానీ అటువంటి చర్య ఏమీ ప్రతిపాదించలేదని డబ్ల్యుఐఐ డైరెక్టర్ వీరేంద్ర తివారీ పేర్కొన్నారు. డబ్ల్యుఐఐ నోటీసులు జారీ చేసినప్పటికీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ నుంచి సమాచారం ఉన్నప్పటికీ... శనివారం నిర్వహించిన యోగా డే కి హాజరుశాతం తక్కువగా ఉండటంపై ఈ సంస్థ పంపిన ఈ మెయిల్‌లో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యమైన జాతీయ కార్యక్రమంలో 75 మంది మాత్రమే హాజరైనప్పటికీ... 600 మందికి పైగా ఉద్యోగులు (పరిశోధకులు సహా) నెలవారీ జీతాలు/భత్యాలు డబ్ల్యుఐఐ సకాలంలో అందిస్తుందని గమనించండి అని ఉద్యోగులకు పంపిన ఈ మెయిల్ పేర్కొంది. అయితే ముందస్తు సమాచారం లేకుంగా గైర్హాజరైన ఉద్యోగులు లిఖిత పూర్వక వివరణను సమర్పించాలి అని అందులో తెలిపింది. శాశ్వత... కాంట్రాక్ట్ సిబ్బంది తమ రిపోర్టింగ్ అధికారికి లేదా డిప్యూటీ రిజిస్ట్రార్‌కు వివరణలను సమర్పించాలని ఆదేశించింది. హాజరు రికార్డు, టూర్ వివరాలు, చెల్లుబాటు అయ్యే రాతపూర్వక వివరణలు సమర్పించి, ధృవీకరించబడే వరకు జూన్ జీతం విడుదలను నిలిపివేయాలని సంబంధిత అధికారిని ఆదేశించినట్లు సమాచారం. అనంతరం మధ్యాహ్నం 1.55 గంటలకు పంపిన మరో ఈ-మెయిల్‌లో ఆ సందేశాన్ని ఉపసంహరించుకున్నట్లు తెలిపింది. యోగాడేకు అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని ఉత్తర్వులు జారీ చేయలేదని, ఇటువంటి ఈ మెయిల్స్ పంపడం ఇదే మొదటిసారి అని ఒక ఉద్యోగి పేర్కొన్నారు. ఇది అందరినీ షాక్‌కు గురిచేసిందని అన్నారు. వివరణనివ్వమనడం కొంచెం అతిగా ఉందని మరో ఉద్యోగి ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధ్యక్ష పదవికి మరోసారి లాలూ నామినేషన్

పాట్నా: బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ పార్టీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ మరోసారి పార్టీ జాతీయ అధ్యక్ష పదవి కి నామినేషన్ వేశారు. ఆయన ఇప్పటివరకు 12 పర్యాయాలు జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు 13వ సారి పార్టీ అధ్యక్షుడు కాబోతున్నారు. లాలూ ప్రసాద్ యాదవ్ తనయుడు, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. లాలూజీ మరోసారి పార్టీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడంతో కార్యకర్తల నుంచి నాయకుల వరకు ప్రతి ఒక్కరిలో సంతోషం వెల్లివిరిసిందని తేజస్వి అన్నారు. లాలూ నేతృత్వంలో బీహార్‌లో మరోసారి ఆర్జేడీ అధికారంలోకి రాబోతోందని ఆయన ధీమా వ్యక్తంచేశారు.

నక్సల్స్ ఏరివేత రాజకీయం చేయొద్దు

సచిన్ పైలట్

రాయ్‌పూర్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యాంటీ నక్సల్ ఆపరేషన్స్‌ని రాజకీయం చేయొద్దు అని కాంగ్రెస్ సీనియర్ నేత సచిన్ పైలట్ అన్నారు. నక్సల్స్ వ్యతిరేక కార్యకలాపాలను మరింత సమర్థంతంగా, పారదర్శకంగా ఉండాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. ప్రస్తుతం సచిన్ పైలట్ చండీగఢ్‌కి ఆ పార్టీ ఇంఛార్జిగా వ్యవహరిస్తున్నారు. రెండురోజులపాటు ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నేతల సమావేశాలు జరగనున్నాయి. ఈ సందర్భగా ఆయన సోమవారం చండీగఢ్‌కి చేరుకున్నారు. రాయ్‌పూర్‌లో స్వామి వివేకానంద విమానాశ్రయం వెలుపల విలేకరులతో ఆయన మాట్లాడుతూ... 'కాంగ్రెస్ ఎప్పుడూ హింసకు, తీవ్రవాద చర్యలకు వ్యతికంగా ఉంటుంది. దేశాన్ని, రాష్ట్రాన్ని సురక్షితంగా ఉంచడానికి మన నాయకులు తమ ప్రాణాలను త్యాగం చేశారు. తీవ్రవాదాన్ని అంతం చేయడానికి కచ్చితంగా ప్రభావవంతమైన చర్య తీసుకోవాలి. ఆ చర్య కూడా పారదర్శకంగా జరగాలి. కానీ దానిని రాజకీయం చేయకూడదు' అని ఆయన అన్నారు. కేవలం చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోనే నక్సలిజాన్ని అంతం చేయడం కాదు. ఇతర రాష్ట్రాల్లో కూడా నక్సలిజాన్ని అంతం చేయాలి. దీనికి అందరూ కలిసి రావాలని అని సచిన్ పిలుపునిచ్చారు.

నక్సలిజాన్ని అంతం చేయడానికి ముందు చర్చలు జరపాలి. అది పారదర్శకంగా జవాబుదారీగా ఉండాలి. ఏది జరిగినా ప్రజలకు ప్రయోజనం దక్కాలి. ఈ చర్యలు కేవలం మాటలకే పరిమితం కాకుండా... క్షేత్ర స్థాయిలో అమలు జరిగేలా చూడాలి అని ఆయన అన్నారు. చత్తీస్‌గఢ్‌లో రెండురోజులపాటు జరగనున్న సమావేశాల్లో నక్సలిజానికి వ్యతిరేకంగా భవిష్యత్తు కార్యాచరణపై చర్చిస్తామన్నారు. ఆ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

కేరళ మాజీ సీఎం

అచ్యుతానందన్ ఆస్పత్రిలో చేరిక

తిరువనంతపురం: ప్రముఖ సీపీఐ (ఎం) నేత, కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ (101) గుండెపోటుతో సోమవారం ఉదయం తిరువనంతపురంలోని పట్టోమ్‌లో ఎస్‌యుటీ ఆస్పత్రిలో చేరారు. ఐసీయూలో ఉన్నారని, ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. గతేడాది అక్టోబరు 20న ఆయన 101వ వడిలోకి అడుగుపెట్టారు. కేరళ రాజకీయాల్లో అచ్యుతానందన్ ఒక మహోన్నతమైన...చురుకైన పాత్ర పోషించారు. అచ్యుతానందన్ 1923లో అలప్పుజలోని పున్నప్రలో వ్యవసాయకార్మికుల కుటుంబంలో జన్మించారు.

పైలట్‌ను కులం పేరుతో దూషించిన అధికారులు

బెంగళూరు: ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోలో పనిచేస్తున్న ఒక ట్రైనీ పైలట్‌ను కొందరు అధికారులు కులం పేరుతో దూషించి, తీవ్రంగా అవమానించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు ఇండిగో అధికారులపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేశారు. షెడ్యూల్ కులానికి చెందిన ట్రైనీ పైలట్ (35)పై కొందరు అధికారులు దురుసుగా ప్రవర్తించారు. తపస్ డే, మనీశ్ సహానీ, రాహుల్ పాటిల్... కులం పేరుతో దూషిస్తూ తీవ్రంగా అవమానించారు. 'నువ్వు విమానం నడిపేందుకు అనర్హుడివి... వెళ్లి చెప్పులు కుట్టుకో' అంటూ తీవ్ర పదజాలంతో దూషించారు. దీంతో బాధితుడు బెంగళూరు పోలీసులను సంప్రదించారు. అక్కడి పోలీసులు ఈ ఘటనపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం ఈ కేసును ఇండిగో ప్రధాన కార్యాలయం ఉన్న గురుగ్రామ్‌కు బదిలీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు ముగ్గురు అధికారులపై ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టంలోని సంబంధిత సెక్షన్లతో పాటు, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద కేసులు నమోదు చేశారు.

దేశవ్యాప్తంగా 6 రోజులు భారీ వర్షాలు

న్యూఢిల్లీ: గత కొద్ది రోజులు విరామం ఇచ్చిన వర్షాలు, ఇప్పుడు మళ్లీ దేశవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 28 వరకు భారీస్థాయిలో వర్షాలు పడే అవకాశమున్నట్టు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఈ వర్షాలు ప్రధానంగా పశ్చిమ, కేంద్రీయ, దక్షిణ భారత ప్రాంతాల్లో ఎక్కువగా కురిసే అవకాశం ఉంది. ఉత్తరప్రదేశ్, హర్యానా, ఉత్తరాఖండ్, ఈస్ట్ రాజస్థాన్ ప్రాంతాలలో వర్షాలు పడతాయని అంచనా. అలాగే దక్షిణ హిమాచల్ ప్రదేశ్, లడాఖ్, కశ్మీర్, జమ్మూ, పంజాబ్ వంటి ప్రాంతాల్లో వానలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. వర్షాలు 24వ తేదీ నుంచి ఢిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతాల్లో తీవ్రంగా ఉంటాయని వాతావరణశాఖ తెలిపింది. ఈ క్రమంలో 25 వరకు జమ్మూ కశ్మీర్, లడఖ్, పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో వర్షాలు కురియనున్నాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రాంతాల్లో 26 వరకు వానలు ఉండగా, ఈస్ట్ రాజస్థాన్ ప్రాంతాల్లో 28 వరకు వానలు ఉంటాయని వాతావరణ శాఖ వివరించింది. మరోవైపు రానున్న నాలుగు రోజులపాటు తెలుగు రాష్ట్రాలలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించింది.

ఉరుములు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు ఉన్నాయని ఐఎండీ ప్రజలను అప్రమత్తం చేసింది. తెలంగాణలో కూడా ముఖ్యంగా హైదరాబాద్ సహా పలు ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వివిధ జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, విశాఖ, కాకినాడ, కోనసీమ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి వంటి ప్రాంతాలలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. మధ్య భారతదేశం, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒడిశా, విదర్భ, చత్తీస్‌గఢ్, మధ్య మహారాష్ట్ర ప్రాంతాల్లోను, మరోవైపు అసోం, మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్, మిజోరాం, త్రిపుర ప్రాంతాల్లో కూడా వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు.

వృద్ధురాలికి క్యాన్సర్... చెత్తకుప్ప వద్ద పడేసిన మనవడు

ముంబై : క్యాన్సర్‌తో బాధపడుతున్న వృద్ధురాలు (60) పట్ల ఆమె కుటుంబం దారుణంగా ప్రవర్తించింది. మనవడు ఆమెను చెత్తకుప్ప వద్ద పడేశాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. వివరాలివి. ఆరే కాలనీలో రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్ప దగ్గర వృద్ధురాలు పడి ఉంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని వృద్ధురాలిని యశోద గైక్వాడ్‌గా గుర్తించారు. స్కిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న తనను మనవడు చెత్తకుప్ప వద్ద పడేసినట్లు పోలీసులకు ఆమె తెలిపింది. తన కుటుంబ సభ్యులు మలాడ్, కాండివాలిలో నివసిస్తున్నట్లు చెప్పింది. దీంతో పోలీసులు ఆమె ఫొటోను ఆయా పోలీస్ స్టేషన్లకు పంపారు. మరోవైపు చర్మ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆ వృద్ధురాలిని హాస్పిటల్‌లో చేర్చేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయితే ఆమె ఆరోగ్య పరిస్థితి చూసి అడ్మిట్ చేసుకునేందుకు ఆసుపత్రులు నిరాకరించాయి. చివరకు ఆ వృద్ధురాలిని కూపర్ ఆసుపత్రిలో చేర్చారు. ఆమె కుటుంబ సభ్యుల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఆ వృద్ధురాలిని చెత్తకుప్ప వద్ద మనవడు ఎందుకు పడేశాడు అన్నదానిపై దర్యాప్తు చేస్తున్నారు.

లగేజ్ లేకుండా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు ల్యాండ్...

పాట్నా: ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన రెండు విమానాలు లగేజ్ తీసుకురాకుండా ఎయిర్‌పోర్టులో దిగాయి. ఈ విషయం తెలుసుకుని ప్రయాణికులు షాక్ అయ్యారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లగేజ్ లేకపోవడంతో వేడుకలకు హాజరయ్యేవారు ఇబ్బందిపడ్డారు. బెంగళూరు, చెన్నై నుంచి రెండు ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు ఒకే సమయానికి పాట్నా చేరుకున్నాయి. కాగా, ఎయిర్‌పోర్ట్‌లో ఆ విమానాల ల్యాండింగ్ తర్వాత ప్రయాణికులు తమ లగేజ్‌ను తీసుకునే బెల్ట్ నంబర్ గురించి ఎనౌన్స్ చేశారు. అయితే అక్కడ తమ లగేజ్ కనిపించకపోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. మరోవైపు అధిక బరువు కారణంగా ప్రయాణికుల లగేజ్‌ను ఆ విమానాల్లో లోడ్ చేయలేదని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ గ్రౌండ్ స్టాఫ్, సీఐఎస్ఎఫ్ సిబ్బంది ప్రయాణికులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. అయితే తమ లగేజ్ చేరకపోవడంతో కనెక్టింగ్ విమానంలో వెళ్లాల్సిన ప్రయాణికులు, ఇతర కార్యక్రమాలు, వేడుకలకు హాజరుకావాల్సిన వారు ఇబ్బందిపడ్డారు.

విశాలాంధ్ర హైదరాబాద్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూ వన మహోత్సవంలో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయుటకు సంబంధిత శాఖల అధికారులు మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి గుంతలు తీసి సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభల విజయవంతానికి విస్తృత ప్రచారం చేయాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఆగస్టు 19 నుండి 22వ తేదీ వరకు జరుగు సిపిఐ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని సోమవారం వినాయక్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాసర్ల నాగరాజు అధ్యక్షతన జరిగిన మండల కౌన్సిల్ సమావేశంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 ఆగస్టు 19 నుండి 22వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మన జిల్లా కేంద్రంలో కుత్బుల్లాపూర్ మండలంలో జరగనున్నాయని మహాసభల విజయవంతానికి పార్టీ ప్రతిష్టకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహాసభల కరపత్రాలను ఇంటింటికి పంచి మహాసభలకు అధిక సంఖ్యలో జన సమీకరణ చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశం ప్రారంభానికి ముందు సిపిఐ జిల్లా కార్యదర్శిగా ఎన్నికై మొదటిసారిగా మల్కాజ్గిరి కి వచ్చిన సందర్భంగా ఉమా మహేష్ ని సన్మానించడం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సిహెచ్ దశరథ్, మండల కార్యదర్శి టీ యాదయ్య గౌడ్, సహాయ కార్యదర్శి ఏ. అశోక్, సీనియర్ నాయకులు కే.ప్రభాకర్, పి.సత్యనారాయణ, నాయకులు బి యాదగిరి, జె.రాములు, ఎస్.కె అజీజ్, జె.వెంకటరమణ, బి.లింగం, వి.భూమయ్య, జీ.రాములు, కళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే నిరుపేదల సొంతింటి కల సాకారం

విశాలాంధ్ర - మొయినాబాద్: పేదలకు సొంతింటి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పామెన భీం భరత్ అన్నారు. మొయినాబాద్ మండలంలోని చిలుకూరు గ్రామంలో ఇందిరమ్మ జిల్లా నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ సొంత ఇంటిలోనే జీవించాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ప్రతి పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు నిర్ణయించిందని పేర్కొన్నారు. మండల అధ్యక్షులు మానయ్య, వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు కేబుల్ రాజు, గణేష్, విఠల్ యాదవ్, మత్స్యకారుల సంఘం అధ్యక్షులు బిక్షపతి, నరసింహారావు ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలకృష్ణారెడ్డి , బాకారం మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి ,చిలుకూరు గ్రామం మాజీ సర్పంచులు భద్రప్ప, రాజు, రవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు



విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతంనగర్ డివిజన్‌లో రాజా శ్రీనివాసనగర్ కాలనీలో వర్షాకాల ముందస్తు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించుట జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత యాదవ్ పాల్గొని పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. జ్యోతి నగర్ నుండి వచ్చు మురుగునీటి కాలువ పరివాహక ప్రాంతంను వెంట చెత్తాచెదారం మట్టి కుప్పలు ఇసుక మేటలు ప్లాస్టిక్ తదితరులు పెద్దనాల యందు వెళ్లకుండా ముందస్తుగానే ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించి తొలగించుట జరిగినది. అందుకు డివిజన్ ప్రజలు రోడ్లపైన మురుగునీటి కాలువలలో పెద్దనాళాలు ప్లాస్టిక్ సంబంధించిన చెత్తాచెదారము వేయొద్దని ఇంటిలోని చెత్తను స్వచ్ఛ ఆటో టిప్పర్‌కు మాత్రమే ఇవ్వాలని కోరినారు. విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాలు రోడ్లపైన చెత్త వేసినచో అవి వర్షానికి నాలాలోకి వెళుతాయని పై నుండి వచ్చే వరదకు కింది ప్రాంతాలు మొత్తం జలమయం అవుతాయని ప్రజలు ఇబ్బందులు పడతారని దయచేసి వార్డు ప్రజలను కోరుకునేది ప్రతి ఇంటిలోని చెత్తను స్వచ్ఛ ఆటో టిప్పర్‌కు మాత్రమే ఇవ్వాల్సిందిగా విజ్ఞప్తి చేసినారు. కార్యక్రమంలో ప్రధాన రహదారి బవార్చి హోటల్ నుండి పవన్ మోటార్స్ తదితర ప్రాంతాలలో కార్యక్రమాలు చేపట్టారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా పారిశుధ్యం మెరుగుపడుతుందని అందుకు కమిషనర్ జిహెచ్ఎంసి ఆర్.వి. కర్ణన్, డిప్యూటీ కమిషనర్ జి రాజుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసినారు. ఇటువంటి కార్యక్రమాలు ఇంకా కొన్ని రోజులు కొనసాగిస్తే వార్డ్ సంపూర్ణతో పారిశుధ్యంతో ఉంటుందని భయంకరమైన అంటువ్యాధులు ప్రభలవని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని అందుకు ఏ కార్యక్రమం ఇంకా కొనసాగించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో మేకల రాము యాదవ్, టిఆర్ఎస్ నాయకులు, శానిటరీ సూపర్వైజర్ చింత శ్రీనివాస్, జి.నర్సింగ్ రావు, అలీ నవాజ్, చిట్టిబాబు, ప్రభాకర్, స్వప్న, భాగ్యరేఖ, టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా విజయోత్సవ సభ ఏర్పాట్లు ఘనంగా చేయాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : రైతు భరోసా విజయోత్సవ సభను విజయవంతంగా జరిగేలా అలాగే చేపట్టబోయే ఏర్పాట్లు ఘనంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ జోళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ సెక్రటేరియట్ ముందు గల రాజీవ్ విగ్రహం ఆవరణ ప్రాంగణంలో తేదీ 24న మంగళవారం సాయంత్రం రైతు భరోసా విజయోత్సవం సభ నిర్వహణ నేపథ్యంలో చేపట్టబోయే ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, తెలంగాణ రైతులను రాజులుగా చూడాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. రైతుల వ్యవసాయ పనులకు తొలకరికి ముందుగానే రైతు భరోసాను తొమ్మిది రోజులలో రూ. 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. రైతుల సంతోషాలు పంచుకోవడం కోసం రైతు నేస్తం వేదిక ద్వారా మంగళవారం సెక్రటేరియట్ ముందుగల రాజీవ్ విగ్రహం ప్రాంగణంలో విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు అట్టి కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు సహచర మంత్రులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. దేశంలో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా రైతులకు రూ.70 వేల కోట్లు రుణమాఫీ జరిగితే తెలంగాణలో ఇప్పుడు 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ కింద రూ.21 వేల కోట్లు చెల్లించటం జరిగిందన్నారు. ఇట్టి కార్యక్రమానికి అన్ని జిల్లాల నుండి రైతు భరోసా పొందిన లబ్ధిదారులు పాల్గొననున్నారని, కార్యక్రమం ఏర్పాట్లు ఎక్కడ కూడా లోపాలు లేకుండా, రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని మంత్రి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రాజీవ్ విగ్రహ ప్రాంగణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరంన్నర కాలంలో రైతుల కోసం చేపట్టిన కార్యక్రమాలను గుర్తుచేసుకుని రైతాంగంతో మాట్లాడి వారితో సంతోషాలన్ని పంచుకుంటారని మంత్రి తెలిపారు. సభ నిర్వహణ నేపథ్యంలో నిరంతర విద్యుత్, త్రాగునీరు అలాగే షామియానాలు, సీటింగ్ కెపాసిటీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితరు అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో కలసి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ అహమ్మద్ నదీమ్, హైదరాబాద్ కమిషనర్ పోలీస్ సివి ఆనంద్, అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్స్ ఎంఎం భగవత్, ట్రాన్స్పోర్ట్ శాఖ కమిషనర్ సురేందర్ మోహన్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్, ఐ అండ్ పి ఆర్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష, విద్యుత్ శాఖ ఎండి ముస్రాఫ్ అలీ ఫారుక్, జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి, వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కార దిశగా ప్రజావాణి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రతివారం సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి జిల్లా అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని అర్జిత నుండి దరఖాస్తుల స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి ప్రజావాణిలో అనేక సమస్యలపై అందించే దరఖాస్తులను జిల్లా అధికారులు శాఖల వారీగా క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా శాఖల వారీగా ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష చేస్తూ వచ్చే సోమవారం నాటికి పరిష్కరించాలని వచ్చే ప్రజావాణిలో రివ్యూ చేయడం జరుగుతుందని సూచించారు. ప్రజల నుండి వివిధ సమస్యలపై వచ్చిన మొత్తం 124 ఓర్పుగా విని, సంబంధిత అధికారులకు వాటిని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజావాణికి అధికారులంతా సమయానికి హాజరై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వీల్ చెయిర్‌పై వచ్చిన వికలాంగ వృద్ధ మహిళ కలెక్టర్‌ను కలవడానికి ప్రయత్నించగా, కలెక్టర్ స్వయంగా దయస్ నుండి దిగివచ్చి ఆమె వద్దకు వెళ్లి వినతిపత్రం స్వీకరించారు. ఆమె సమస్యను శ్రద్ధగా విని, సంబంధిత అధికారిని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యావరణ హిత దృక్పథంతో కలెక్టరేట్‌లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రజావాణి సమావేశాల్లో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల స్థానంలో స్టీల్ వాటర్ బాటిళ్లను వినియోగించడం ప్రారంభించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. హైదరాబాద్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నిశితా హార్ట్ స్ట్రోక్‌తో మృతి చెందడంతో ఆమెకు నివాళులర్పిస్తూ రెండు నిముషాలు అధికారులతో కలసి కలెక్టర్ మౌనం పాటించారు. అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, జి ముకుంద రెడ్డి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా అధికారులు ఆశన్న, కోటాజి, సిపిఓ డాక్టర్ సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, ఇన్చార్జి డిఆర్ఓ శ్రీధర్, ఏవో కలెక్టరేట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జులై 9న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జులై 9న దేశవ్యాపిత సార్వత్రిక సమ్మెను తెలంగాణ రాష్ట్రంలో సంపూర్ణంగ సమ్మె చేయాలని నేడు జరిగిన కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఫెడరేషన్‌లు, అసోసియేషన్‌లు సంయుక్త కార్యాచరణ సమావేశంలో కార్మిక వర్గాన్ని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ కోరారు. సికింద్రాబాద్‌లోని హెచ్.ఎం.ఎస్. యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడి ప్రభుత్వం 11 సంవత్సరాలలో అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను పూర్తిగ సవరించి, కార్పొరేటు పెట్టుబడిదారులకు, బడా వ్యాపారులకు మరింత సంపద దోచిపెట్టేందుకు, 47 కోట్ల కార్మికుల జీవితాలను దుర్భరపరుస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని యూనియన్లు ఈనెల 23 వరకు సమ్మె నోటీసులు ఇవ్వాలని ఆయన కోరారు. అన్ని యూనియన్లు, సంఘాలు, ఫెడరేషన్లు సదస్సులు, సభలు, సమావేశాలు, పత్రిక, మీడియా సమావేశాలు జరిపి జూల్కై 9న జరుగు సమ్మె విజయవంతం చేసేల తగినవిధంగా స్పందించాలని ఆయన కోరారు. జూన్ 25 నుండి 30 తేదీలోపు పారిశ్రామిక ప్రాంతాలు, పని ప్రదేశాలు, గ్రామాలు, కాలనీలు, మండల, జిల్లా కేంద్రాలలో సమావేశాలు జరిపి సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సెక్టారువారీగా, యూనియన్లు వారిగా సదస్సులు జరిపి కార్మికులలో సమ్మె జయప్రదం చేసేల చర్యలు తీసుకోవాలని కోరారు. కరపత్రాలను ముద్రించుకొని కార్మికుల, ప్రజలలో కేంద్ర ప్రభుత్వ ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానలపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. వాల్‌పోస్టర్లు నలుగురు గూడె ప్రదేశాలలో, పారిశ్రామిక వాడలలో అంటించి విస్తృత ప్రచారం చేయాలని, జుల్కై 9న సుందరయ్య పార్కు నుండి ఇందిరా పార్కు వరకు వేలాది మందితో ప్రదర్శన జరిపి ప్రభుత్వ వ్యతిరేక నిరసన సభ జరుగుతుందని ఆయన తెలిపారు. ఐఎన్‌టియుసి నుండి ఆర్.డి.చంద్రశేఖర్, విజయ్‌కుమార్ యాదవ్, ఎఐటియుసి నుండి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా, శ్రీనివాస్, కృష్ణమూర్తి, సిఐటియు నుండి పాలడుగు భాస్కర్, జె.వెంకటేష్, కుమారస్వామి, హెచ్.ఎం.ఎస్.నుండి రెబ్బ రామారావు, జి. విజయ్‌భాస్కర్‌రావు, ఎండి అమ్‌జాద్, పి.వై. నవీన్‌కుమార్, కె.మనోహర్, ఐఎఫ్‌టియు నుండి అనురాధ, టియుసిఐ నుండి ప్రవీన్‌కుమార్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాల రాష్ట్ర కార్యదర్శి వి.నాగేశ్వరరావు, టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.కె.బోస్, ఎబిఆర్ మోహన్‌రావు, సుబ్రహ్మణ్యం, ఎం.ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

సాయిప్రియ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ సాయిప్రియ కాలనీలో మౌలిక సదుపాయలు కల్పించాలని సోమవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సాయి ప్రియ కాలనీ అధ్యక్షుడు పులగం వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కమిషనర్ త్రిలేశ్వర్ రావుకి వినతిపత్రం అందజేశారు. కాలనీలో 600 పైగా కుటుంబాలు నివాసముంటున్న అక్కడ కనీస వసుతులు లేవని, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్, రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నరని కమీషనర్ త్రిలేశ్వర్ రావుకు వినతిపత్రం అందజేసినట్లు సాయిప్రియ నగర్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలు గుర్తించి త్వరితగతిన డ్రైనేజీ వ్యవస్థ, మంచినీటి వసతి పనులను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డి.రంజిత్ కుమార్, సాగర్ చారి, రమేష్ చారి. ఆర్.రమేష్, దయాకర్ రెడ్డి, శంకరచారి, జి. నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

పగటి వేషదారిలా వ్యవహరించే

కార్పొరేటర్‌కు ఎమ్మెల్యేను విమర్శించే స్థాయి లేదు

విశాలాంధ్ర, మల్కాజిగిరి : పగటి వేశగాని విధంగా వ్యవహరించే మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్‌కు మల్కాజిగిరి ఎమ్మెల్యేను మర్రి రాజశేఖర్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జేఏసీ వెంకన్న పేర్కొన్నారు. సోమవారం మల్కాజిగిరిలోని సరికొండ నరసింహారెడ్డి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్కాజిగిరి శాసన సభ్యులు రాజశేఖర్ రెడ్డి అభివృద్దే లక్ష్యంగా కృషి చేస్తున్నారని, పనులను పూర్తి చేయించేందుకు ప్రతి అధికారిని కలుస్తూ వినతి పత్రాలను అందజేస్తున్నారని ఆయన తెలిపారు. ఎమ్మెల్యేకు అనేక బీసీ సంఘాల నాయకులు కలిసి మినీ ట్యాంక్ బండ్‌పై మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారని, దీనిపై జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. దీనిపై కార్పొరేటర్ మహనీయుల విగ్రహాలు పెట్టనిచ్చేదని లేదని చెప్పడం సరికాదన్నారు. బీసిలు ఓట్లు వేయలేదా, చాకలి ఐలమ్మ, జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే, సర్వాయి పాపన్న లాంటి మహనీయులంటే అంత అలుసా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ఆస్తులు సంపాదించుకోవడానికో, కాపాడుకోవ దానికో రాలేదనే విషయాన్ని గుర్తెరగాలన్నారు. బిజెపి కార్పొరేటర్‌గా ఉండి ఇద్దరు మంత్రులు, ఒక ఎంపీ ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు వారి నుండి మల్కాజిగిరి అభివృద్ధికి తెచ్చారో చెప్పాలన్నారు. ఫోటోల కోసం రోజుకో వేషం మారుస్తూ ప్రజలు తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అని తెలిపారు. రాజశేఖర్ రెడ్డి ఇప్పటికే అనేక అభివృద్ధి పనులను చేపట్టారని అవి అన్ని ప్రజల ముందున్నాయన్నారు. మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ మాట్లాడుతూ కార్పొరేటర్ శ్రవణ్ చిత్తకార్తి కుక్కలా వ్యవహరిస్తూ, 150మంది కార్పొరేటర్లలో అవినీతి కార్పొరేటర్లలో మొదటి వ్యక్తిగా నిలుస్తారని, ఇండ్ల ముందు ఇసుక, ఇటుక పడితే వసూళ్ళకు ఎలా పాల్పడాలనే ఆలోచనే తప్పా అభివృద్ధి చేసింది లేదన్నారు. కార్పొరేటర్‌గా గెలిచిన కొద్ది రోజుల్లోనే బిల్డర్ వద్ద రూ.10 లక్షలకు కాజేశారని ఆరోపించారు. ఈ విధంగా అక్రమార్జన చేస్తూ ఆస్తులు కూడబెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. డబ్బుల కోసం డిమాండ్ చేసే క్రమంలో ఇతరుల ఫోన్‌ల నుండి మాట్లాడడం, లేదా నిర్మాణదారుణి వద్దకు పంపి అక్కడి నుండి మాట్లాడించడం చేస్తుంటారని తెలిపారు. ఈ కార్పొరేటర్‌కు సర్కిల్‌లోని ఇంజనీరింగ్ ఈఈ, డి.ఈ., ఏ.ఈ.లు వినతి ఎమ్మెల్యే ఇచ్చిన వినతి పత్రాలను అందజేస్తూ రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యధిక కాలం ఇక్కడే తిష్టవేసిన అధికారులను తక్షనం బదిలి చేయాలని డిమాండ్ చేశారు. బద్దం పరుశురాం రెడి, ఏ.కె.మురిగేష్, శ్రీనివాస్, రావుల అంజయ్య, తదితరులు మాట్లాడుతూ ఎమ్మెల్యేను మరో మారు విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. ఉస్మాన్, జి.కె.హన్మంరావు, రాము యాదవ్, నర్సింగ్ మాదిగ, హేమంత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఉజ్జయినీ మహంకాళి బోనాలకు సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం

విశాలాంధ్ర - హైదరాబాద్ : బోనాల ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా శ్రీ ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. జూలై 13న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌తో పాటు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, అర్చకులు కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా మహంకాళి ఆలయ అర్చకులు ముఖ్యమంత్రికి ఆశీర్వచనం అందించారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్లో దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : 2025-26 విద్య సంవత్సరమునకు గిరిజన బాల బాలికలకు బెస్ట్ అవైలబుల్ స్కూల్ (బిఏఎస్)లో ప్రవేశించుటకు గాను (35) సీట్లు మేడ్చల్ మల్కాజిరి జిల్లాకు మంజూరు చేయడం జరిగినది. అందులో 3వ తరగతులో (17) సీట్లు, 5వ తరగతిలో (9) సీట్లు, 8వ తరగతిలో (9) సీట్లు కేటాయించడం జరిగినది. కావున గిరిజన తెగలకు చెందిన లంబాడా, ఏరుకుల మరియు ఇతర ఉప- కులాలకు చెందిన విద్యార్థిని/విద్యార్థులకు దరఖాస్తు చేసుకోగలరని కోరనైనది. దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ: 27.06.2025, సాయంత్రము 5:00 గంటల వరకు, దరఖాస్తు ఫారములు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయము, ఎస్-30, జిల్లా అధికారుల సమీకృత కార్యాలయము, అంతాయపల్లి గ్రామము, శామీర్ పెట్ మండలం, మేడ్చల్-మల్కాజిరి జిల్లా నందు దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల:17 నుండి 27 వరకు పొడిగించబడినది. కావున దరఖాస్తు ఉచితముగా పొందగలరు, అట్టి దరఖాస్తుతో పాటు కావలిసిన ధ్రువీకరణ పత్రములు కులము, ఆదాయము, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ప్రస్తుతము చదువుచున్న పాఠశాల నుండి పొందిన బోనఫైడ్ సర్టిఫికెట్ (02) పాస్ పోర్ట్ సైజు ఫోటోలు (లేటెస్ట్) తో సమర్పించగలరు. కావున అర్హులైన గిరిజన విద్యార్థిని / విద్యార్థులు ఈ అవకాశమును సద్వినియోగము చేసుకోగలరని దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 17 నుండి 27 వరకు పొడిగించబడినది. వివరాలకు ఈ నెంబర్ 9959159629లో సంప్రదించాలన్నారు.

ఘనంగా హమీద్ పటేల్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్ జన్మదిన వేడుకలు ఆయన స్వగృహం శేరిలింగంపల్లి డోయన్స్ కాలనీలో కార్యకర్తలు, నాయకులు ప్రజల మధ్య ఘనంగా జరుపుకున్నారు. జన్మదిన వేడుక ఉత్సాహ వాతావరణంలో పండుగలాగా జరుపుకుంటున్న జన్మదిన వేడుకకు తెలంగాణ బిసి ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ పూలమాలతో శాలువాతో సన్మానం చేయడం జరిగింది. హమీద్ పటేల్ అందరికీ స్వాగతం పలుకుతూ మర్యాదపూర్వకంగా స్నేహపూర్వకంగా రిసీవ్ చేసుకోవడం జరిగింది. బేరి రామచంద్ర యాదవ్ ఆర్కే సాయన్న హమీద్ పటేల్ని ఉద్దేశించి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇలాంటి జన్మదినాలు ఎన్నో జరుపుకోవాలని రాజకీయంగా ఎదిగి పెద్దపెద్ద పదవులు పొందాలని అన్నారు. బేరి రామచంద్ర యాదవ్, ఆర్కే సాయన్న డాక్టర్ రమేషతో పాటు రూప రెడ్డి మంగమ్మ శ్యామల రఫియా బేగం యాదగిరి వెంకటేష్ శ్రీనివాస్ రెడ్డి గిరి గౌడ్, కొండాపూర్ డివిజన్ కార్యకర్తలు పాల్గొని ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ప్రజానీకం అనేక అనేకమంది పాల్గొని పెద్దలు ఆశీర్వదించారు మిత్రులందరు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆధునిక హిందూ జాతీయవాది శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ

విశాలాంధ్ర - మొయినాబాద్: జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆధునిక హిందూ జాతీయ వాదాన్ని ప్రగాఢంగా విశ్వసించేవారని భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రభాకర్ రెడ్డి అన్నారు. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని శ్రీరామ్ నగర్ గ్రామంలో భాజపా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ 1951లో భారతీయ జన సంఘ్‌ను స్థాపించిన ముఖర్జీ, దేశంలో ఒకే రాజ్యాంగం, ఒకే జెండా ఉండాలని కోరుకున్నారని తెలిపారు. 164వ బూత్ అధ్యక్షులు శివ గౌడ్ మాజీ ఉప సర్పంచ్ శివశంకర్ మాజీ వార్డు సభ్యులు అమరేందర్ రెడ్డి సుధాకర్ రెడ్డి, భాజపా నాయకులు చంద్రయ్య, మోహిన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, రమేష్, రఘుగౌడ్, మోహన్, మహేందర్‌చారి, శ్రీశైలం, భూపాల్ రెడ్డి, ప్రవీణ్, వినోద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ తల్లి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పటాన్ చెరువు : పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరువు డివిజన్ పరిధిలోని ముదిరాజ్ బస్తిలో గల శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం ఐదవ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హైదరాబాద్‌లోని బ్రహ్మ కుమారీస్ శాంతి సరోవర్ ప్రధాన కార్యాలయంలో జరిగిన "రొమ్ము క్యాన్సర్ ఏబిసిఎస్ ప్రతి మహిళ తెలుసుకోవలసిన విషయాలు" అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి 500 మందికి పైగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ, "గత మూడు నెలల క్రితం, మార్చి 2025లో మౌంట్ అబూలోని బ్రహ్మ కుమారీస్ ప్రపంచ ప్రధాన కేంద్రంలో ఆన్‌సైట్ మరియు ఆన్‌లైన్‌లో 'అత్యధిక సంఖ్యలో బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన తరగతులు' నిర్వహించి డా. రఘురాం రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించారు. ఆ తరగతిని నేడు హైదరాబాద్ శాంతి సరోవర్‌లో పునరావృతం చేయడం గొప్ప విషయం" అని అన్నారు. అంతేకాక, గత ఐదేళ్లుగా అక్టోబర్ నెలలో తెలంగాణ రాజ్‌భవన్‌ను గులాబీ రంగులో వెలుగులు వెలిగించి అవగాహన కల్పిస్తున్న డా. రఘురాం సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన డా. రఘురాం విధేయత, సంకల్పం నిజంగా ఆదర్శప్రాయమైనవని అన్నారు. గత 18 ఏళ్లుగా ఆయన చేపట్టిన వినూత్న కార్యక్రమాలు దేశంలో రొమ్ము క్యాన్సర్ నిర్వహణను కొత్త దిశగా నడిపించాయని తెలిపారు. కిమ్స్-ఉషాలక్ష్మి బ్రెస్ట్ డిసీజ్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్ మరియు ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ చైర్మన్ అయిన డా. పి. రఘురాం, అవగాహన ప్రసంగాన్ని నిర్వహించారు. ప్రతి నాలుగు నిమిషాలకు ఒక కొత్త రొమ్ము క్యాన్సర్ కేసు, ప్రతి ఎనిమిదో నిమిషానికి ఒక మరణం జరుగుతోందని తెలిపారు. దేశంలో ప్రతి సంవత్సరం 2 లక్షల కొత్త కేసులు, 1 లక్ష మరణాలు నమోదవుతున్నాయని చెప్పారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

విశాలాంధ్ర - పటాన్ చెరువు : తెలంగాణ రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ అన్నారు. 9 రోజుల్లో రూ.కోట్లలో రైతు భరోసా నిధులు విడుదల చేసి, కోటి 49లక్షల 39వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సోమవారం గాలి అనిల్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ, ఎకరాకు రూ.12వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు ప్రభుత్వం భరోసా కల్పించిందన్నారు. రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున రైతు భరోసా సంబురాలు నిర్వహించాలని సూచించారు.

సిపిఐ రాష్ట్ర మహా సభలను ఆదరించండి

విశాలాంధ్ర - జవహర్‌నగర్ : జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సిపిఐ పార్టీ రాష్ట్ర 4వ, మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ కార్యక్రమాలను వివరిస్తూ ఇంటింటికి సిపిఐ పార్టీ కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్ బోస్ పేదల కోసం మరియు కార్మికుల కర్షకుల కోసం నిరంతర సేవలు చేస్తూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నుంచి సిపిఐ పార్టీ 4వ, మహాసభలను జయప్రదం చేయాలని మరియు సిపిఐ ప్రజా పోరాటాలను ముందుండి నడిపిస్తూ కార్మిక వర్గాల పక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ నేపథ్యంలో ప్రజలంతా పార్టీకి అండగా ఆర్థిక సహకారం అందించాలని మరియు మహాసభకు దాతలు విరాళాలు ఇచ్చి పార్టీ యొక్క మహాసభలకు సహకారం అందించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్,శంకర్ రావు, నిమ్మల నరసింహ, మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, లక్ష్మీనారాయణ, గిరిజన సమైక్య నాయకురాలు స్వరూప ఏఐటీయూసీ మండల అధ్యక్షుల ఏ.ఎల్లయ్య, సిపిఐ నాయకులు కే కురుమయ్య, సూర్యం రాజు, నాయక్ రవి నాయక్ ,మండల మహిళా సమైక్య ప్రధాన కార్యదర్శి కే కవిత, పి.నరసింహ, నాని తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీ, సూపర్‌టెక్ ఈవీ పబ్లిక్ ఇష్యూ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : సూపర్‌టెక్ ఈవీ లిమిటెడ్ - ఎలక్ట్రిక్ టూ వీలర్లు (E2W), ఎలక్ట్రిక్ త్రీ వీలర్లు (E3W)పై దృష్టి సారించి, భారతీయ ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) మార్కెట్‌లో అగ్రగామి శక్తిగా ఉన్న వాటిలో ఒకటి, దాని %వాటీజు% పబ్లిక్ ఇష్యూ నుండి రూ. 29.90 కోట్ల వరకు సేకరించాలని యోచిస్తోంది. బీస్, సెమీ ప్లాట్‌ఫామ్‌లో దాని పబ్లిక్ ఇష్యూను ప్రారంభించడానికి కంపెనీకి ఆమోదం లభించింది. పబ్లిక్ ఇష్యూ జూన్ 25, 2025న సబ్‌స్క్రిప్షన్ కోసం ప్రారంభమవుతుంది మరియు జూన్ 27న ముగుస్తుంది. రూ. 29.90 కోట్ల ప్రారంభ పబ్లిక్ ఆఫరింగ్ అనేది పూర్తిగా కొత్తగా జారీ చేయబడిన 32,49,600 ఈక్విటీ షేర్ల ఇష్యూ, ఒక్కొక్కటి రూ. 10 ముఖ విలువ కలిగి ఉంటుంది. ఈ ఇష్యూ ధర పరిధి రూ. 87- రూ. 92. ఇష్యూ ద్వారా వచ్చే ఆదాయంలో, కంపెనీ రూ. 16.50 కోట్లను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు నిధులు సమకూర్చుకోవడానికి, రూ. 3 కోట్లను కొన్ని రుణాలలో కొంత భాగాన్ని తిరిగి చెల్లించడానికి మరియు మిగిలిన వాటిని సాధారణ కార్పొరేట్ ప్రయోజనాలకు, ఇష్యూ సంబంధిత ఖర్చులకు ఉపయోగించాలని యోచిస్తోంది. దరఖాస్తు కోసం కనీస లాట్ సైజు 1,200 షేర్లు, అంటే ఒక్కో షేరుకు రూ. 92 అధిక ధర పరిధిలో రూ. 1,10,400 కనీస పెట్టుబడి.

బిసి కుల వృత్తులచే తయారు చేసిన

వస్తువుల ప్రదర్శన, విక్రయాలు

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ బోనాల ఉత్సవాలు సందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 25 నుండి 29 వరకు (5) రోజులు బి.సి. చేతివృత్తుల కళాకారులచే తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన అలాగే విక్రయం టాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహం ప్రక్కన గల ప్రదేశంలో చేపట్టనున్నట్లు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారు చేసిన మట్టిపాత్రలు, గౌడన్నలచే 'నిరా' స్టాల్, మేదరి వారు తయారు చేసిన వెదురు వస్తువులు, హ్యాండ్ లూమ్స్ (పోచంపల్లి ఇక్కత్, గద్వాల్, నారాయణపేట్) పూసలవారి సామగ్రి అలాగే ఇతర బిసి వర్గాలచే తయారు చేసిన వస్తువులు, ఇది కాకుండా తెలంగాణ వంటకాలు, బెస్త సోదరులచే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ ప్రదర్శించబడతాయని తెలిపారు. అలాగే తయారు చేసిన వస్తువులు కొనుగోలుకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఇట్టి ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 09:30 గంటల వరకు ఉంటుందని అలాగే ప్రదర్శనకు ప్రవేశం ఉచితం కలదని తెలిపారు. అదేవిధంగా మార్కెట్ దరలకు అనుగుణంగానే దరలు నిర్ణయించబడ్డాయని, జిల్లా ప్రజలందరు ఇట్టి సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అలాగే వారికి నచ్చిన వస్తువులు గాని భోజనం గాని కొనగోలు చేసి చేతివృత్తుల వారిని ప్రోత్సహించాలని మంత్రి ఒక ప్రకటనలో కోరారు.

దోమల నివారణకు ఏఎల్‌ఓ కార్యక్రమాలు చేపట్టాలి : కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : దోమల నివారణకు ముమ్మరంగా ఏ.ఎల్.ఓ కార్యక్రమాలు చేపట్టాలని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. అడిషనల్, జోనల్ కమిషనర్‌లు, ఆయా విభాగాల హెచ్.ఓ.డిలతో సోమవారం ఉదయం దోమల నివారణ, శానిటేషన్, కోర్టు కేసులపై కమీషనర్ సెల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఆయా జోన్‌లలో ఎంటమాలజీలో పనిచేస్తున్న సిబ్బంది ఏ.ఎల్.ఓ కార్యక్రమాలు చేయకుండా ఇతర విధులు కేటాయించినట్లు తెలిసినందున వారిని ఏ.ఎల్.ఓ కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్, డిప్యూటీ కమిషనర్‌లను ఆదేశించారు. చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్క వలన దోమల ఉత్పత్తి ఎక్కువయ్యే అవకాశం ఉంటుందని, గుర్రపు డెక్క తొలగింపునకు ప్రణాళిక తయారు చేయాలని అడిషనల్ కమీషనర్ లేక్స్ ,హెల్త్ ను ఆదేశించారు. వార్డులోని మిగిలిపోయిన కాలనీ లలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమీషనర్ ప్రత్యేక డ్రైవ్ ప్రగతిపై శానిటేషన్ ఏ.సి ని వివరణ కోరారు. ఈ సందర్భంగా ఏ.సి శానిటేషన్ రఘు ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుండి 25 తేదీ వరకు ముందస్తు వర్షాకాలం శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ ఇప్పటి వరకు 120 వార్డులో పూర్తయ్యా యని, 3900 మెట్రిక్ టన్నుల సి అండ్ డి వేస్ట్, 5400 మెట్రిక్ టన్నుల చెత్తను తొలగిం చినట్లు వివరించారు. డిప్యూటీ కమీషనర్ రిప్లై పంపించే సందర్భంగా సంబంధిత జోనల్ కమీషనర్ ఆమోదంతో కోర్టుకు పంపించాలని సూచించారు.

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిష్కరించాలి: కమిషనర్

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ అధికారులకు సూచించారు. సోమవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నగరంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కమిషనర్ వినతులు స్వీకరించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను ఆయా విభాగాలకు పంపి తక్షణ చర్యలకు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్.వి.కర్ణన్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదును ఆయా విభాగాల అధికారులు బాధ్యతతో పరిశీలించి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం మెరుగుపరుచుకుని ఒకే ఫిర్యాదు రిపీట్ కాకుండా నివారించాలని సూచించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 78 విన్నపాలు వచ్చాయన్నారు. అడిషనల్ కమిషనర్‌లు వేణుగోపాల్, సత్యనారాయణ, యాదగిరి రావు, వేణుగోపాల్ రెడ్డి, పంకజ, నళిని పద్మావతి, సిసిపి శ్రీనివాస్, విజిలెన్స్ అడిషనల్ ఎస్ పి శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ అడిషనల్ సి సి పి లు వెంకన్న, గంగాధర్, ప్రదీప్ రంజిత్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, డిప్యూటీ సి ఈ పనస రెడ్డి, హౌసింగ్ ఎస్ ఈ పి వి రవీందర్, రాజేశ్వర రావు, ఏ ఈ బాలాజీ, ఎస్ ఎన్ డి పి డిప్యూటీ సి ఈ పి వి రావు, ఎస్టేట్ ఆఫీసర్ ఉమా ప్రకాష్, అడ్వర్టైజ్మెంట్ ఆఫీసర్ మహమ్మద్ దుర్గన భాను పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నదని, ఈ నరమేధ చర్యలు వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఖైరతాబాద్ చౌరస్తా నుండి రాజ్‌భవన్‌కు ర్యాలీగా వెళ్తున్న కార్యకర్తలను అడ్డుకుని, పోలీసులు అక్రమ అరెస్టు చేశారు. తోపులాటలో పలువురు నేతలకు గాయాలు అయ్యాయి. అరెస్ట్ చేసిన నేతలను పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలి మాట్లాడుతూ దండకారణ్యం తుపాకుల గర్జనతో దద్దరిల్లుతున్నదని, మావోయిస్టులతో పాటు గిరిజనుల నెత్తురు ఏరులై పారుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. 'మావోయిస్టు రహిత భారత్' కోసమంటూ చేపట్టిన 'ఆపరేషన్ కగార్' నిజంగా నక్సల్స్ను నిర్మూలించడం కోసమేనా? అదే నిజమైతే ఆదివాసులను అడవుల నుంచి తరిమేయడం దేనికి? యథేచ్ఛగా మానవ హక్కుల్ని ఉల్లంఘిస్తూ చేస్తున్న ఈ మారణ హోమం వెనుక ఉన్న ఉద్దేశమేంటి? ప్రజల్లో ఉద్భవిస్తున్న ఇలాంటి ప్రశ్నలకు కేంద్ర సర్కార్ సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో బొగ్గు, ఇనుము, సున్నపు రాయి, డోలమైట్, బాక్సైట్ నిక్షేపాలకు ప్రసిద్ధి. దేశంలో టిన్ ఖనిజాన్ని ఉత్పత్తి చేసే ఏకైక రాష్ట్రం ఇదేనన్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపదపై దేశ బడా కార్పొరేట్ల కన్నుపడిందని, అత్యున్నత స్థాయి గ్రేడ్ ఇనుప ఖనిజం (హెమటైట్)ను వారికి కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కేంద్రం ఒప్పందం కూడా చేసుకుందని వారు తెలిపారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని భారత రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 21 జీవించే హక్కును కాలరాస్తున్న నరేంద్రమోదీ విధానాలను మరింత లోతుగా ప్రజల్లోకి తీసుకువెళ్తామని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్, చేపూరి కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఆర్. బాలక్రిష్ణ, చిలుక రాజ్ శ్రీను, సల్మాన్ బేగ్, శివ కుమార్, మహమూద్, మాజీద్, కొండూరి వెంకటేష్, అశోక్, బిచ్చల శ్రీనివాస్, హేమంత్, నయీమ్, అశోక్, వెంకటేష్, సురేష్, మధు, మధుకర్, శోభన్, వీరన్న, వెంకట్, రజనీకాంత్, నాగేశ్వరరావు, సంజయ్, వర్మ, గణేష్ లతో పాటు 30మంది పాల్గొన్నారు.

అరెస్ట్ చేసిన ఏఐవైఎఫ్ నేతలను పరామర్శించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నర్సింహా...

ఆపరేషన్ కగార్‌ను ఆపాలని ఏఐవైఎఫ్ చేపట్టిన రాజ్ భవన్ ముట్టడిలో అరెస్ట్ చేసిన నేతలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, ఏఐవైఎఫ్ రాష్ట్ర నిర్మాణ బాధ్యులు ఈటీ. నర్సింహా పంజాగుట్ట పోలీస్ ఠాణాలో పరామర్శించారు.

వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులు, గిరిజనులపై చేస్తున్న బూటకపు ఎన్కౌంటర్ లన్నీ ప్రభుత్వ హత్యలేనని వారు ఆరోపించారు. అరెస్ట్ చేసిన నేతలను బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

రైతు పక్షపాతి కాంగ్రెస్

విశాలాంధ్ర - అమనగల్లు: పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన పిలుపు మేరకు, మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలను విజయవంతం చేయాలని, టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్ పార్టీ శ్రేణులకు, రైతులకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని, పెద్ద ఎత్తున్న రైతులతో కలిసి పండుగల ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజుల్లో రూ. 9 వేల కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసి, 1కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేలు ఇవ్వగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఎకారకు రూ.12 వేల చొప్పున ప్రతి రైతుకు రైతు భరోసా అందించిందని, 100 శాతం రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో 9 రోజులల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం తెలంగాణ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వనికే దక్కిందని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు ఈ సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులు జాప్యం లేకుండా పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారలకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి డిఆర్‌ఓ హరిప్రియతో కలిసి కలెక్టరు (117) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని అదనపు కలెక్టరు అన్నారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు.

విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన కార్పొరేటర్

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిధన్ దివస్ సందర్భంగా మైలర్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని సాయిబాబా నగర్‌లో మైలార్ దేవ్‌పల్లి డివిజన్ వన్ అధ్యక్షుడు పాండు యాదవ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని స్కూల్ విద్యార్థులు ఉపాధ్యాయులు పార్టీ నాయకులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో వారి వారి బూతులో వారి బూత్ సభ్యులతో కలిసి తప్పకుండా మొక్కలు నాటాలని తెలియజేయడం జరిగింది. భారతీయ జనతా పార్టీ జన్ సంఘ్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ దేశం కోసం ప్రాణాలర్పించిన మహానుభావుడు అని తెలియజేయడం జరిగింది. సంతు గాడ్, రావుల భాస్కర్, రమణ గుప్త, మురళీధర్ రెడ్డి, బొమ్మరాజు నరసింహ మధుసూదన్ రెడ్డి, గోపాల్ నాయక్, రాజుస్వామి, బబ్లు శ్రీకాంత్ రెడ్డి, ప్రభుదాస్, ఎన్ను శంకర్ రెడ్డి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

లక్ష్మీ విహార్ కాలనీలో పర్యటించిన గాంధీ

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : లక్ష్మీ విహార్ ఫేజ్ 2 కాలనీలో సోమవారం స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీ కమిటీ సభ్యులతో కలిసి పర్యాటించారు. కొన్ని రోజులముందు కురిసిన వర్షాలకు కాలనీలో ఇండ్లల్లో వరదనీరు చేరి, ముఖ్యంగా డ్రైనేజీ పొంగి నష్టం జరిగిన ఇండ్ల యజమానులను కలవడం జరిగింది. కాలనీ అధ్యక్షులు రవీంద్ర ప్రసాద్ దూబే అభ్యర్థన మెరకు పాడైన డ్రైనేజీ పైపులను మార్చి కాలనీలో డ్రైనేజీ పొంగకుండా చర్యలు తీసుకోవలసినదిగ, ప్రాంతం హెచ్ఎండబ్ల్యుఎస్ డీజీఎంని ఆదేశించారు. స్థానికుల విన్నపం మెరకు రైల్వే ఫ్లైఓవర్ నల్లగండ్ల వైపు అభివృద్ధి చేయలని విన్నపం మేరకు జీహెచ్ఎంసీ అధికారులను అదేశిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కాలనీ అధ్యాక్షులు రవీంద్ర ప్రసాద్ దూబే, ప్రధాన కార్యదర్శి రఘువీర్, కోశాధికారి నర్సింహారావు, ఉపాధ్యాక్షులు గురుదత్, కార్యదర్శులు విద్యాసాగర్, రాజేంద్రకుమార్, రాజు అల్లూరి, సబ్యులు సత్యనారాయణ రెడ్డి, రాంసుబ్బారెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టం అమలు చేయండి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్రంలో అధిక ఫీజులు వసూలుచేస్తూ దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చెర్యలు తీసుకొని, అధిక ఫీజుల వసూళ్లను నియంత్రిచాలని అలాగే విద్య హక్కు చట్టం తక్షణమే అమలు చేసి ప్రైవేట్ పాఠశాలలలో నిరుపేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించేందుకు వెంటనే చెర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నేతలు ఎండి. సోహైల్, డా.లక్ష్య నాయుడు, సలావుద్దీన్‌లు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో డిప్యూటీ కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లేకపోవడంతో విద్యార్థులు తల్లితండ్రులు ప్రైవేట్ పాఠశాలలకు ఆశ్రయిస్తున్నారని, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులుతోపాటు డొనేషన్లు, వార్షిక ఫీజులు, స్కూల్ డ్రెస్‌లు, పుస్తకాలు వంటివి బలవంతంగా అంటగట్టి దోపిడీకి గురిచేస్తున్నారని తెలిపారు విద్య హక్కు చట్టం సమర్థవంతంగా ఎందుకు అమలు చేయడంలేదని వారు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రైవేట్ పాఠశాలల అధిక ఫీజులను నియంత్రించాలని, విద్య హక్కు చట్టం అన్ని ప్రైవేట్ పాఠశాలలలో అమలు చేయాలనీ వారు డిమాండ్ చేశారు.

శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివి



తుర్కయంజాల్ - విశాలాంధ్ర : శ్యాం ప్రసాద్ ముఖర్జీ సేవలు మరువలేనివని తుర్కయంజాల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ ఫ్లోర్ లీడర్ కరాడి శ్రీలత అనిల్ కుమార్ అన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి పురస్కరించుకొని వారి ఆధ్వర్యంలో గ్రామంలో అన్ని వార్డులలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిం చడం జరిగింది. ఈ సందర్భంగా కరాడి శ్రీలత అనిల్ కుమార్ మాట్లాడుతూ భావితరాల ప్రజలకు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ చరిత్ర గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని దేశంలో మహోన్నతమైన వ్యక్తుల్లో ఆయన ఒకరని విద్యావంతుడు పేదల అభ్యున్నతి కోసం పాటుపడ్డ మహా నాయకుడని వారు దేశం కోసం ధర్మం కోసం నవ సమాజ స్థాపన కోసం బడుగు బలహీన వర్గాల చేయూత కోసం వారు పాటుపడ్డారని అన్నారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఘన నివాళులు అర్పిస్తూ ఉమార్ ఖాన్ గూడలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గజ్జల ప్రమీల కృష్ణా రెడ్డి, బిక్కుమల్ల వెంకటేష్ గుప్తా, పండుగల రాము, పుట్టల దీక్షిత్, కట్ట టిల్లు, చింతాల విగ్నేశ్వర్, నరసింహ, గడ్డం శేఖర్ స్థానికులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దుండిగల్‌లో భారీ గంజాయి పట్టివేత

విశాలాంధ్ర-దుండిగల్: దుండిగల్ స్టేషన్ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్ వద్ద పోలీసులు గంజాయి స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకొని దాదాపు 120.17 కిలోల గంజాయి, నెక్స కార్, 5 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు మేడ్చల్ జిల్లా డిసిపి కోటిరెడ్డి తెలిపారు. సోమవారం దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.ఆదివారం సాయంత్రం 4 గంటలకు దుండిగల్ పోలీసులకు, ఎస్‌ఓటి మేడ్చల్ జోన్ బృందానికి టాటా నెక్సెస్ కార్‌లో విశాఖపట్నం నుండి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు గుండ హర్యానా రాష్ట్రానికి అక్రమ గంజాయిని రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు వెంటనే ఉన్నత అధికారులకు విషయాన్ని తెలియజేసి వారి నుండి అనుమతి పొంది దుండిగల్, ఎస్‌ఓటి మేడ్చల్ జోన్ పోలీసులు నోటరీ నెంబర్ 1 టోల్ ప్లాజా రోడ్ సమీపంలో దుండిగల్ ఎగ్జిట్ నెంబర్ 5, దుండిగల్ మండలం మేడ్చల్ జిల్లాకు వెళ్లి గంజాయి రవాణాదారుల కోసం వేచించారు.అదే సమయంలో దుండిగల్ నుండి పఠాన్ చెరువు వైపు ఓఆర్ ఆర్ సర్వీస్ రోడ్డు గుండా టాటా నెక్సెస్ కారు AP 40 DM 8365 రావడాని గమనించిన పోలీసులు ఆ వాహనాన్ని ఆపడంతో అందులో నుంచి ఒక వ్యక్తి పోలీసుల ను చూసి పారిపోవటానికి ప్రయత్నించిన అతని పట్టుకొని అక్రమ గంజాయి గురించి ప్రశ్నించారు. వారి కదలికలు మరింత అనుమానాస్పదంగా ఉండటంతో కారును తనిఖీ చేయగా డిక్కీలో గోధుమ రంగు టేప్‌తో చుట్టిన గంజాయి 43 ప్యాకెట్లు కనిపించాయి. తాను అక్రమ గంజాయి రవాణాదారుడని, పరారిలో ఉన్న నిందితుడనని, పరారీలో ఉన్న బజరంగ్ ప్రధాన రిసీవర్ అని, నిందితులు హన్మంత్, రాజ్ కుమార్ దేవరాజుకి పెడ్లర్లు అని ఆయన పేర్కొన్నారు.అది చాకచక్యంగా గంజాయి స్మగ్లర్లను పట్టుకున్న మేడ్చల్ జోన్, దుండిగల్ పోలీసుల బృందం పనిని ఉన్నతాధికారులు అభినందించి, తగిన నగదు బహుమతులతో అవార్డులను ప్రకటించారు.

విద్యతోనే బంగారు భవితకు భాటలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : విద్యతోనే బంగారు భవితకు భాటలు వేయొచ్చని బాచుపల్లి మాజీ సర్పంచ్, 16 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కాంగ్రెస్ నాయకులు ఆగంపాండు ముదిరాజ్ పేర్కొన్నారు. ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా పురస్కరించుకొని, సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పరిధి ఇందిరా నగర్, బాచుపల్లి విలేజ్, రాజీవ్ గాంధీ నగర్, సాయి నగర్‌లలో, జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆగంపాండు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులుగా దినదిన అభివృద్ధి చెందాలని, కృషి పట్టుదలతో విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, దేశానికి సేవలు అందించిన ఎందరో మహానుభావుల అడుగుజాడల్లో మీరు నడవాలని ఆకాంక్షించారు.అలాగే చదువుకొని ఉత్తీర్ణులై తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చే ప్రతి విద్యార్థిని, విద్యార్థులకు తాను ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని అన్నారు.

ప్రవీణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బేరి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : ప్రవీణ్ కుమార్ జన్మదిన ఉత్సవ వేడుక చందానగర్ లోని క్రిస్టల్ గార్డెన్‌లో ఘనంగా జరుపుకున్నారు. క్రిస్టల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఈ జన్మదిన వేడుకల్లో శేరిలింగంపల్లి నియోజక వర్గ ప్రజలు హైదరాబాద్ ప్రజలు మిత్రులు అనేకమంది పాల్గొన్నారు. బేరీ రామచంద్ర యాదవ్ తెలంగాణ రాష్ట్ర ఐక్యవేదిక బీసీ అధ్యక్షుడు పాల్గొని ప్రవీణ్ అన్నగారికి సన్మానం చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో నూరేళ్లు చల్లగా బ్రతకాలని సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని భగవంతుని కోరుకోరడం జరిగింది. బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు ఆర్కే సాయన్న ముదిరాజ్ జన్మదిన వేడుకల్లో పాల్గొని ప్రవీణ్ గారికి దీవిస్తూ నూరేళ్లు చల్లగా బ్రతికి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని భగవంతుని ప్రార్థిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో బేరి రామచంద్ర యాదవ్ ఆర్కే సాయన్నతో పాటు బి కృష్ణ అడ్వకేట్ రమేష్ యాదవ్ నరసింహ ముదిరాజ్ నర్సింగ్ ముదిరాజ్ సంగారెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు సహా పాల్గొన్నారు.

బీజేపీతో దేశానికి ముప్పు

- రాజ్యాంగానికి... లౌకిక వాదానికి విఘాతం
- పేదరికం, నిరుద్యోగం, అవినీతి
- దేశ రక్షణకు ఐక్యంగా ఉద్యమిద్దాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలో లౌకిక వాదానికి, అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి విఘాతం కలిగించే విధానాలు అనుసరిస్తోందని, దీనివల్ల దేశానికి ప్రమాదకరమని. ఈ విధానాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సోమవారం అనంతపురంలో సీపీఐ నగర కార్యదర్శి ఎన్.శ్రీరాములు అధ్యక్షతన జరిగిన నగర మహాసభలలో రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుల, మతాల మధ్య ఘర్షణ సృష్టించి రాజకీయ లబ్ధి పొందడానికి కుట్రలు చేస్తోందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఒక్క మంచి పని కూడా చెప్పుకోవడానికి ఏమీ లేదన్నారు. అసత్యపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చి దేశ ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. తాము అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమైందని, రైతులను, కార్మికులను, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా భారతదేశంలో 14.60 కోట్ల మంది ప్రజలు ఇప్పటికీ పేదరికంలో మగ్గుతున్నారని తెలిపారు. అవినీతి, నిరుద్యోగం పెరిగిందన్నారు. దేశంలో ఒక శాతం ఉన్న సంపన్న వర్గాల వారికి దోచిపెట్టడానికి మోదీ ప్రభుత్వం పని చేస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ విధానాలను ప్రశ్నించే వారిపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దుర్మార్గంగా వ్యవహరిస్తూ ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగారని, ట్రంప్ విధానాలను వ్యతిరేకించాలన్నారు. ప్రపంచంలో శాంతి నెలకొనాలంటే కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి రావలసిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ అగ్రభాగాన నిలిచిందని, ఎంతో మంది ప్రాణ త్యాగాలు చేశారని, అగ్ర నాయకులు జైలుకు కూడా వెళ్లారని గుర్తు చేశారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ సీపీఐ అని, నిరంతరం పేద ప్రజల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలను నిర్వహించిందని తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటంలో 4,500 మంది ప్రాణాలర్పించారని, అనంతపురం జిల్లాలో కూడా సీపీఐ అనేక భూ పోరాటాలను నిర్వహించి పేదల పక్షపాతిగా నిలిచిందన్నారు. రాష్ట్ర పార్టీ ఏ పిలుపు ఇచ్చినా అనంతపురం జిల్లాలో విజయవంతం చేయడంలో సీపీఐ నాయకులు అగ్రభాగాన ఉంటారని ప్రశంసించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సుదీర్ఘ పోరాటాలు నిర్వహించడంలో సీపీఐ ఇతర రాజకీయ పార్టీల కంటే ముందంజలో ఉందని చెప్పారు. రాష్ట్ర సమితి ప్రతి పిలుపును విజయవంతంగా చేపట్టిన ఘనత పోరాటంలో పాల్గొన్న ప్రతి కార్యకర్తకు చెందుతుందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సి.మల్లికార్జున మాట్లాడుతూ జిల్లా రైతాంగ సమస్యలపై రైతులను కూడగట్టుకుని పోరాటం చేయడంలో కీలకపాత్ర పోషించామన్నారు. సాగునీటి ఉద్యమం, పండ్ల తోటల రైతాంగ సమస్యలు, రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ బ్యాంకు రుణాలు తదితర వాటిపై చేసిన పోరాటాలను వివరించారు.

సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జె.రాజారెడ్డి మాట్లాడుతూ కార్మిక వర్గం తుడుచుపెట్టుకుపోయేలా ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగుతోందని విమర్శించారు. కార్మిక, కర్షక, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం సీపీఐ పోరాడుతూనే ఉంటుందని తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు జాన్సన్ బాబు, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి పద్మావతి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష కుమార్, సీపీఐ నగర సహాయ కార్యదర్శులు బి.రమణయ్య,అల్లీపీరా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్, చేతివృత్తి దారుల సంఘం రాష్ట్ర నాయకులు వై.రామాంజనేయులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతు రాయుడు, కె.కుల్లాయిస్వామి, ఏఐయూటీసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు చిరంజీవి, కృష్ణుడు, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, ఈశ్వరయ్య, జయలక్ష్మి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ర్యాలీ

మహాసభ ప్రారంభానికి ముందు వేల మంది కార్యకర్తల నినాదాల నడుమ రాష్ట్ర చేతి వృత్తి దారుల సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్ సి.లింగమయ్య... సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి జాఫర్ సమక్షంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ మహాసభలలో ప్రజానాట్య మండలి కళాకారులు ఆలపించిన పాటలు ఉత్తేజితులను చేశాయి. దాదాపు 500 మందికి పైగా యువకులు, మహిళలు ఎరుపు రంగు వస్త్రాలు ధరించి ఎర్ర జెండాలను చేబూని సాగిన ర్యాలీ అనంతపురం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ర్యాలీలో పాల్గొన్న మహిళలు, ఇతర కార్యకర్తలను రామకృష్ణ అభినందించారు.

ట్రంప్‌కు నోబెల్ ప్రతిపాదనపై
పాక్‌లో రాజకీయ దుమారం

ఇస్లామాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు 2026 సంవత్సరానికి గాను నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ పాకిస్థాన్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదన... ఆ దేశంలో వివాదాస్పదంగా మారింది. ఇరాన్‌లోని అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేసిన నేపథ్యంలో, ట్రంప్‌కు నోబెల్ పురస్కారం ఇవ్వాలన్న నిర్ణయాన్ని తక్షణమే పునఃసమీక్షించాలని పాకిస్థాన్‌లోని ప్రతిపక్షాలు షరీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్యతో పాకిస్థాన్ ప్రభుత్వం అంతర్జాతీయంగా నవ్వులపాలైందని ప్రతిపక్ష నేతలు మండిపడుతున్నారు. ప్రతిపక్ష పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్ (పీటీఐ) శాసనసభ్యుడు అలీ ముహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ... ఇజ్రాయిల్-ఇరాన్ వివాదంలో తమ దేశం ఇరాన్‌కే మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. ఇరాన్‌పై దాడులకు పాల్పడిన వ్యక్తికి నోబెల్ బహుమతి ప్రతిపాదించడం ద్వారా ట్రంప్, పాకిస్థాన్ ప్రభుత్వాన్ని సిగ్గుపడేలా చేశారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షరీఫ్ ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి, ఆ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

జమియత్ ఉలేమా-ఇ-ఇస్లాం (జేయూఐ-ఎఫ్) పార్టీ అధినేత మౌలానా ఫజ్లుర్ రెహ్మాన్ కూడా ఈ విషయంపై తీవ్రంగా స్పందించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శాంతికాముకుడు కాదని, ఆయన చర్యలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని అన్నారు. పలస్తీనా, సిరియా, లెబనాన్, ఇరాన్‌లపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు మద్దతు ఇస్తున్న ట్రంప్ ఎలా శాంతిదూత అవుతారని ఆయన ప్రశ్నించారు. పాక్ ఆర్మీ చీఫ్ (సీఓఏఎస్) అసిమ్ మునీర్‌తో ట్రంప్ సమావేశం కావడం, ఆయనకు విందు ఇవ్వడం వల్లే పాక్ ప్రభుత్వం ఈ ప్రతిపాదన చేసి ఉండవచ్చని రెహ్మాన్ అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన కూడా డిమాండ్ చేశారు.

పాక్ మాజీ సెనేటర్ ముషాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ, ట్రంప్ శాంతి కోసం పాటుపడే నాయకుడు కాదని, ఉద్దేశపూర్వకంగానే ఆయన పలు యుద్ధాలకు మద్దతు పలుకుతున్నారని ఆరోపించారు. అన్ని దేశాలను నాశనం చేయాలనే ఆలోచనతో ట్రంప్, అమెరికా పతనానికి అధ్యక్షత వహిస్తున్నారని దుయ్యబట్టారు. రక్తంతో తడిసిన ఆయన చేతులకు శాంతి బహుమతి అందుకునే అర్హత లేదని ముషాహిద్ హుస్సేన్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

కాలువల మరమ్మతులకు తక్షణ చర్యలు

కేవీవీ ప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: కాలువల మరమ్మతులకు తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లాలో సాగునీటి కాలువల మరమ్మతు పనుల్లో జాప్యంపై ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా సమితి సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించింది. కాలువలు మురుగునీటిమయమై ప్రజారోగ్యానికి ముప్పుగా మారాయని, తక్షణ చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ పశ్చిమ కృష్ణా డెల్టా ఆయకట్టు సుమారు 5.71 లక్షల ఎకరాలకు విస్తరించి ఉందని, అయితే సాగునీటి కాలువల పరిస్థితి చూస్తే వ్యవసాయానికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకపోతున్న ప్రభుత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 40 కోట్ల అంచనా వ్యయంతో 917 పనులను ప్రతిపాదించినప్పటికీ కాలువల గట్టుల బలోపేతం, పూడిక తొలగింపు, షట్టర్ల ఏర్పాటు వంటి పనుల్లో పురోగతి కనిపించడం లేదని తెలిపారు. ప్రత్యేకంగా విజయవాడ ప్రకాశం బ్యారేజీ నుంచి గుంటూరు జిల్లాకు నీరు అందించే 47 కిలోమీటర్ల గుంటూరు చానల్ పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందని ఆయన వివరించారు. ఈ కాలువ ద్వారా మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో సుమారు 30 వేల ఎకరాల సాగునీరు అందుతుందని, అలాగే మంగళగిరి, గుంటూరు కార్పొరేషన్లకు తాగునీరు కూడా అందిస్తుందని తెలిపారు. అయినప్పటికీ ఈ కాలువ ప్రస్తుతం మురుగు కాలువలా మారిపోయి ప్రజారోగ్యానికి పెద్ద ముప్పుగా మారిందని అన్నారు. గతంలోనూ ఇదే సమస్యపై కలెక్టర్‌కు విన్నవించినప్పటికీ, ఎలాంటి కార్యాచరణ కనిపించలేదన్నారు. గుంటూరు హై లెవల్ చానల్‌కు 2019లో రూ.9 కోట్లు కేటాయించినా ఇప్పటి వరకు కేవలం రూ.5.5 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య మాట్లాడుతూ నల్ల డ్రెయిన్ సుమారు 60 కిలోమీటర్ల మేర ఉందని, దీనిద్వారా లక్ష ఎకరాల సాగుభూమికి నీరు అందుతుందని చెప్పారు. అయితే ప్లాస్టిక్ వ్యర్థాలు, తూట, గుర్రపుడెక్క కారణంగా ఈ కాలువలో నీటి ప్రవాహం ఆగిపోతున్నదని తెలిపారు. ఈ సమస్యలన్నింటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ రైతు సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. ప్రధాన కాలువలు, అనుబంధ కాలువల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని, గుంటూరు చానల్ నీటిని శుద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, హై లెవల్ చానల్, నల్ల డ్రెయిన్‌కు తగిన నిధులు కేటాయించి మిగిలిన పనులను పూర్తి చేయాలని కోరారు. అలాగే గుంటూరు చానల్‌ను ప్రకాశం జిల్లా వరకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందించాలని, కాలువ త్రవ్వకానికి రూ.250 కోట్లు, భూసేకరణ నష్టపరిహారానికి రూ.376 కోట్లు విడుదల చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.జగన్నాథం, అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి, నాయకులు పాపారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి మోదీ వెన్నుపోటు

- టీడీపీ, వైసీపీ అరాచకాలపై పోరాటం
- జగన్ కారు కిందే సింగయ్య మృతి
- పీసీసీ అధ్యక్షురాలు షర్మిల

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెన్నుపోటు పొడుస్తున్నారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. నియోజకవర్గాల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొనేందుకు సోమవారం ఆమె తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, వైసీపీ, జనసేనతో పొత్తు పెట్టుకుని బీజేపీ కేంద్రంలో కొనసాగుతున్నదని విమర్శించారు. అయితే రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన పోలవరం, రాజధాని, విశాఖ ఉక్కు సమస్యలపై మోదీ సహకరించడం లేదన్నారు. వైసీపీ బయట నుంచి మద్దతు ఇస్తే, టీడీపీ జనసేన నేరుగా పొత్తు పెట్టుకున్నాయని తెలిపారు. అయినా రాష్ట్రానికి నరేంద్ర మోదీ వెన్నుపోటు పొడుస్తున్నారని, ప్రత్యేక హెూదా ఇవ్వలేదని ఆరోపించారు. తిరుపతి వేదికగా మోదీ ఎన్నికల సమయంలో 10 సంవత్సరాలు ప్రత్యేక హెూదా ఇస్తామని ప్రకటించారని... అయినా ఇవ్వడం లేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి ప్రజలకు తెలియజేయడానికి, కాంగ్రెస్ పార్టీ బలం పెంచడానికి, అభిప్రాయాలు, సూచనలు తెలుసుకోవడానికి పర్యటన చేస్తున్నట్లు ఆమె వివరించారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే నిజాయితీగా ప్రజల సమస్యలపై పోరాడుతున్నదని, అన్ని పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి ఉంటే... ఏపీకి ప్రత్యేక హెూదా వచ్చేదని తెలిపారు. వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి కారు కిందపడి సింగయ్య అనే వ్యక్తి మృతి చెందారని, అయితే ఫేక్ వీడియోగా ప్రచారం చేయడం దారుణమన్నారు. ఒక వ్యక్తి కారు కింద పడి టైరు ఈడ్చుకు వెళ్లినా ఫేక్ వీడియోగా చెప్పడం దారుణమని విమర్శించారు. క్షమాపణ చెప్పకపోగా ఫేక్ వీడియో అని మీడియా ముందుకు రావడం మరింత దారుణం అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలను సానుభూతి ఉందని, ప్రజలకు మరింత చేరువ కావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇంఛార్జ్ తలపా దామోదర్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒమన్‌లో ఇక ఆదాయంపై పన్ను!

ఒమన్: గల్ఫ్ దేశాల్లో ఒకటైన ఒమన్ ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాల గురించి అన్వేషిస్తోంది. ఇందులో భాగంగా ఆదాయంపై పన్ను వేయాలనుకుంటోంది. 2028 నుంచి అమల్లోకి తీసుకురావాలని చూస్తోంది. ఏడాదికి 42 వేల రియాల్స్ (1.09 లక్ష డాలర్లు) కంటే ఎక్కువ సంపాదించేవారికి 5 శాతం చొప్పున పన్ను వేయాలని ఒమన్ భావిస్తోంది. పన్ను పరిధిలోకి వచ్చే వారి సంఖ్య 1 శాతంగా ఉండొచ్చని అంచనా వేస్తోంది. ఇది అమలులోకి వస్తే ఆదాయంపై పన్ను వేస్తున్న తొలి గల్ఫ్ దేశంగా ఒమన్ నిలవనుంది. గల్ఫ్ దేశాలకు ముడి చమురే ప్రధాన ఆదాయ వనరు. గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్‌లోని ఆరు దేశాలూ ఆర్థికంగా పరిపుష్టిగా ఉన్నాయి. ఈ ఏడాది మాత్రం సౌదీ అరేబియా, బహ్రెయిన్ దేశాలు ద్రవ్యలోటు ఎదుర్కొనే అవకాశం ఉందన్న అంచనాలు ఉన్నాయి. అయితే అంతర్జాతీయంగా శిలాజ ఇంధనాలకు డిమాండ్ తగ్గుతున్నందున దీర్ఘకాలంలో ఆదాయపు పన్ను వంటి సంస్కరణలు వంటివి తీసుకురావాల్సిన అవశ్యకత ఉంటుందని ఐఎంఎఫ్ పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో చమురుపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని ఒమన్ భావిస్తోంది. తద్వారా వచ్చే ఆదాయాన్ని సంక్షేమానికి వెచ్చించాలనుకుంటున్నట్లు ఒమన్ ఆర్థిక మంత్రి బిన్ మహ్మద్ అల్ సఖ్రి తాజాగా పేర్కొన్నారు. జీసీసీలోని ఇతర దేశాలకు ఒమన్ తీసుకున్న నిర్ణయం ఆదర్శం కావొచ్చని ఆర్థిక వేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆయా దేశాలు కూడా క్రమంగా ఆదాయపు పన్ను వైపు మళ్లే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం గల్ఫ్ దేశాల్లో ఆదాయంపై పన్ను ఉండదన్న కారణంతోనే ఇతర దేశాల్లోని సంపన్న వర్గాలకు చెందిన వారు ఇక్కడ నివాసం ఏర్పరచుకోవడం గమనార్హం.

ఉగ్రమూకలను వణికించిన 'ఆపరేషన్ సిందూర్': రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: ఉగ్రవాదులకు వణుకు పుట్టించడంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న రాజ్‌నాథ్... రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తన రెండో ఏడాది పదవీకాలం (ఆగస్టు 2023- జులై 2024) లో చేసిన 51 ప్రసంగాల కలెక్షన్‌తో రూపొందించిన పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్యం చేపట్టిన ఆపరేషన్ అన్ని లక్ష్యాలనూ సాధించిందన్నారు. వింగ్స్ టు అవర్ హోప్స్ వాల్యూమ్-2 అనే ఈ గ్రంథం 2047 నాటికి వికసిత్ భారత్‌ను నిర్మించాలనే లక్ష్యాన్ని సాధించేందుకు ఒక మార్గనిర్దేశకత్వాన్ని అందిస్తుందని అభిప్రాయపడ్డారు.

నోబెల్ పురస్కారానికి ట్రంప్ అనర్హుడు: నారాయణ



విశాలాంధ్ర-విజయవాడ: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌నకు నోబెల్ శాంతి అవార్డు తీసుకునే అర్హత లేదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. నోబెల్ శాంతి పురస్కారానికి ట్రంప్‌ను పాకిస్థాన్ ప్రతిపాదించడం అవకాశవాదం, దుర్మార్గమన్నారు. మీడియాతో సోమవారం ఆయన మాట్లాడుతూ... యుద్ధోన్మాది ట్రంప్... ప్రపంచ దేశాలకు తక్కువ ధరలకు ఆయిల్ సరఫరా చేస్తున్న ఇరాన్‌పై దాడి చేయడం హేయమన్నారు. ట్రంప్ చర్యలను ప్రధాని మోదీ ఖండించకపోవడం బాధాకరమన్నారు. భారతదేశ విదేశాంగ విధానం సమర్థవంతంగా, న్యాయబద్ధంగా ఉండాలన్నారు. ట్రంప్ దుశ్చర్యలపై మోదీ నోరు విప్పాలన్నారు. ట్రంప్ దమననీతిని వ్యతిరేకించాలని సూచించారు. ప్రపంచదేశాలను కూడగట్టి ట్రంప్‌నకు వ్యతిరేకంగా మాట్లాడాల్సిన బాధ్యత ప్రధాని మోదీపై ఉందన్నారు. అహంకారి ట్రంప్ దుందుడుకు ప్రవర్తనను అన్ని దేశాలూ ఖండాలని నారాయణ పేర్కొన్నారు.

బుగ్గమఠం భూములపై పెద్దిరెడ్డికి చుక్కెదురు

హైకోర్టులోనే తేల్చుకోవాలని సూచించిన సుప్రీం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బుగ్గ మఠం భూముల వ్యవహారంపై సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. పెద్దిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ ఎన్‌కే సింగ్ ధర్మాసనం విచారణ చేసింది. దీనికి సంబంధించి హైకోర్టునే ఆశ్రయించాలని పెద్దిరెడ్డికి న్యాయస్థానం సూచించింది. అంతవరకూ బుగ్గ మఠం భూములపై రెండు వారాలపాటు యథాతథా స్థితి కొనసాగించాలని పేర్కొంది. సింగిల్ జడ్జి ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అప్పటి వరకు, బుగ్గ మఠం భూములపై రెండు వారాలపాటు స్టేటస్ కో కొనసాగించాలని ఆదేశించింది. అనంతరం ఏపీ హైకోర్టు చట్ట ప్రకారం, మెరిట్స్ ఆధారంగా ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనం సూచించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది మణిందర్ సింగ్ వాదనలు వినిపించారు. బుగ్గమఠం భూముల వ్యవహారంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ కోటీశ్వర్‌సింగ్‌ల ధర్మాసనం నిరాకరించింది. దీంతో ఈ పిటిషన్‌పై విచారణ ముగించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న రిట్ పిటిషన్‌పై డివిజన్ బెంచ్ నిర్ణయం తీసుకుంటుందని, కేసు మెరిట్స్‌లోకి తాము వెళ్లడం లేదని, హైకోర్టు మెరిట్స్ ఆధారంగా చట్ట ప్రకారం నిర్ణయం తీసుకుంటుందని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. సోమవారం నుంచి రెండు వారాల పాటు యథాతథ స్థితిని కొనసాగించాలని, ఆ తర్వాత హైకోర్టు ఎలాంటి నిర్ణయం అయినా తీసుకునే స్వేచ్ఛ ఉంటుందని న్యాయస్థానం పేర్కొంది.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలపై ఫెడరేషన్ హర్షం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు సైతం స్థానిక మండలాలలో బదిలీలకు అవకాశం కల్పించినందుకుగాను ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎండీ జాని పాషా, బత్తుల అంకమ్మరావు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ధన్యవాదాలు తెలిపారు. ఫెడరేషన్ అందించిన వినతిపై సానుకూలంగా స్పందించి స్థానిక మున్సిపాల్టీలలోనే బదిలీలకు అవకాశం కల్పిస్తూ జీవో 6 విడుదల చేశారన్నారు. ఒకే శాఖకు చెందిన ఉద్యోగులకు రెండు రకాల నిబంధనలు ఎంతమాత్రం సమంజసం కాదనే విషయాన్ని ప్రభుత్వ పరిశీలించాలని కోరారు.

ఎన్నికలెప్పుడొచ్చినా వైసీపీదే విజయం: సజ్జల

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు, కక్షసాధింపు చర్యలు, వేధింపులు, రెడ్‌బుక్ రాజ్యాంగం ఇలా ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినప్పటికీ...రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసీపీ రికార్డు మెజార్టీలతో గెలుస్తుందని... ప్రజల్లో, పార్టీ కార్యకర్తల్లో ఇదే చర్చ జరుగుతోందని వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చంద్రబాబు సంక్షేమ పథకాలు అమలుచేయడం లేదని, లా అండ్ ఆర్డర్ పూర్తిగా నాశనమైందని, సామాన్యులు కూడా బలవుతున్నారని వివరించారు. ప్రజలను చైతన్యం చేయడానికి అవసరమైన కార్యక్రమాలు నిరంతరం చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ గెలుపును అడ్డుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారని, వాటిని దీటుగా ఎదుర్కొందామని చెప్పారు. పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, అసెంబ్లీ విభాగ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులు హాజరయ్యారు.

ఇళ్ల పట్టాల కేసులో పేర్నికి ఊరట

ఇళ్ల పట్టాల కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని)కి భారీ ఊరట లభించింది. ఏపీ హైకోర్టులో ఆయన పిటిషన్‌పై విచారణ నిర్వహించిన ధర్మాసనం కీలక ఆదేశాలు జారీజేసింది. ఇళ్ల పట్టాల వ్యవహారంతో పేర్ని నానిపై ఆరోపణలు రావడంతో ఆయన హైకోర్టులో ఈనెల 11వ తేదీన ముందస్తు పిటిషన్ వేశారు. తనపై ఎలాంటి చర్యలు తీసుకోకూడదని అభ్యర్థించారు. తనకు, తన కుమారుడు పేర్ని కిట్టుకి ఈ వ్యవహారంలో ఎలాంటి ప్రమేయం లేదని తెలిపారు. దీంతో పేర్ని నాని వివరణ తీసుకోకుండా ఎలాంటి కేసు నమోదు చేయవద్దని పోలీసులకు హైకోర్టు స్పష్టం చేసింది.

నమో భారత్ ర్యాపిడ్ రైళ్ల ట్రయల్ రన్ విజయవంతం

న్యూఢిల్లీ: ఢిల్లీ సరాయ్-మోదీపూర్ మధ్య నమో భారత్ ర్యాపిడ్ రైళ్ల ట్రయల్ రన్ తొలిసారి విజయవంతంగా నిర్వహించారు. 82 కిలోమీటర్ల మార్గాన్ని రైలు గంటలోనే పూర్తి చేసింది. ట్రయల్ రన్ సమయంలో మీరట్ మెట్రో సైతం నమో భారత్ రైళ్లతో పాటు నడిచాయి. మీరట్‌లో శతాబ్దినగర్ నుంచి మోదీపూర్ వరకు రెండు నమో భారత్, మెట్రో రైళ్లతో ట్రయల్ రన్ కొనసాగుతున్నది. ట్రయల్ రన్ సమయంలో నమో భారత్ రైళ్లు మొత్తం 82 కిలోమీటర్ల దూరాన్ని 160 కిలోమీటర్ల వేగంతో నడిచాయి. సరాయ్ కాలే ఖాన్ నుంచి మోదీపూర్ మధ్య ఉన్న ప్రతి స్టేషన్‌లోనూ రైళ్లు ఆగాయి. ఎన్‌సీఆర్‌టీసీ నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం... గంటకంటే తక్కువ సమయంలోనే సరాయ్ నుంచి మోదీపూర్ చేరుకుంది. ఈ విజయం ఢిల్లీ, ఘజియాబాద్, మీరట్‌లను కలిపే భారత తొలి నమో భారత్ కారిడార్‌లో కీలమైన మైలురాయని నిపుణులు పేర్కొన్నారు. ప్రపంచంలోనే తొలి ఎల్‌టీఈ బ్యాక్‌బోన్‌పై పనిచేసే ఈ అధునాత ఈటీసీఎస్ లెవెల్-3 హైబ్రిడ్ సిగ్నలింగ్ వ్యవస్థ, ప్రతి స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్లాట్‌ఫారం స్క్రీన్ డోర్స్ సైతం ట్రయల్ రన్ సమయంలో ఎలాంటి లోపాలు లేకుండా విజయవంతంగా పని చేసినట్లు అధికారులు తెలిపారు.

నేను భయపడే రకం కాదు

బహిష్కరణపై తేజ్ ప్రతాప్ యాదవ్

పాట్నా: ఆర్‌జేడీ అధ్యక్షుడు బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను ఇటీవల పార్టీ నుంచి, కుటుంబం నుంచి బహిష్కరించారు. క్రమశిక్షణా రాహిత్యంతో పార్టీకి, కుటుంబానికి చెడ్డపేరు తెస్తున్నారనే ఆరోపణలతో ఆయనపై బహిష్కరణ వేటు వేశారు. దీనిపై తాజాగా తేజ్ ప్రతాప్ స్పందించారు. తాను భయపడే రకం కాదని, పరిస్థితులకు ఎదురు నిలిచి పోరాడుతానని చెప్పారు. తనపై బహిష్కరణ వేటు పడటానికి పార్టీలోని నలుగురైదుగురు వ్యక్తులే కారణమని, వాళ్ల పేర్లు సమయం వచ్చినప్పుడు బయటపెడతానని అన్నారు. బీహార్ ప్రజలకు తన స్వభావం గురించి తెలుసునని, నలుగురైదుగురు వ్యక్తుల కారణంగా తనను పార్టీ నుంచి ఎలా బహిష్కరించారో వారంతా చూశారని చెప్పారు. న్యాయం కోసం తాను ప్రజల మధ్యకే వెళతానని అన్నారు. తనకు ప్రాణహాని ఉందని, ప్రభుత్వం తనకు భద్రత పెంచాలని కోరుతూ కోర్టుకు వెళతానని అన్నారు. తేజస్వి ముఖ్యమంత్రి కావడానికి అన్ని విధాలుగా తన సహకారం ఉంటుందన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.